ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026

ప్రతి అక్షరం ప్రజల కోసం www.prajapaksham.in

# ప్రజాపక్షం

సంపుటి 29, సంచిక: 112 | ఆదివారం | 11-10-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00



# బెదరని యువత

● ఆటంకాలను అధిగమించి విడతల వారీగా జంతర్‌మంతర్ చేరుకున్న వందలాది మంది యువతీ యువకులు ● ఎక్కడికక్కడే అడ్డుకున్న పోలీసులు ● సిజెపి, ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఐసా కార్యకర్తలు, ఎంపిలు, న్యాయవాదులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు అరెస్టు ● మాజీ సిఎంలు విజయన్, మమత, కేజ్రీవాల్, మాణిక్ సర్కార్‌లు కూడా ● జర్నలిస్టులనూ వదిలిపెట్టని ఖాకీలు ● నిరసనలో 5000 మంది అదుపులోకి ● గస్తీ నీడలో దేశ రాజధాని


నేహా బోరా


సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండ



## విమానంలోనే దీప్కే, అశుతోశ్, సౌరవ్‌ల అరెస్ట్

ముంబై నుంచి ఢిల్లీకి బయలుదేరిన సిజెపి అధ్యక్షుడు అభిజీత్ దీప్కేను పోలీసులు ఉదయం 10 గంటలకు విమానంలోనే అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు సిజెపి ప్రతినిధులు అశుతోశ్ రాంకా, సౌరవ్ దాస్‌లను కూడా విమానంలోనే నిర్బంధించారు. వీళ్ళను అదుపులో తీసుకునేందుకు ఢిల్లీ మహిళా పోలీసులను అదే విమానంలో ముంబై నుంచి వెంబడించారు. సిజెపి ప్రతినిధులు తాము అరెస్టుకు సిద్ధంగానే ఉన్నామని చెబుతున్నప్పటికీ వినకుండా పోలీసులు విమానం నుంచి దింపి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా వారు 'ఇంక్విలాబ్ జిందాబా' అంటూ నినాదాలు చేశారు. ఈ ఉద్యమానికి మద్దతిస్తున్న ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీని గురుగ్రామ్‌లోని నివాసం నుండి, సిజెపి లీగల్ హెడ్ రత్నా సింగ్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నారు. ప్రధాన నాయకులందరినీ పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో సిజెపి తరుపున ఇకపై అజింక్య షిండే నాయకత్వం వహిస్తారని అంతకుముందే రికార్డు చేసిన వీడియోను అభిజీత్ దిప్కే విడుదల చేశారు.

అభిజీత్ దీప్కే నాయనమ్మ మృతి 07


బిజెపి ప్రధాన కార్యాలయం ఎదుట వామపక్షాల కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు


సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది షాదన్ ఫరాసత్‌ను చొక్కాపట్టుకొని లాకెళ్తున్న పోలీసులు

**న్యూఢిల్లీ :** అసాధారణ రీతిలో దేశ రాజధాని ఢిల్లీ శనివారం దుర్భేద్యంగా మార్చేసినప్పటీ, ఆటంకాలను చేధించుకొని వందల సంఖ్యలో యువతీ యువకులు విడతల వారీగా, బృందాలు జంతర్ మంతర్‌కు చేరుకున్నారు. అందరికంటే ముందు ఇద్దరు యువతులు ఎలాగో అలాగా జంతర్ మంతర్‌కు చేరుకొని పోలీసులను ఆశ్చర్యపరిచారు. వారిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో నిరసనను వ్యతిరేకిస్తూ కొందరు అక్కడికి చేరుకొన్నప్పటికీ, వారిని పోలీసులు ఏమనకపోవడం విశేషం. సిజెపి, ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఐసా తదితర సంఘాలు, ప్రదర్శన నిర్వహించిన న్యాయవాదులు, ఎంపిలు, పౌర సమాజ సభ్యులు, ప్రతిపక్ష పార్టీల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. నిరసనను కవర్ చేస్తున్న జర్నలిస్టులను సైతం విడిచిపెట్టకుండా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 5 వేల మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విద్యార్థి సంఘాల నాయకులతో పాటు, ఢిల్లీలోని వివిధ ప్రాంతాల నుంచి జంతర్ మంతర్‌కు వెళ్ళేందుకు ప్రయత్నించిన సిపిఐ జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండ, కె.ప్రకాశ్‌బాబు, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, మాజీ ముఖ్యమంత్రులు పినరాయ్ విజయన్, అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, మానిక్ సర్కార్, సిపిఐ పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

**అజయ్ భవన్ నుంచి ప్రదర్శన**

సిపిఐ, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్, పలు ప్రజాసంఘాల కార్యకర్తలుగా సిపిఐ ప్రధాన కార్యాలయం అజయ్‌భవన్ నుంచి విడతల వారీగా ప్రదర్శనగా జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించారు. కొన్ని ప్రదర్శనల్లో సిపిఐ(ఎం), ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ కార్యకర్తలు కూడా కలిసి వచ్చారు. సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండ, నేతృత్వంలో సాగిన ఒక ప్రదర్శన బిజెపి ప్రధాన కార్యాలయం వద్దకు చేరగానే పోలీసులు అడ్డుకున్నారు. అయినప్పటికీ, విద్యార్థి, యువజన సంఘాల కార్యకర్తలను పోలీసులను నెట్టుకుంటూ వెళ్ళి, బ్యారికేడ్‌లను తొలగించి పరిగెడుతూ ముందుకు సాగారు. కాస్త ముందుకు తరువాయి 8లో

## ఐక్య పోరాటంతో ప్రభుత్వ పతనం

మోదీ సర్కార్ ఫాసిస్టు పద్ధతులకు సిపిఐ ఖండన

ధైర్యంగా నిలబడి పోరాడుతున్న విద్యార్థి, యువతకు అభినందన

**న్యూఢిల్లీ:** ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేస్తున్న ప్రదర్శకులపట్ల బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ,ఫాసిస్టు పద్ధతులను భారత కమ్యూనిస్టుపార్టీ(సిపిఐ) జాతీయ కార్యదర్శివర్గం తీవ్రంగా ఖండించింది.ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.ఈ పోరాటం ఆగదని,ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా మరింతగా విస్తరిస్తుందని,ప్రజాప్రదర్శకుల ఐక్యతే ప్రభుత్వ పతనానికి కారణమవుతుందని హెచ్చరిక జారీ చేసింది.ప్రభుత్వ అణచివేతను ప్రతిఘటించి ధైర్యంగా నిలబడిన యువకులు,విద్యార్థులకు అభినందనలు తెలియజేసింది.''జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి,ఎన్నికల వ్యవస్థలో సమూల సంస్కరణలు తీసుకురావాలి,మా డిమాండ్లు చాలా స్పష్టంగా ఉన్నాయి'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ప్రకటించింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ తరువాయి 8లో


తమిళనాడులో సిఎం విజయ్‌తో రాహుల్‌గాంధీ భేటీ

## ఎంతమంది పోలీసులను తెచ్చుకున్నా... పోరాటం ఆగదు

ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్‌గాంధీ సవాల్

రాజ్యాంగాన్ని కాపాడేందుకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి సవాల్ విసిరారు. నిరసనలు చేస్తున్న నాయకులు, యువత సహా ఎంతమందినైనా అరెస్టు చేసుకోవచ్చని అన్నారు. అయినా తమ పోరాటం ఆగదని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. గత పదేళ్లకు పైగా ప్రధాని మోదీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)తో తాను పోరాడుతున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో రాహుల్ ఆ వ్యాఖ్యలు చేయడం తరువాయి 8లో

## విమానంలో అరెస్టులా!

మోదీది అత్యంత పిరికి ప్రభుత్వం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు విమానంలో ఢిల్లీకి వచ్చిన యువకులను విమానంలో నుంచే అరెస్టు చేయడమేంటి? వారేమైనా ఉగ్రవాదులా? అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా యువత, ప్రతిపక్షాలు సాగిస్తున్న ఉద్యమానికి మోదీ ప్రభుత్వం బెంబేలెత్తిపోతోందని విమర్శించారు. జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొనేందుకు ముంబై నుంచి ఢిల్లీకి వచ్చిన సిజెపి అధ్యక్షుడు అభిజిత్ దీప్కే తదితరులను విమానంలో నుంచే అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. దేశంలోని బ్యాంకులను లూటీ చేసి విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరగాళ్లను పట్టుకోలేని కేంద్ర ప్రభుత్వం.. యువతపై ప్రతాపం చూపడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. దేశ చరిత్రలో మోదీ ప్రభుత్వం అత్యంత పిరికిపంద ప్రభుత్వంగా మిగిలిపోతుందని విమర్శించారు.

# ఎల్‌నినోతో సంక్షోభం

● గ్రామస్థాయి నుంచి ప్రజలను అప్రమత్తం చేయాలి ● సమస్యలపై అవగాహన కల్పించాలి ● చేతికొచ్చిన పంటలను కాపాడేందుకు చర్యలు చేపట్టండి ● తక్షణ ప్రణాళికలు సిద్ధం చేయండి ● అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం



ప్రజాపక్షం/ హైదరాబాద్

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్నినో పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలో శనివారం ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. భవిష్యత్ లో తీవ్రమైన సంక్షోభం ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగు నీరు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎల్నినో ప్రభావంతో రానున్న సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్ లో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని తరువాయి 8లో


(ఎఐటియుసి భవన్)


(బస్ భవన్)

# ఎంప్లాయీస్ యూనియన్ సంబురాలు

ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికల్లో ఘనవిజయంతో బస్ భవన్ వద్ద ఇయు, ఎన్ఎంయు, టిఎంయు విజయోత్సవాలు

కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం

'ఇయు' కూటమి నేతల ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, హక్కుల సాధనే లక్ష్యంగా తమ కూటమి పోరాటం కొనసాగిస్తుందని ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, రాష్ట్ర కార్యదర్శి, ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న స్పష్టం చేశారు. కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ పూర్తయ్యే వరకు విశ్రమించబోమని ప్రకటించారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు ఇచ్చిన తీర్పు తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమికి మద్దతుగా నిలిచిన కార్మికులకు అభినందనలు తెలిపారు. బస్‌భవన్ వద్ద శనివారం ఎంప్లాయిస్ యూనియన్ (ఇయు), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎంయు), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు) నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి బాణసంచా కాల్చి, విజయోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈదురు వెంకన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జెఎసి కూటమికి కార్మికుల నుంచి విశేష మద్దతు లభించిందని తెలిపారు. సుమారు 5 వేల నుంచి 6 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించామని వెల్లడించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్, కరీంనగర్ తదితర ప్రధాన రీజియన్‌లలో కార్మికులు తమ కూటమికి అండగా నిలిచారని చెప్పారు. 26 డిపోలున్న హైదరాబాద్ రీజియన్‌లో 24 డిపోలను కైవసం చేసుకోవడం కార్మికుల ఐక్యతకు నిదర్శనమన్నారు. ఈ విజయాన్ని తరువాయి 12లో

## ఇద్దరు పిల్లలతో కలిసి బావిలోకి దూకి తల్లి ఆత్మహత్య

**కురవి:** మహబూబాబాద్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండల పరిధిలోని లింగయ్య తండాకు చెందిన బానోతు నవీన్ అనూష దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. శనివారం మధ్యాహ్నం బానోతు అనూష (26) తన చిన్న కుమార్తె వర్షిణి(9), కుమారుడు విశాల్ కృష్ణ(4)ను తండా శివారులోని వ్యవసాయ బావి వద్దకు తీసుకొని వెళ్లింది. వారితో సహా అందులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రమైనా అనూష ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె కోసం వెతికారు. పొలం వద్ద ఉన్న బావిలో అనూష మృతదేహాన్ని గుర్తించారు. అందులోకి దిగి గాలించగా ఇద్దరు పిల్లల మృతదేహాలు లభ్యమయ్యాయి. సమాచారం అందుకున్న మహబూబాబాద్ రూరల్ సిఐ అంజలి, కురవి ఎస్ఐ సతీశ్ ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# తీరొక్క పూలు పేర్చి...

అట్టహాసంగా బతుకమ్మ సంబురాలు ప్రారంభం

రవీంద్రభారతిలో వేడుకలకు హాజరైన మంత్రులు జూపల్లి, పొన్నం ప్రభాకర్

బతుకమ్మ పాటలతో మార్మోగిన ప్రాంగణం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ సంబురాలు ఏరాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి.. బతుకు చిత్రమే పాటగా మార్చి సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడారు. శనివారం నుంచి 9 రోజుల పాటు బతుకమ్మ సంబురాలు కనుల పండువగా జరగనున్నాయి. మహిళలు సహజసిద్ధమైన తీరొక్క పూలతో ఇంటింటా బతుకమ్మను పేర్చి... పసుపు, కుంకుమలతో గౌరమ్మను చేసి భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఆ తర్వాత వరుసగా అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు, నానేబియ్యం, అట్ల, అలిగిన, వేపకాయ, వెన్నముద్దల బతుకమ్మల ఉత్సవాలు జరుగుతాయి. చివరిరోజు సద్దుల బతుకమ్మను రాష్ట్ర వ్యాప్తంగా తరువాయి 8లో


హనుమకొండ వేయిస్తంభాల గుడిలో

## ఓట్ చోరీపై సమగ్ర విచారణ

సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలి

శవయాత్రలో ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

ఓటరు హక్కులను హరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్), అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేసి, ఓటర్ల జాబితాల నుంచి అక్రమంగా తొలగించిన పేర్లపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఓట్ల చోరీ, ఎస్ఐఆర్ రద్దు, జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలన్న డిమాండ్ చేస్తూ ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితుల ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ తరువాయి 8లో






## ఆ తాబేలు వయసు 194 ఏళ్లు!



ప్రపంచంలో అత్యంత వృద్ధ భూచర జంతువుగా గుర్తింపు పొందిన 'జొనాథన్' అనే అల్డాబ్రా భారీ తాబేలు వయసు ఇప్పుడు అక్షరాలా 194 సంవత్సరాలు. సెయింట్ హెలెనా ద్వీపంలో నివసిస్తున్న ఈ తాబేలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. ఇది 1832లో జన్మించినట్లు అంచనా. 1882లో అది ఆ ద్వీపానికి తీసుకొచ్చారు. అప్పటికే పెద్దదిగా ఉండేది. అంటే దాదాపు రెండు శతాబ్దాలుగా అది భూమిపై జీవిస్తోంది. ఇంత అసాధారణమైన దీర్ఘాయువుకు కారణం ఏమిటో తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు 'జొనాథన్' జన్యు నిర్మాణాన్ని అధ్యయనం చేశారు. డిఎన్‌ఎ మరమ్మతు, కణాల్లో శక్తి ఉత్పత్తి, ఇన్సులిన్ నియంత్రణ, టెలోమీర్ల నిర్వహణ వంటి అంశాలకు సంబంధించిన కొన్ని జన్యు లక్షణాలు అతని శరీరంలో ప్రత్యేకంగా ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా వయసు పెరిగినప్పటికీ కొన్ని జన్యు నియంత్రణ ప్రాంతాలు యువ తాబేళ్లలో కనిపించే లక్షణాలను కొనసాగిస్తున్నట్లు పరిశోధన సూచించింది. 'జొనాథన్' దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించే జీవులపై పరిశోధనకు కొత్త ఆలోచనలు అందిస్తున్నది.

## అంగారకుడిపై భారీ మేఘం



అంగారక గ్రహం (మార్స్)పై ఒక అద్భుతమైన వాతావరణ దృశ్యాన్ని శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. దాదాపు 1,000 మైళ్ల పొడవు ఉన్న భారీ మేఘం అక్కడ ఏర్పడి, కొంతకాలం తర్వాత మాయమవుతుంది. ఈ మేఘం భూమిపై సాధారణంగా కనిపించే మేఘాల కంటే పూర్తిగా భిన్నమైన పరిస్థితుల్లో ఏర్పడుతుంది. అంగారకుడిపై వాతావరణం చాలా పలుచగా ఉన్నప్పటికీ, అక్కడ ధూళి తుఫాన్లు, మంచు మేఘాలు, భారీ గాలులు వంటి వాతావరణ సంఘటనలు చోటు చేసుకుంటాయి. కొత్త పరిశీలనల్లో కనిపించిన ఈ పొడవైన మేఘం ప్రతిరోజూ ఒక నిర్దిష్ట సమయంలో ఏర్పడి తర్వాత అదృశ్యమవుతున్నట్లు గుర్తించారు. అంగారకుడి వాతావరణాన్ని అర్థం చేసుకోవడానికి ఇటువంటి సంఘటనలు ఎంతో ముఖ్యమైనవి. ఎందుకంటే అక్కడి గాలి, ఉష్ణోగ్రత, పీడనం భూమితో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉంటాయి. అయినప్పటికీ కొన్ని వాతావరణ ప్రక్రియలు రెండు గ్రహాల్లోనూ ఆశ్చర్యకరమైన పోలికలు ఉన్నాయని స్పష్టం చేస్తున్నాయి.

## మద్యం దుకాణంలో కోతి



భారతదేశంలోని రాంచీలో ఇటీవల జరిగిన ఓ సంఘటన సోషల్ మీడియాలో విపరీతంగా ఆసక్తి రేపింది. ఓ కోతి అకస్మాత్తుగా మద్యం దుకాణంలోకి ప్రవేశించింది. దాన్ని బయటకు పంపేందుకు ప్రయత్నించినప్పుడు దుకాణ యజమానిని అది కరిచినట్లు సమాచారం. ఆ తర్వాత కోతి అక్కడ ఉన్న ఒక మద్యం సీసా వద్దకు వెళ్లి దానిలోని ద్రవాన్ని తాగింది. అంతటితో ఆగకుండా, కొద్దిసేపటికే దుకాణం లోపలే పడుకుని నిద్రపోయింది. ఖాళీ సీసా పక్కనే ఉండగా కోతి హాయిగా నిద్రిస్తున్న దృశ్యాలు వీడియోలో కనిపించాయి. ఈ విచిత్రమైన దృశ్యాన్ని చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అయితే సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో ఆధారంగా మాత్రమే కోతి నిజం గా ఎంత మద్యం తాగిందో, దాని ప్రవర్తనకు అసలు కారణం ఏమిటో ఖచ్చితంగా చెప్పలేమని పశు వైద్యులు అంటున్నారు. ఒక కోతి దుకాణంలోకి రావడం, మద్యం తాగడం, అక్కడే నిద్రపోవడం అనేవి సరదా ఘటనలుగా కనిపిస్తున్నప్పటికీ, అడవుల్లో ఉండాల్సిన జంతువులు క్రమంగా జనారణ్యాల్లోకి అడుగుపెట్టే పరిస్థితులు కల్పిస్తున్నామనే వాస్తవాన్ని గుర్తు చేస్తుంది.

## చిప్స్‌పై సూక్ష్మ ముద్రణ!



కంప్యూటర్ చిప్‌ల అభివృద్ధిలో ఒక ప్రధాన సవాలుగా మరింత చిన్న పరిమాణంలో మరింత ఎక్కువ 'ట్రాన్సిస్టర్స్'ను అమర్చడాన్ని పేర్కోవాలి. ప్రస్తుతం అత్యాధునిక చిప్ తయారీలో 'ఇయువి లిథోగ్రఫీ' కీలక పాత్ర పోషిస్తోంది. అయితే పరిశ్రమ ఇప్పుడు దాని తర్వాతి దశను ఆలోచిస్తోంది. ఎఎస్‌ఎంఎల్, దాని ఆప్టికల్ టెక్నాలజీ భాగస్వామి కార్ల్ జెయిస్ సంయుక్తం గా 'హైపర్ ఎన్‌ఎ' అనే భవిష్యత్ లిథోగ్రఫీ సాంకేతికతపై పని చేస్తున్నాయి. తాజా పరిశోధన నివేదికల ప్రకారం ఈ సాంకేతికత దాదాపు పది సంవత్సరాల కాలంలో, పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుంది. సుమారు 5 నానోమీటర్ల పరిమాణంలోని అంశాలను సైతం చిప్‌పై ముద్రించడం ఈ టెక్నాలజీ ప్రధాన లక్ష్యం. అంటే, రాబోయే టెక్నాలజీ ప్రస్తుతం ఉపయోగిస్తున్న 'హై ఎన్‌ఎ ఇయువి' సామర్థ్యాల కంటే మరింత ముందడుగు. సూక్ష్మ అంశాలంటే, సాధారణంగా చిప్‌లో మరింత ట్రాన్సిస్టర్ డెన్సిటీ, అధిక ప్రాసెసింగ్ కేపబిలిటీ, తక్కువ శక్తి వినియోగం వంటి ప్రయోజనాలు ఉంటా యి. ఈ భారీ యంత్రాలు ఇప్పటికే 'డబుల్ డెక్కర్ బస్' పరిమాణంలో ఉంటాయి. కొత్త హైపర్ ఎన్‌ఎ వ్యవస్థ కూడా పూర్తిగా భిన్నమైన యంత్రంగా కాకుండా, ప్రస్తుత టెక్నాలజీలోని కొన్ని కీలక భాగాలను ఉపయోగించుకునేలా అభివృద్ధి చేయవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. అయితే ఇది పరిశోధనల స్థాయిలో ఉన్న సాంకేతికత. ఈ టెక్నాలజీ ఎప్పటి నుంచి అందుబాటులోకి తెస్తామన్న విషయాన్ని ఎఎస్‌ఎంఎల్ అధికారికంగా ప్రకటించలేదు.

## గ్రహశకలాల వైపు.. యుఎఇ అడుగు



యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) తన అంతరిక్ష కార్యక్రమాన్ని మరో ఆసక్తికర దిశలో తీసుకెళ్తోంది. యుఎఇ రూపొందించిన 'ఎమిరేట్స్ మిషన్ టు ది ఆస్టరాయిడ్ బెల్ట్ (ఇఎంఎ) పరిశోధనకు అవసరమైన నిర్మాణం పూర్తయింది. ఇది 2028లో ప్రయోగించబడే మిషన్‌లో భాగంగా ఆరు గ్రహశకలాలను పరిశీలించి, చివరికి 'జస్టీషియా' అనే గ్రహశకలాన్ని 2035లో చేరడానికి ప్రయత్నించనుంది. ఇది యుఎఇకి మాత్రమేకాకుండా, యావత్ అరబ్ ప్రపంచ అంతరిక్ష పరిశోధనకు కూడా ముఖ్యమైన మలుపు. ఈ ప్రయోగాన్ని యుఎఇలోనే రూపొందించారు. తర్వాత దాన్ని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో బౌల్డర్‌కు తరలించి ప్రధాన అంతరిక్ష నౌకతో కలిపే ప్రక్రియ జరుగుతుంది. మిషన్‌లో కెమెరాలు, స్పెక్ట్రోమీటర్లు వంటి పరికరాలు ఉంటాయి. ఇవి గ్రహశకలాల ఉపరితలాన్ని, వాటి పదార్థ నిర్మాణాన్ని దూరం నుంచే అధ్యయనం చేయడానికి సహాయపడతాయి. పెద్ద ప్రశ్న గ్రహశకలాల్లో ఏ పదార్థాలు ఉన్నాయి? భవిష్యత్తులో అక్కడి వనరులను మానవ అంతరిక్ష ప్రయాణాలకు ఉపయోగించగలమా? అనే అంశాలపై ఆసక్తే యుఎఇ ప్రయత్నాలకు మూలం. వచ్చే దశాబ్దంలో చంద్రుడిపై అందుబాటులో ఉండే వనరుల వెలికితీత, శాశ్వత మానవ స్థావరాలు వంటి కార్యక్రమాలు కూడా అభివృద్ధి చెందవచ్చని భావిస్తున్నారు.

– బిఎస్ఎస్ మైత్రేయి

## బస్సు డ్రైవర్ కుమార్తె నుంచి నోబెల్ శాంతి బహుమతి విజేతగా...

2026 సంవత్సరానికి నోబెల్ శాంతి బహుమతి భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా న్యాయకోవిదురాలు నవీ పిల్లయ్‌కి దక్కింది. ఓస్లో పోడియం నుంచి కమిటీ చైర్మన్ జోర్గన్ వట్నీ ఫ్రైడ్‌నెస్ శుక్రవారం చేసిన ఈ ప్రకటన ఆమెతోపాటు చాలామందిని ఆశ్చర్యానికి గురిచేసింది. నోబెల్ కమిటీ అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ ప్రకటన చేసినపుడు 85 సంవత్సరాల వృద్ధనారి నవీ పిల్లయ్ న్యూరెంబర్గ్‌లో మానవ హక్కుల న్యాయవాదుల సమావేశంలో ఉన్నారు. ఆమె కమిటీ ఫోన్ అందుకోలేదు. ఆమె కన్నా ఆమె స్నేహితులకే నోబెల్ శాంతి బహుమతి ప్రకటన ముందుగా తెలిసింది. సమాచారం తెలిశాక ఆమె తొలి స్పందన "నిజమా?" ఔను నిజం. ప్రవాస సంతతికి చెందిన నవీని ఈ బహుమతి వరించటం నిజంగా చరిత్రాత్మకం. "శాంతి–అంతర్జాతీయ చట్టం" వ్యాప్తికి ఆమె చేసిన కృషికి లభించిన ఈ బహుమానం భారతీయులుగా మనకూ గర్వకారణం. ఎందుకంటే, ఆమె తమిళ ఒప్పంద కార్మిక కుటుంబం మనుమరాలు. ఆమె తాత కుటుంబం 1890ల్లో చెరకు తోటల్లో పనిచేయటానికి నాటల్(దక్షిణాఫ్రికా) వెళ్లారు. ఇండియన్ యూనివర్శిటీలో తనకు లభించిన మండేలా అవార్డును ఆమె తమ కుటుంబంలాగా 1860ల నుంచి వలసవచ్చి దాదాపు బానిస పరిస్థితుల్లో పనిచేసిన వేలాదిమందికి అంకితం చేశారు. అది ఆమె జీవిత గమ్యాన్ని సూచించింది.

ఆమె జీవితం– కృషి గురించి మరిన్ని వివరాల్లోకి వెళ్లేముందు, నోబెల్ శాంతి బహుమతిని ఆశించి రెండవసారి భంగపడిన నిరాశోపహతుడు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బాధను పంచుకుందాం. ఇరాన్‌పై అంతర్జాతీయ న్యాయచట్టానికి విరుద్ధంగా 8నెలలకు పైబడి బాంబుదాడుల యుద్ధం సాగిస్తున్న ఈ పెద్దమనిషి శాంతి బహుమతిని ఆశించటమే విడ్డూరం. ఆ ఆకాంక్షను బహిరంగంగా వ్యక్తం చేయటం, నోబెల్ కమిటీని నిందించటం మరో వింత. తాను 8యుద్ధాలు ఆపుదల చేశానని, ఆ విధంగా ప్రపంచ శాంతిని కాపాడానని, అందువల్ల నోబెల్ బహుమతి తనకు రావాలని గత సంవత్సరం(2025) కూడా ఆయన క్లెయిం చేశారు. ఇజ్రాయెల్, పాకిస్థాన్ లాంటి బహుకొద్ది తొత్తుదేశాలే ఆయన పేరు ప్రతిపాదించాయి. అయితే బహుమతి వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడోను వరించింది. కాగా వెనిజులా ఆయిలు సంపదపై కన్నువేసిన ట్రంప్ ఈ ఏడాది జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను సతీసమేతంగా మాదక ద్రవ్యం మాఫియా వంటి దుర్మార్గపు ఆరోపణతో సైనిక బందిపోటుతనంతో కిడ్నాప్ చేయించి అమెరికాలో జైల్లోపెట్టి కేసులు బనాయించాడు. మళ్లీ ఈ సంవత్సరం (2026) పాతపాటే పాడుతూ శాంతి బహుమతిని ఆశించి భంగపడ్డాడు. నోబెల్ కమిటీని బెదిరించాడు కూడా. తాను అధికారం చేబట్టిన 48గంటల్లోనే రష్యా–ఉక్రేన్ యుద్ధాన్ని ఆపుతానన్న ట్రంప్, ఇయు ఒత్తిడికి లొంగి ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి మద్దతిస్తూ రష్యాను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. పాకిస్థాన్‌పై భారత్ సర్జికల్ స్ట్రయిక్ తదుపరి భారత్–పాకిస్థాన్ యుద్ధాన్ని తాను నిలువరించానని ట్రంప్ చెప్పుకోవటాన్ని భారత్ నిరాకరించినా ఆయన అలా చెప్పుకోవటంలో సెంచరీ కొట్టాడు. ఏకపక్ష టారిఫ్ విధానాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కల్లోల పరిచాడు. ఆయన నోబెల్ శాంతి బహుమతిని ఆశించటమే వింత. బరాక్ ఒబామాకు ఎందుకు శాంతి బహుమతి ఇచ్చారో తనకు అర్థం కావటం లేదని అనటంలోనే ట్రంప్ ఈర్ష్య, జాత్యహంకారం ప్రదర్శితమవుతున్నాయి.

శ్రీమతి నవీ పిల్లయి 1941 సెప్టెంబర్ 23న దర్బన్ శివారు మురికివాడలో నవనీతం నాయుడు ఐదవ సంతానంగా జన్మించారు. ఆమె తండ్రి నారాయణస్వామి బస్సు డ్రైవర్. నవీ తమ ఐదవ ఏట తననుండి 5 పౌండ్లు గుంజుకున్న వ్యక్తికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పారు. అతనికి శిక్ష పడింది – కాని ఆ డబ్బులు తిరిగి రాలేదు. తీర్పుకు–న్యాయానికి మధ్యనున్న ఈ అగాధానికి వ్యతిరేకంగా ఆమె 70ఏళ్లుగా పోరాడుతున్నారు. దర్బన్‌లో లా ప్రాక్టీస్ ప్రారంభించిన తొలి మహిళ ఆమె. పిల్లయ్ భర్తపేరు నుంచి వచ్చింది. ఎఎన్‌సి, యూనిటీ మూవ్‌మెంట్, నల్లజాతి చైతన్య ఉద్యమం నుండి ఆమెకు క్లైయింట్లు వచ్చేవారు. 1995లో అధ్యక్షుడు నెల్సన్ మండేలా ఆమెను హైకోర్టు జడ్జీగా నియమించారు. దేశంలో శ్వేతజాతియేతర తొలి మహిళా జడ్జి ఆమెయే. సంవత్సరంలోనే ఐరాస జనరల్ అసెంబ్లీ ర్వాండాలోని ఇంటర్నేషనల్ క్రిమినల్ ట్రిబ్యునల్‌కు ఆమెను ఎన్నుకుంది. ఆమె అక్కడ నాలుగేళ్లు దాని ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు. 2003 నుంచి ఐసిసిలోని అప్పీల్స్ చాంబర్‌లో జడ్జీగా పనిచేశారు. వికీలీక్స్‌పై ఆర్థిక ఒత్తిడికి అభ్యంతరం చెప్పారు. ఎల్‌జిబిటి హక్కులపై ఐరాస తీర్మానాన్ని బలపరిచారు. 2013లో, శ్రీలంకలో అంతర్యుద్ధం ముగింపులో తమిళ ప్రజలపై అత్యాచారాలను ఖండించారు. గాంబియా 2019లో రొహింగ్యాల విషయం లో మయన్మార్‌పై తమ ఊచకోత కేసులో ఆమెను తాత్కాలిక జడ్జిగా నియమించింది. ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై ఐరాస దర్యాప్తు కమిషన్ చైర్మన్‌గా 2025 నవంబర్ వరకు పనిచేశారు. హమస్, ఇజ్రాయెల్ రెండూ 2024 జూన్‌లో యుద్ధ నేరాలకు ఒడిగట్టాయని, ఇజ్రాయెల్ 2025 సెప్టెంబర్‌లో గాజాలో మానవ సంహారానికి పాల్పడిందని ఆ కమిషన్ నిర్ధారించింది. మానవ హక్కులు, చట్టం – న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి నవీ పిల్లయి. ●

# మహిళా విముక్తి కోసం ముక్కోణ పోరాటం



మారుపాక అనిల్ కుమార్
9440482429

మహిళలపై జరుగుతున్న అణిచివేతను కేవలం కుటుంబ సమస్యగా, వ్యక్తిగత సమస్యగా లేదా కొన్ని ఆచారాల ఫలితంగా మాత్రమే చూడటం వాస్తవాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం కాదు. మహిళల అణిచివేతకు వేల సంవత్సరాల సామాజిక చరిత్ర ఉంది. భారతదేశంలో కుల వ్యవస్థ, పితృస్వామ్యం, ఆస్తి సంబంధాలు, మతాధిపత్యం మహిళల జీవితాలను నియంత్రిస్తూ వచ్చాయి. ఆధునిక కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ పాత అసమానతలను పూర్తిగా తొలగించలేదు. అనేక సందర్భాల్లో వాటిని తన లాభాల కోసం ఉపయోగించుకుంటోంది. మహిళ ఒకవైపు ఇంట్లో వేతనం లేని శ్రమ చేస్తుంది. మరోవైపు పొలాల్లో, కర్మాగారాల్లో, నిర్మాణ రంగంలో, గృహ కార్మిక రంగంలో, సేవా రంగంలో, ప్రభుత్వ– ప్రైవేటు సంస్థల్లో వేతన శ్రమ చేస్తుంది. అయినప్పటికీ ఆమె శ్రమకు సమాజంలో తగిన గుర్తింపు, సమాన వేతనం, భద్రత, నిర్ణయాధికారం పూర్తిగా లభించడం లేదు. అందుకే మహిళా విముక్తి ప్రశ్నను ఆర్థిక దోపిడీ, కుల వివక్ష, పితృస్వామ్యం, మత ఛాందసత్వం, రాజకీయ అణచివేతలకు వ్యతిరేకమైన సమగ్ర పోరాటంగా చూడాలి.

మానవ సమాజ అభివృద్ధిలో ఒక దశలో వ్యక్తిగత ఆస్తి, కుటుంబ వ్యవస్థ, వారసత్వ సంబంధాలు బలపడటంతో మహిళల సామాజిక స్థానం కూడా మారింది. ఆస్తి వారసత్వం ఎవరి చేతుల్లో కొనసాగాలి అనే ప్రశ్న కుటుంబం, వివాహం, సంతానం, మహిళల లైంగికతపై నియంత్రణతో ముడిపడింది. భారతదేశంలో ఈ పరిస్థితికి కుల వ్యవస్థ మరో బలమైన పొరను జోడించింది. కుల వ్యవస్థ తనను తాను తరతరాలుగా కొనసాగించుకోవడానికి వివాహ సంబంధాలను నియంత్రించింది. కులాంతర వివాహాలను నిరోధించడం, మహిళల స్వేచ్ఛను నియంత్రించడం, కుటుంబ గౌరవం పేరు తో మహిళలపై ఆంక్షలు విధించడం వంటి ఆచారాలు కుల వ్యవస్థ పునరుత్పత్తిలో భాగమయ్యాయి. అందువల్ల భారతదేశంలో మహిళా విముక్తి గురించి మాట్లాడేటప్పుడు కులనిర్మూలన ప్రశ్నను పక్కన పెట్టలేం. పెట్టుబడిదారీ వ్యవస్థ మహిళల శ్రమను ఎలా ఉపయోగించుకుంటుంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రధాన లక్ష్యం లాభం. ఉత్పత్తి ఖర్చును తగ్గించి, లాభాన్ని పెంచుకోవడం దాని ఆర్థిక స్వభావం. మహిళల చౌక శ్రమ ఈ వ్యవస్థకు అనేక సందర్భాల్లో అనుకూలంగా మారుతుంది. తక్కువ వేతనాలకు పనిచేసే మహిళా కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, గృహ కార్మికులు, వ్యవసాయ కూలీ లు, చిన్న పరిశ్రమల కార్మికులు, సేవారంగ మహిళలు — వీరందరి శ్రమ ఆర్థిక వ్యవస్థకు అవసరమే. కానీ వారి శ్రమకు తగిన విలువ, భద్రత, సామాజిక రక్షణ అందకపోవడం తీవ్రమైన సమస్య. మహిళను కుటుంబానికి అదనపు ఆదాయం తెచ్చే వ్యక్తిగా చూపించడం ద్వారా ఆమె వేతనాన్ని తక్కువగా ఉంచే పరిస్థితులు ఏర్పడవచ్చు.

ప్రతిరోజూ కోట్లాది మహిళలు వంట చేస్తారు, పిల్లలను చూసుకుంటారు, వృద్ధులను సంరక్షిస్తారు, అనారోగ్యంతో ఉన్న కుటుంబ సభ్యులను చూసుకుంటారు, ఇంటిని శుభ్రం చేస్తారు, నీరు తెస్తారు, కుటుంబ అవసరాలను నిర్వహిస్తారు. ఈ పనులకు సాధారణంగా వేతనం ఉండదు. ఆమె ఇంట్లోనే ఉంది అని చెప్పడం ద్వారా ఈ శ్రమను కనిపించకుండా చేస్తారు. కానీ ఒక కుటుంబం రోజువారీగా కొనసాగడానికి ఈ శ్రమ అత్యవసరం. పిల్లల సంరక్షణ, కుటుంబ సభ్యుల సంరక్షణ, వంట, ఇంటి నిర్వహణ వంటి పనులు సమాజ పునరుత్పత్తికి అవసరమైన శ్రమ. కాబట్టి గృహ శ్రమకు సామాజిక గుర్తింపు, ప్రజా సేవలు, సంరక్షణ మౌలిక సదుపాయాలు, మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం. సమాన పనికి సమాన వేతనం ఎందుకు సాధ్యం కావడం లేదు. చట్టపరంగా సమాన వేతనం అనే సూత్రం ఉన్నప్పటికీ, వాస్తవ జీవితంలో మహిళలు అనేక రకాల వేతన అసమానతలను ఎదుర్కొంటున్నారు. ఒకే పని చేసినా తక్కువ వేతనం, అస్థిర ఉద్యోగం, కాంట్రాక్ట్ పద్ధతి, పదోన్నతుల్లో వివక్ష, ప్రసూతి సమయంలో ఉద్యోగ భద్రత సమస్యలు — ఇవి మహిళల ఆర్థిక స్థితిని బలహీనపరుస్తాయి. ఉద్యోగ మార్కెట్‌లోకి మహిళలు ప్రవేశించినంత మాత్రాన విముక్తి పూర్తవదు. ఉద్యోగం, సమాన వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, నిర్ణయాధికారం కలిసినప్పుడే ఆర్థిక స్వాతంత్ర్యం అర్థవంతమవుతుంది.

**పితృస్వామ్యం – పెట్టుబడిదారీ వ్యవస్థ:** పితృస్వామ్యం మహిళల జీవితంపై పురుషాధిక్యతను నెలకొల్పే సామాజిక నిర్మాణం. పెట్టుబడిదారీ వ్యవస్థ పాత పితృస్వామ్య సంబంధాలను పూర్తిగా తొలగించకుండానే వాటితో సహజీవనం చేయగలదు. మహిళ ఇంట్లో వేతనం లేని శ్రమ చేయడం వల్ల కుటుంబ సంరక్షణకు అయ్యే సామాజిక వ్యయాన్ని కుటుంబమే భరిస్తుంది. అదే సమయంలో మహిళ బయట తక్కువ వేతనంతో పనిచేస్తే పెట్టుబడిదారులకు చౌక శ్రమ అందుతుంది. అందుకే మహిళా విముక్తి పోరాటం పితృస్వామ్యానికి వ్యతిరేకంగానూ, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగానూ సాగాలి.

**కుల వ్యవస్థ – మహిళల అణిచివేత:** భారతదేశ ప్రత్యేకతను అర్థం చేసుకోకుండా మహిళా సమస్యను పూర్తిగా అర్థం చేసుకోలేం. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కుల వ్యవస్థను కేవలం వృత్తుల విభజనగా కాకుండా, మనుషుల మధ్య అసమానతను స్థిరపరిచే సామాజిక వ్యవస్థగా విశ్లేషించారు. కుల వ్యవస్థ కొనసాగడానికి వివాహ సంబంధాల నియంత్రణ కీలకమైనదని ఆయన విశ్లేషణలో స్పష్టమవుతుంది. కులాంతర వివాహాలపై దాడులు, కుటుంబ గౌరవం పేరుతో మహిళలపై నియంత్రణ, దళిత మహిళలపై సామాజిక–లైంగిక హింస వంటి అంశాలను ఈ నేపథ్యంలో చూడాలి. కుల నిర్మూలన లేకుండా సంపూర్ణ మహిళా విముక్తి సాధ్యం కాదు. అదే సమయంలో మహిళల విముక్తి లేకుండా కుల నిర్మూలన పోరాటం కూడా సంపూర్ణం కాదు.

**మహిళల ప్రత్యేక సమస్యలు:** మహిళల జీవితం వ్యవసాయం, గ్రామీణ పేదరికం, అసంఘటిత రంగం, వలసలు, పట్టణీకరణ, నిరుద్యోగం, కుల సంబంధాలు వంటి అనేక అంశాలతో ముడిపడి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీ మహిళలు, కూలి పనులు చేసే దళిత మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గృహ కార్మికులు, బీడీ కార్మికులు, చిన్న వ్యాపారాలు చేసే మహిళలు ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో గృహ కార్మికులు, నిర్మాణ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, చిన్న పరిశ్రమలు, రిటైల్, హాస్పిటాలిటీ, డెలివరీ, ఇతర సేవారంగాల్లో పనిచేసే మహిళలకు పని భద్రత, సామాజిక భద్రత ముఖ్యమైన సమస్యలుగా ఉన్నాయి. మహిళలపై హింస, బాలికల విద్య, ఆరోగ్యం, ఉద్యోగ అవకాశాలు, సురక్షితమైన ప్రజా రవాణా, హాస్టళ్లు, వసతి, పారిశుద్ధ్యం వంటి అంశాలు కూడా ప్రభుత్వ ప్రాధాన్యతలో ఉండాలి.

**మతం పేరుతో మహిళలపై నియంత్రణ:** భారతదేశంలో వివిధ మతాలు, సామాజిక సంప్రదాయాల పేరుతో మహిళల దుస్తులు, వివాహం, ఆస్తి, విద్య, వ్యక్తిగత స్వేచ్ఛపై నియంత్రణకు ప్రయత్నాలు చారిత్రాత్మకంగా కనిపించాయి. ప్రతి మతంలోని ప్రజలను గౌరవించడం ఒక ప్రజాస్వామ్య విలువ. కానీ మతం పేరుతో మహిళల ప్రాథమిక హక్కులను నిరాకరించే ఏ ఆచారాన్నైనా ప్రశ్నించాలి. రాజ్యాంగం మహిళలకు సమాన పౌర హక్కులను కల్పిస్తుంది. పెట్టుబడిదారీ మార్కెట్ మహిళలను ఒకవైపు చౌక కార్మికులుగా ఉపయోగించుకుంటే, మరోవైపు మహిళ శరీరాన్ని వస్తువుల అమ్మకానికి ఉపయోగించే ప్రకటన సంస్కృతిని పెంచుతుంది. సౌందర్య ఉత్పత్తుల నుంచి ఫ్యాషన్, వినోదం వరకు మహిళ రూపాన్ని మార్కెట్ విలువతో కొలిచే ధోరణి కనిపిస్తుంది. మహిళను ఒక వినియోగ వస్తువుగా కాకుండా స్వతంత్ర హక్కులు కలిగిన మనిషిగా చూడాల్సిన సంస్కృతి అవసరం.

**మార్క్సిస్టు దృక్పథం – శ్రమ విముక్తి:** మార్క్సిస్టు విశ్లేషణ మనకు ఒక కీలకమైన ప్రశ్నను ముందుకు తెస్తుంది: ఉత్పత్తి చేసే మనిషి జీవితంపై నిర్ణయం ఎవరిది? కార్మికుడి శ్రమ లేకుండా సంపద సృష్టి జరగదు. మహిళల శ్రమ లేకుండా కుటుంబం, సమాజం, ఆర్థిక వ్యవస్థ కొనసాగడం కష్టం. అయితే సంపద సృష్టిలో కీలకమైన శ్రమ చేసే మహిళకు నిర్ణయాధికారం ఎందుకు పరిమితంగా ఉండాలి? ఇది కేవలం వ్యక్తిగత సంబంధాల సమస్య కాదు. ఇది సామాజిక–ఆర్థిక నిర్మాణానికి సంబంధించిన ప్రశ్న. అందుకే మహిళా విముక్తి పోరాటం శ్రమకు గౌరవం, సమాన వేతనం, సామాజిక భద్రత, ప్రజా సేవలు, ఆర్థిక ప్రజాస్వామ్యం కోసం కూడా సాగాలి.




**మహిళలు స్వయంగా నాయకత్వంలోకి రావాలి:** మహిళా విముక్తి కోసం పురుషులు మద్దతు ఇవ్వడం అవసరం. కానీ మహిళల సమస్యల కు పరిష్కారం సాధించడంలో మహిళలే స్వయంగా సంఘటితమై నాయకత్వం వహించడం మరింత కీలకం. గ్రామాల్లో మహిళా కమిటీ లు, కార్మిక ప్రాంతాల్లో మహిళా సంఘాలు, విద్యార్థి–యువజన మహిళా వేదికలు, దళిత మహిళా సంఘటనలను బలోపేతం చేయాలి. మహిళలు కేవలం ఉద్యమాల్లో పాల్గొనే వారుగా కాకుండా నాయకత్వం వహించే వారిగా ఎదగాలి. మహిళా విముక్తి, సమాజ విముక్తి మహిళలు సమానత్వం సాధించిన సమాజం పురుషులకూ విముక్తినే ఇస్తుంది. పితృస్వామ్యం పురుషులను కూడా కఠినమైన సామాజిక పాత్రల్లో బంధిస్తుంది. కుటుంబ బాధ్యతలను కేవలం మహిళలకే పరిమితం చేయడం వల్ల పురుషులపై కూడా ఒత్తిడి పెరుగుతుంది. పిల్లల పెంపకం, గృహ బాధ్యతలు, కుటుంబ సంరక్షణ, సామాజిక బాధ్యతలను పురుషులు–మహిళలు సమానంగా పంచుకునే సమాజం అవసరం. అది కేవలం కుటుంబ సంబంధాల్లో మార్పుతో సాధ్యం కాదు. ఉపాధి, విద్య, ఆరోగ్యం, ప్రజా రవాణా, బాలల సంరక్షణ, వృద్ధుల సంరక్షణ వంటి ప్రజా సేవలను బలోపేతం చేయడం కూడా అవసరం. మహిళల అణిచివేతకు వ్యతిరేక పోరాటం ఒక రోజు కార్యక్రమం కాదు. అది దీర్ఘకాలిక సామాజిక–ఆర్థిక–రాజకీయ పోరాటం. మహిళను ఇంట్లో బంధించే పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా పోరాడాలి. మహిళల శ్రమను చౌకగా ఉపయోగించుకునే ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలి. కులం పేరుతో మహిళల జీవితాలను నియంత్రించే వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలి.

మతం పేరుతో మహిళల హక్కులను పరిమితం చేసే ఆచారాలను ప్రశ్నించాలి. మహిళ శరీరాన్ని వస్తువుగా మార్చే మార్కెట్ సంస్కృతిని వ్యతిరేకించాలి. దళిత మహిళలు, ఆదివాసీ మహిళలు, పేద మహిళలు, కార్మిక మహిళలు, వ్యవసాయ కూలీ మహిళలు, అసంఘటిత రంగ మహిళల సమస్యలను ఉద్యమ కేంద్రంగా తీసుకురావాలి. అంబేద్కర్ చూపిన సామాజిక సమానత్వ మార్గం, మార్క్సిస్టు ఉద్యమం చూపిన ఆర్థిక న్యాయ పోరాటం — ఈ రెండింటి నుంచి పాఠాలు తీసుకుని, భారతీయ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మహిళా విముక్తి ఉద్యమాన్ని నిర్మించాలి. మహిళా విముక్తి లేకుండా సామాజిక విముక్తి అసంపూర్ణం. కుల నిర్మూలన లేకుండా భారతీయ మహిళా విముక్తి అసంపూర్ణం. ఆర్థిక సమానత్వం లేకుండా మహిళా స్వాతంత్ర్యం అసంపూర్ణం. అందుకే కుల వివక్షను నిర్మూలిద్దాం! పితృస్వామ్యాన్ని ప్రతిఘటిద్దాం! మహిళల ఆర్థిక హక్కుల కోసం పోరాడుదాం! సమాన పనికి సమాన వేతనం సాధిద్దాం!

## ఆఫర్ల సందడి... మన చేతిలోని క్లిక్ వెనుక ఎవరి సాంకేతికత?

ఈ ధర ఇంత తక్కువా?.. పండుగల సీజన్లో మొబైల్, కంప్యూటర్ తెరిచిన వెంటనే కనిపించే ఆఫర్లు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్, ఫ్లిప్కార్ట్ బిగ్ బిలియన్ డేస్ వంటి విక్రయాలతో ఆన్లైన్ కొనుగోళ్ల సందడి మరింత పెరిగింది. నచ్చిన వస్తువును ఎంచుకోవడం, ధరలను పోల్చడం, తగ్గింపు పొందడం, యుపిఐతో చెల్లించడం, ఇంటికే తెప్పించుకోవడం.. అంతా కొన్ని నిమిషాల్లో పూర్తవుతోంది. ఒకప్పుడు మార్కెట్‌కు వెళ్లి కొనాల్సిన వస్తువు ఇప్పుడు ఇంటి నుంచే అందుబాటులోకి వచ్చింది. ఇది వినియోగదారుడి సౌకర్యాన్ని మాత్రమే కాదు.. వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ వాణిజ్యాన్ని కూడా ప్రతిబింబిస్తోంది. ఈ సౌకర్యం వెనుక యాప్‌లు, సర్వర్లు, డేటా కేంద్రాలు, నెట్వర్కులు, ప్రాసెసర్లు, చెల్లింపు వ్యవస్థలు కలిసి పనిచేస్తున్నాయి. మన చేతిలో కనిపించేది మొబైల్.. మనముందు కనిపించేది కంప్యూటర్.. కానీ వాటి వెనుక పనిచేసేది విస్తృతమైన సాంకేతిక వ్యవస్థ.

**చెల్లింపు మన చేతిలో.. డేటా ఎవరి చేతిలో?**

2026 ఆగస్టులో యుపిఐ ద్వారా 24,508.96 మిలియన్ లావాదేవీలు జరిగాయి. అంటే 24.5 బిలియన్లకు పైగా లావాదేవీలు. వాటి విలువ రూ.29,82,355.95కోట్లకు చేరింది. డిజిటల్ చెల్లింపులు సామాన్యుడి రోజువారీ జీవితంలో ఎంతగా భాగమయ్యాయో ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆన్లైన్ కొనుగోలులో డబ్బుతో పాటు పేరు, ఫోన్ నంబర్, చిరునామా, కొనుగోలు వివరాలు వంటి వ్యక్తిగత సమాచారం కూడా డిజిటల్ వ్యవస్థలోకి వెళ్తుంది. అందుకే సౌకర్యంతో పాటు డేటా భద్రతకు కూడా సమాన ప్రాధాన్యం అవసరం. సంస్థలు వ్యక్తిగత సమాచారాన్ని బాధ్యతగా నిర్వహించాలి. ప్రభుత్వం చట్టపరమైన రక్షణ, పర్యవేక్షణ, అమలు సామర్థ్యాలను బలోపేతం చేయాలి. వినియోగదారులు కూడా నకిలీ ఆఫర్లు, అనుమానాస్పద లింకులు, తెలియని చెల్లింపు అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం 2023తో పాటు 2025లో నిబంధనలు నోటిఫై కావడం డేటా రక్షణకు చట్టపరమైన వ్యవస్థను మరింత స్పష్టత వైపు తీసుకెళ్లింది. డబ్బు చెల్లింపు క్షణాల్లో పూర్తవుతుంది..కానీ వ్యక్తిగత డేటా భద్రతకు తీసుకునే జాగ్రత్త భవిష్యత్తు రక్షణను నిర్ణయిస్తుంది.

**విదేశీ ఆధారమా?.. స్వదేశీ సామర్థ్యమా?**

మన మొబైల్ పనిచేయాలన్నా, కంప్యూటర్ నడవాలన్నా, కారు కదలాలన్నా, ఎటిఎం పనిచేయాలన్నా సెమీకండక్టర్ చిప్ అవసరం. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో సెమీకండక్టర్ సాధారణ ఎలక్ట్రానిక్ భాగం మాత్రమే కాదు.. సాంకేతిక, పారిశ్రామిక, వ్యూహాత్మక సామర్థ్యాన్ని ప్రభావితం చేసే కీలక వనరు. కేంద్ర ప్రభుత్వ సమాచారం ప్రకారం 2017–18 నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరాల మధ్య భారత్ దాదాపు 150 బిలియన్ డాలర్ల విలువైన సెమీకండక్టర్ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. 2030 నాటికి దేశీయ సెమీకండక్టర్ డిమాండ్ 110 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. ఈ నేపథ్యంలో భారత్ సెమికాన్ 2.0 కార్యక్రమం ద్వారా రూ.1,27,500 కోట్ల కేటాయింపుతో సెమీకండక్టర్ రంగాన్ని విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. రూపకల్పన, తయారీ కేంద్రాలు, అధునాతన ప్యాకేజింగ్, పరికరాలు, పదార్థాలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి ఇందులో ప్రాధాన్యం ఉంది. కర్మాగారాలు ఏర్పాటు చేయడం మాత్రమే సరిపోదు. రూపకల్పన నుంచి తయారీ వరకు, పరికరాలు, ముడి పదార్థాలు, పరిశోధన, నైపుణ్యం వరకు సమగ్ర సామర్థ్యం దేశంలో పెరగాలి. ప్రపంచ సాంకేతికతతో కలిసి నడుస్తూనే.. కీలక సాంకేతికత కోసం పూర్తిగా ఇతరులపై ఆధారపడని స్థాయికి భారత్ ఎదగాలి.

ఫిరోజ్ ఖాన్, 9640466464

# అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి




- యుద్ధాలతో మానవాళికి అపార నష్టం.. శాంతితోనే ప్రపంచ ప్రగతి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
- ఎఐపిఎస్ఒ నల్లగొండ జిల్లా 4వ మహాసభలో పిలుపు

**ప్రజాపక్షం/నల్లగొండ :** అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. యుద్ధాల వల్ల మానవాళికి తీరని నష్టం వాటిల్లుతోందని, ప్రపంచ శాంతి సాధన కోసం ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పిఆర్‌టియు భవనంలో నిర్వహించిన అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఎఐపిఎస్ఒ) జిల్లా 4వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యక్తుల ఆలోచనల నుంచే శాంతి లేదా యుద్ధం ప్రారంభమవుతుందని అన్నారు. చెడు ఆలోచనలు సమాజంలో విభజనలకు దారితీస్తాయని, సామ్రాజ్యవాద విస్తరణ కాంక్షతో అమెరికా వంటి దేశాలు చిన్న దేశాలపై ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. తమ వ్యాపార ప్రయోజనాల కోసం కొన్ని ఐరోపా దేశాలు సైతం అమెరికా విధానాలకు మద్దతు పలుకుతున్నాయని అన్నారు. యుద్ధాల కారణంగా ఇరాక్, ఇరాన్ తదితర దేశాల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహారం, నిత్యావసర వస్తువుల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సామ్రాజ్యవాదం నశించాలని, సామ్యవాదం వర్ధిల్లాలని, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. సమాజంలో చోటుచేసుకునే పరిణామాలపై ప్రజలు మౌనంగా ఉండకుండా స్పందించాలని, అన్యాయాలకు వ్యతిరేకంగా గొంతెత్తాలని సూచించారు.

ఎఐపిఎస్ఒ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్. మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు ప్రపంచ శాంతి ఆవశ్యకతను తెలియజేస్తున్నాయని అన్నారు. ఒకవైపు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, మరోవైపు మధ్యప్రాచ్య దేశాల్లో కొనసాగుతున్న ఘర్షణలు మానవాళిని ఆందోళనకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. యుద్ధాల వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోవడంతోపాటు అనేక కుటుంబాలు నిరాశ్రయులవుతున్నాయని, అభివృద్ధి చెందిన నగరాలు సైతం శిథిలాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ యుద్ధాల ప్రభావం ఆయా దేశాలకే పరిమితం కావడం లేదని, భారత దేశ ఆర్థిక వ్యవస్థపైనా పడుతోందని వివరించారు. ఎఐపిఎస్ఒ దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులను ఏకం చేస్తూ ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో శాంతిని కోరుకునే ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి 4వ జిల్లా మహాసభ నిర్వహించడం సంతోషకరమని తెలిపారు.

మహాసభకు శాంతి సంఘం జిల్లా అధ్యక్ష వర్గం అనంతుల శంకరయ్య, కట్ట వెంకటరెడ్డి, గుర్రం వెంకటరెడ్డిలు అధ్యక్షత వహించగా నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, శాంతి సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ సమత, జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య, పర్యావరణ పరిరక్షణ వేత్త శ్యామల నాగసేనారెడ్డి, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు పసల శౌరయ్య, మైనారిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఏ.ఏ.ఖాన్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చలం రంగారావు, సీనియర్ నాయకులు నేతి యాదగిరి, బుక్క ఈశ్వరయ్య, కోమటిరెడ్డి ప్రద్యుమ్నారెడ్డి, షరీఫుద్దీన్, కస్తాల వెంకన్న, తెలగమల దశరథ, బి.సప్న, ఇమాబిన్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలకు స్ఫూర్తి హనుమంతు పాటలు



- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సాయుధ పోరాటానికి తన పాటలతో ప్రజల్లో పోరాట స్ఫూర్తి రగిలించిన సుద్దాల హనుమంతు ఆశయాలను నేటితరం కొనసాగించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సుద్దాల హనుమంతు వర్ధంతి సందర్భంగా శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నర్సింహ తదితరులు హనుమంతు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సుద్దాల హనుమంతు పాటలు తెలంగాణ సాయుధ పోరాటానికి ఉత్తేజాన్ని, చైతన్యాన్ని అందించాయని అన్నారు. సమాజంలోని అన్యాయాలపై పాటలనే ఆయుధాలుగా చేసుకుని పోరాడారని, ప్రజా సమస్యలపై తన రచనలతో ఉద్యమానికి వన్నె తెచ్చారని కొనియాడారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు శ్రీమాన్, శ్రీకాంత్, ఏఐవైఎఫ్ నాయకులు ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ సుద్దాల హనుమంతు పాటలు ఆలపించి నివాళ్లు అర్పించారు.

# ప్రపంచస్థాయి క్రీడా కేంద్రంగా తెలంగాణ

- దక్షిణ కొరియా తరహాలో క్రీడాకారులకు శిక్షణ : భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల కల్పనతోపాటు, కొరియా తరహా శిక్షణా విధానాలతో యువ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

హైదరాబాద్‌లోని గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్స్‌లో శనివారం నిర్వహించిన ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ (ఐజిపిఎల్) టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియం నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. దక్షిణ కొరియా విశ్వవిద్యాలయాలు క్రీడల్లో సాధిస్తున్న విజయాలు, అక్కడి శిక్షణా విధానాలు, క్రీడాకారులకు అందిస్తున్న సౌకర్యాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారని తెలిపారు. ఈ దిశగా దక్షిణ కొరియా విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుని తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గోల్ఫ్ వంటి అంతర్జాతీయ క్రీడలను ప్రోత్సహించడం ద్వారా క్రీడా రంగంతోపాటు పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చేయవచ్చని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఐజిపిఎల్ టోర్నమెంట్‌లో విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# బిఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో భూముల విషయంలో బిఆర్ఎస్ చేపట్టిన తప్పుడు ప్రచారాన్ని ప్రజలు పూర్తిగా తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు రిజిస్ట్రేషన్‌ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడం ఇందుకు స్పష్టమైన నిదర్శనమన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో స్పందించిన మంత్రి, 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్‌ల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం గణనీయంగా పెరిగిందని వెల్లడించారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ ఆదాయం 21.86 శాతం మేర వృద్ధి నమోదు చేసిందని తెలిపారు. ఈ గణాంకాలే రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం భూముల అంశంపై బిఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను ప్రజలు విశ్వసించలేదన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో చోటుచేసుకున్న భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికి తీస్తోందన్నారు.

# ఎమర్జెన్సీ కంటే దారుణమైన పాలన

- కేంద్ర ప్రభుత్వంపై వి.హెచ్ తీవ్ర విమర్శలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతుగా నిలవాలని వి.హనుమంతరావు పిలుపునిచ్చారు.గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాల సవరణ పేరుతో కోట్లాది మంది ఓటర్ల పేర్లు తొలగించారన్న ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘాన్ని కలిసి తమ అభ్యంతరాలను తెలియజేయడానికి ప్రయత్నించిన ప్రతిపక్ష నాయకులకు అవకాశం ఇవ్వకుండా, నిరసనలకు దిగిన ఎంపిలు, ఇతర నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలు ఒత్తిడికి గురవుతున్నాయని ఆరోపించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియలో సుమారు 13 కోట్ల మంది పేర్లు తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని వి.హనుమంతరావు పేర్కొన్నారు. ఈ తొలగింపులపై స్పష్టత ఇవ్వాలని, అభ్యంతరాలను పరిశీలించి అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని కోరారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న ఓటర్లను లక్ష్యంగా చేసుకుని పేర్లు తొలగిస్తున్నారన్న అనుమానాలను వ్యక్తం చేస్తూ, ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని, అర్హులైన పౌరులు తమ ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని అన్నారు.

# అమరవీరుల త్యాగాల ఆశయ సాధనకు కృషి

- ఎమ్మెల్సీ, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని శాసనమండలి సభ్యులు, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ పిలుపునిచ్చారు. పెత్తరమాస సందర్భంగా తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ గన్ పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద అమరులకు బియ్యమిచ్చే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపానికి ప్రొఫెసర్ కోదండరాం నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన గ్రామీణ సంప్రదాయంలో పెత్తరమాస రోజున పెద్దలకు బియ్యమిచ్చి, పూర్వీకులను స్మరించుకోవడం ఆచారంగా వస్తోందని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరులను స్మరించుకుంటూ ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం.నరసయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్, ఆశప్ప, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, నాయకులు హనుమంత రెడ్డి, సర్దార్ వినోద్ కుమార్, ఆకుల శ్రీనివాస్, శేఖర్, నరేందర్, బాలరాజు, హనుమంతు గౌడ్, మల్లేష్, ఆనందం, కాకునూరు సుధాకర్, కిరణ్ కుమార్ రెడ్డిలతో పాటు ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

## ఎంఎస్ఎంఇలకు అండగా
# 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'

- ఎల్‌యుబి ఎంఎస్ఎంఇ సౌత్ ఇండియా సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఇ) మరింత బలోపేతం చేసి, తెలంగాణ పారిశ్రామిక ప్రగతిలో వాటిని కీలక భాగస్వాములుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవకాశాలు, పెట్టుబడుల అనుసంధానంపై మార్గనిర్దేశం చేసేందుకు ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే పారిశ్రామికవేత్తలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నెలకోసారి 'ఎంఎస్ఎంఇ గ్రీవెన్స్ డే' నిర్వహించనున్నట్లు తెలిపారు. లఘు ఉద్యోగ్ భారతి (తెలంగాణ) ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో నిర్వహించిన 'ఎల్‌యుబి ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్'ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు పారిశ్రామికాభివృద్ధిలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలా ఎంఎస్ఎంఈలకు అవసరమైన సాంకేతిక సహకారం, మార్కెట్ అనుసంధానం, పెట్టుబడుల అవకాశాలపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా మార్గనిర్దేశం చేస్తామన్నారు. దేశంలోనే తొలిసారిగా ఎంఎస్ఎంఈ విధానాన్ని తీసుకొచ్చిన ఘనత తెలంగాణకు దక్కుతుందని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, పరిష్కార మార్గాలను సూచించేందుకు నెలవారీ గ్రీవెన్స్ డే దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ మేనేజింగ్ డైరెక్టర్ రామ్మోహన్ రావు, లఘు ఉద్యోగ్ భారతి ప్రతినిధులు వై.వెంకటేశ్వర్లు, కె.నరేంద్రనాథ్ దత్, ఓంఅనూజ్ ఖదేల్వాల్ పాల్గొన్నారు.

# సిపిఐ(ఎం) నేతల అరెస్టు దుర్మార్గం

- ఓట్ల తొలగింపుపై సమగ్ర విచారణ జరపాలి: జి.నాగయ్య




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఢిల్లీలో శాంతియుత నిరసన చేపట్టిన సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీతో సహా పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులను అరెస్టు చేయడం, సూర్జిత్ భవన్, ఎకెజి భవన్‌లలో నాయకులు, కార్యకర్తలను నిర్బంధించడం దుర్మార్గమని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య విమర్శించారు. సిపిఐ(ఎం) జాతీయ, రాష్ట్ర నాయకుల అరెస్టు చేయడంతో పాటు పార్టీ కార్యాలయాలపై పోలీసుల దాడులను నిరసిస్తూ శనివారం సిపిఐ(ఎం) నాయకులు హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఆందోళన నిర్వహించారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేసి తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు రద్దయ్యాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండివైఖరి వీడకపోతే ప్రతిపక్షాలు, విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి దేశవ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్, టి.సాగర్, హైదరాబాద్ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.



# పరిమితి ఎత్తివేయకుంటే ఉద్యమం

- బిసి వ్యతిరేక వైఖరి మార్చుకోకపోతే బిజెపికి ఇదే చివరి పాలన: జాజుల, విహెచ్, మల్లు రవి హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి కులగణన చేపట్టి, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచడంతో పాటు 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని ఎంపి మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిసిల పట్ల తన వైఖరిని మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బిసి వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే కేంద్రంలో బిజెపికి ఇదే చివరి పాలన అవుతుందని వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద బిసి సంక్షేమ సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వి.హనుమంతరావు, మల్లు రవి మాట్లాడుతూ బిసిల పట్ల బిజెపికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన 42 శాతం రిజర్వేషన్ల చట్టానికి పార్లమెంటులో ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. బిసి కులగణన సాధన కోసం డిసెంబర్ 14, 15 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి కులగణన, రిజర్వేషన్ల పెంపు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ ధర్నాలో కేసన శంకర్‌రావు, సచిన్ రాజోలుకర్, బైరి రవికృష్ణ, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాం కురుమ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# గజ్వేల్ ఎంఆర్‌ఒపై చర్యలు తీసుకోవాలి

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తన భూమిని, జీవనాధారాన్ని కాపాడుకునేందుకు కార్యాలయానికి వచ్చిన రైతు పట్ల గజ్వేల్ ఎంఆర్‌ఓ ప్రవర్తించిన తీరుపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మనకు అన్నం పెట్టే అన్నదాతలను ఇంత అమానవీయంగా, నిర్దయగా అవమానించడం సిగ్గుచేటని, ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడ్డారు. సాయం కోరి వచ్చిన రైతును ఇంకా పురుగుల మందు తాగలేదా? ఇంకా బతికే ఉన్నావా? అని ఎగతాళి చేస్తూ అధికారి మాట్లాడిన వీడియో బయటకు రావడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఒక తోటి మనిషి బాధను చూసి పరిహసించే స్థాయిలో అధికారి మానసిక స్థితి ఉండడం దురదృష్టకరమని కెటిఆర్ వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతను మరిచి కించపరిచేలా వ్యవహరించిన గజ్వేల్ ఎంఆర్ఓపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కెటిఆర్ డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమం గురించి మాట్లాడే ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వారికి జరుగుతున్న అవమానాలపై బాధ్యత వహించాలని, రైతు ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు.

# నిరసనలపై ఢిల్లీ పోలీసుల ఆంక్షలు అప్రజాస్వామికం : వలి ఉల్లా ఖాద్రీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్ఐఆర్, ఎన్నికల సంఘం పనితీరుపై జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్యంపై దాడి అని ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ విమర్శించారు. నిరసనను అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు విధించిన ఆంక్షలను ఖండించారు. నిరసనకారుల నిర్బంధం, రవాణాపై ఆంక్షలు, విమానంలో ఢిల్లీకి వచ్చిన కార్యకర్తలను అరెస్టు చేసేందుకు పోలీసులు యత్నించడం అప్రజాస్వామికమన్నారు. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని, అక్రమ నిర్బంధాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. శాంతియుత నిరసనలకు అనుమతించాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని కోరారు.

# సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం!

- 9 రాష్ట్రాల్లో దాడులు.. 35 మంది అరెస్టు
- సెప్టెంబర్‌లో రూ.17.34 కోట్లకుపైగా బాధితుల నష్టం
- రూ.88.48 లక్షలు తిరిగి ఇప్పించిన సైబర్ క్రైమ్ పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న సైబర్ నేరగాళ్ల ముఠాలపై హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు కొరడా ఝుళిపించారు. సెప్టెంబర్ నెలలో తొమ్మిది రాష్ట్రాల్లో అంతర్రాష్ట్ర ఆపరేషన్లు నిర్వహించి, 23 సైబర్ క్రైమ్ కేసులకు సంబంధించి 35 మంది నిందితులను అరెస్టు చేశారు. మరోవైపు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లో స్తంభింపజేసిన నిధుల నుంచి బాధితులకు రూ.88,48,134 తిరిగి ఇప్పించారు. ఇదే సమయంలో ఆన్‌లైన్ బెట్టింగ్, నకిలీ పెట్టుబడులు, మైనర్లను లక్ష్యంగా చేసుకున్న అసభ్యకర కంటెంట్ ప్రచారంపై డిజిటల్ నిఘాను ముమ్మరం చేశారు. సెప్టెంబర్‌లో నగర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 83 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు క్రైమ్స్ అదనపు పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు వెల్లడించారు.

వివిధ రకాల మోసాలకు సంబంధించి 38 కేసుల్లో బాధితులు మొత్తం రూ.17,34,96,158 కోల్పోయారు. ఇందులో ట్రేడింగ్ మోసాల వాటా అత్యధికంగా ఉంది. 11 కేసుల్లో బాధితులు రూ.8.43 కోట్లకు పైగా నష్టపోగా, రూ.40.24 లక్షలకు పైగా తిరిగి ఇప్పించారు. 17 పెట్టుబడి మోసాల కేసుల్లో రూ.7.68 కోట్లకు పైగా నష్టం వాటిల్లగా, రూ.9.20 లక్షలకు పైగా రిఫండ్ చేయించారు. డిజిటల్ అరెస్ట్ మోసంలో ఒక కేసుకు సంబంధించి రూ.85 లక్షలకుపైగా నష్టం నమోదైంది. ఓటీపీ మోసాలు, ఏపీకే ఫైళ్ల ద్వారా మోసాలు, ప్రకటనల మోసాలు, అనధికార యూపీఐ లావాదేవీల కేసుల్లోనూ బాధితులకు కొంత మొత్తాన్ని తిరిగి ఇప్పించారు. మొత్తంగా రూ.88.48 లక్షలకు పైగా బాధితులకు చేరినట్లు పోలీసులు తెలిపారు. సోషల్ మీడియా వేదికలపై మైనర్లను అసభ్యకరంగా చిత్రీకరిస్తూ వీక్షణలు, లైక్‌లు, చందాదారులు, ఆదాయం పొందేందుకు ప్రయత్నిస్తున్న ఖాతాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఆన్‌లైన్ గేమింగ్, అక్రమ బెట్టింగ్, నకిలీ పెట్టుబడి వెబ్‌సైట్లను ప్రచారం చేస్తున్న 1,457 ప్రొఫైళ్లు, 2,603 చెల్లింపు ప్రకటనలను



నిలిపివేయించడంతోపాటు, వాటిని ప్రమోట్ చేస్తున్న వారిపై తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. జోనల్ సైబర్ సెల్స్ పరిధిలో 2,767 ఫిర్యాదులు అందగా, వాటిలో 381 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. పది కేసుల్లో 11 మంది నిందితులను అరెస్టు చేసి, బాధితులకు రూ.67,54, 049 తిరిగి ఇప్పించారు. సిమిత్ర విభాగం ద్వారా బాధితులకు మార్గదర్శనం అందించేందుకు 1,928 ఫోన్ కాల్స్ చేయగా, తక్షణ చట్టపరమైన చర్యల కోసం 307 జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని సూచించారు. సిబిఐ, ఇడి, పోలీసు, కస్టమ్స్, ఆర్‌బిఐ, నార్కోటిక్స్ తదితర సంస్థల పేర్లతో వీడియో కాల్స్ చేసి బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తే భయపడవద్దని స్పష్టం చేశారు.



## జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్

### సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** సిఇసి జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని జవహర్ నగర్ లోని సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వామపక్ష, విపక్ష, విద్యార్థి యువజన సంఘాల నాయకులపై పోలీసు బలగాలు జరిపిన లాఠీఛార్జ్, అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ శనివారం రోజున జవహర్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఎన్నికల సంఘంలో ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన (సర్) ప్రక్రియను రద్దు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల మంది ప్రజల ఓట్లను తొలగించడానికి కుట్రలు జరుగుతున్నాయని, అందులో ప్రధానంగా ఆదివాసీలు, దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలు ఇతర మైనార్టీ వర్గాల ప్రజల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తున్నారని ఆరోపించారు.

**శాంతియుత నిరసనలపై అణచివేత :** కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కును కాలరాస్తూ లాఠీ ఛార్జ్ చేయడం, అక్రమంగా అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. హక్కుల పరిరక్షణ కోసం, ఓటు హక్కు ను కాపాడుకోవడం కోసం దేశవ్యాప్తంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఐ నాయకులు, నిమ్మల నరసింహులు, సిహెచ్ దశరథ, దర్శనం యాదగిరి, ఎల్లయ్య, మల్లికా,కిరణ్, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏషియన్ మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీల్లో కె.ఎల్.నారాయణకు వెండి పతకం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజి గిరి:** కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగుళూరులో శనివారం జరిగిన 2వ ఏషియన్ మాస్టర్స్ 100 మీటర్ల ఫ్రీ స్టైల్ స్విమ్మింగ్ పోటీల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా నివాసి కె.ఎల్. నారాయణ వెండి పతకాన్ని దక్కించుకొన్నారు. తెలంగాణా ప్రభుత్వంలో అదనపు కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఆయన ఈ నెల 4 నుండి 10 వరకు జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో 3 బంగారు, ఒక వెండి, ఒక కాంస్య పతకాలను సాధించారు.

5 ఈవెంట్లల్లో పాల్గొన్న ఆయన 200 మీటర్ల స్విమ్మింగ్, 200, 400 ఫ్రీ స్టైల్ పోటీల్లో మూడు బంగారు పతకాలను సాధించగా 100 మీటర్ల ఫ్రీ స్టైల్ స్విమ్మింగ్ పోటీల్లో వెండి. 50 మీటర్ల పోటీల్లో కాంస్య పతకాలను సాధించారు. 2025 అక్టోబర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీల్లో 5 బంగారు పతకాలను దక్కించుకొని ప్రతిభ చాటారు.



## శ్రద్ధ స్ఫూర్తి కళాశాలలో బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** కీసర డివిజన్ పరిధిలోని శ్రద్ధ స్ఫూర్తి కళాశాలలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా విద్యార్థినులు, కళాశాల మహిళా అధ్యాపక బృందం, సిబ్బంది ఉత్సాహంగా ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకొన్నారు. రంగు రంగుల వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో విద్యార్థినులు బతుకమ్మ పండుగ గేయాలకు అనుగుణంగా సందడి చేసారు. తెలంగాణా ఆడపడుచుల ఆత్మ గౌరవానికి, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి అన్నారు.

## ఈతకు వెళ్లి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** జవహర్ నగర్ పరిధిలోని మల్కారం క్వారీలో జరిగిన ప్రమాదంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానిక ఎస్‌హెచ్‌ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడలోని సాయిప్రియ కాలనీకి చెందిన ముమ్మారెడ్డి హేమలత కుమారుడు ముమ్మారెడ్డి ప్రణవ్ సాయి (17), చేర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్‌ఇ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం (అక్టోబర్ 09) ఉదయం ప్రణవ్ సాయి ఎప్పటిలాగే కళాశాలకు వెళ్లాడు. అయితే అదే రోజు సాయంత్రం సుమారు 5:00 గంటల సమయంలో ప్రణవ్ స్నేహితులు, పోలీసులకు తల్లి హేమలతకు ఫోన్ చేసి, ఆమె కుమారుడు మల్కారం క్వారీలోని నీటిలో మునిగిపోయినట్లు సమాచారం అందించారు. వెంటనే ఆమె సంఘటనా స్థలానికి చేరుకుని ప్రణవ్ స్నేహితులైన వైభవ్, భార్గవ్, శ్రీశాంత్ రెడ్డి, డి. తారకరామ్, ఎం. రిషి వర్ధన్, మయాంక్ కుమార్‌లను ఆరా తీశారు. వీరందరూ కలిసి సరదాగా ఈత కొట్టడానికి వెళ్లగా, ఈత కొడుతున్న సమయంలో ప్రణవ్ నీటిలో మునిగిపోయినట్లు వారు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి, నీటిలో నుంచి ప్రణవ్ మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యు లు నిర్ధారించారు. కళ్లముందే పెరిగి పెద్దవాడైన ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా మారడంతో తల్లి హేమలత కన్నీరుమున్నీరుగా విలపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు.



# ఆర్టీసి ఎన్నికల్లో ఎర్రజెండా ప్రభావం

*ఎంప్లాయిస్ యూనియన్ విజయం
*జీడిమెట్ల డిపోలో విజయోత్సవ సభ



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసిలో నిర్వహించిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎఐటియుసి బలపరిచిన ఎంప్లాయిస్ యూనియన్ సుమారు 6వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించడం కార్మికులకు ఎర్రజెండాపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. జీడిమెట్ల డిపోలో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడే సంఘానికే కార్మికులు తమ మద్దతు తెలిపారన్నారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని జీడిమెట్ల, కూకట్‌పల్లి, ఉప్పల్, చెంగిచెర్ల, కుషాయిగూడ డిపోల్లో సిపిఐ బలపరిచిన బస్సు గుర్తు ఎంప్లాయిస్ యూనియన్‌కు కార్మికులు అధిక మద్దతు తెలిపారని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్ని ప్రలోభాలు ఎదురైనా కార్మికులు తమ హక్కుల పరిరక్షణకు ఎంప్లాయిస్ యూనియనే సరైన వేదికగా భావించి మద్దతు తెలిపారన్నారు. ఈ ఎన్నికలను నీతి, నిజాయితీకి, అధికారం, డబ్బు ప్రభావానికి మధ్య జరిగిన పోరాటంగా కార్మికులు భావించారని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజలు, కార్మికులు ఎర్రజెండా వైపు చూస్తారని అన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే వరకు ఎంప్లాయిస్ యూనియన్, జాయింట్ యాక్షన్ కమిటీ చేపట్టే పోరాటాలకు సిపిఐ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డిపో యూనియన్ కార్యదర్శి డేనియల్, అధ్యక్షుడు పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సాయ కార్యదర్శి హరినాథ్‌రావు, రాములు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు నరసింహారెడ్డి, ప్రెసిడెంట్ మండల అధ్యక్షుడు బాబు, మహేందర్, బి.ఎల్.నారాయ ణ, బాలయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక రంగానికి ఊతమిచ్చే ఫుడ్ ఫెస్టివల్

### టూరిజం ప్లాజాలో ఆహార సందడి..

### ఉత్సవాన్ని సందర్శించిన సిపిఐ జాతీయ నేత డాక్టర్ కె. నారాయణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు విభిన్న ప్రాంతాల ఆహార సంస్కృతి, సంప్రదాయ వంటకాలకు విస్తృత ప్రచారం కల్పించే లక్ష్యంతో టూరిజం ప్లాజా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫుడ్ ఫెస్టివల్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఈ ఫుడ్ ఫెస్టివల్‌ను సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ సందర్శించారు. తెలంగాణ టూరిజం కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళితో కలిసి ఆయన ఉత్సవ ప్రాంగణాన్ని సందర్శించారు. ఆహారానికి, పర్యాటకానికి మధ్య ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే ఇటువంటి కార్యక్రమాలు ప్రజలకు కొత్త అనుభూతిని అందించడంతో పాటు స్థానిక ఆహార సంస్కృతిని పరిచయం చేయడానికి దోహదపడతాయి. భారత దేశం విభిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయంగా ఉండటంతో పాటు అనేక రకాల ఆహారపు అలవాట్లకు ప్రసిద్ధి చెందింది. ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన వంటకాలు, తయారీ విధానాలు, రుచులు, ఆహార సంప్రదాయాలు ఉన్నా యి. ఇటువంటి ప్రత్యేకతలను ఒకే వేదికపై పరిచయం చేసే ఫుడ్ ఫెస్టివల్స్ ప్రజ ల్లో ఆసక్తిని పెంచుతాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సందర్శకులు విభిన్న రుచులను ఆస్వాదించేందుకు, కొత్త ఆహార అనుభూతులను పొందేందుకు ఇవి అవకాశాన్ని కల్పిస్తాయి. టూరిజం ప్లాజా ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాన్ని డాక్టర్ కె.నారాయణ సందర్శించడం ప్రాధా న్యం సంతరించుకుంది. ఆయనతో పాటు సబ్బు రాజమౌళి కూడా ఉత్సవ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహణ, పర్యాటక రంగంలో ఇటువంటి కార్యక్రమాల ప్రాధాన్యం వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు నిర్వాహకులు వివరాలు అందిస్తే మరింత విస్తృతంగా ప్రచురించవచ్చు.

## అపోలో మెడికల్ కాలేజీలో ఘనంగా పట్టభద్రుల ప్రదానోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఏఐఎంఎస్ఆర్), హైదరాబాద్‌లో అండర్ గ్రాడ్యుయేట్ 2020 బ్యాచ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ 2022 బ్యాచ్ విద్యార్థుల పట్టభద్రుల ప్రదానోత్సవం శనివారం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ భవనం వెంకట్రామ్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ గుండె వైద్య నిపుణుడు, కేర్ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ డాక్టర్ బి. సోమరాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మొత్తం 97మంది ఎంబిబిఎస్ అండర్ గ్రాడ్యు యేట్ విద్యార్థులు, 44 మంది ఎండి, ఎంఎస్ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు వైద్య పట్టాలను అందుకున్నారు. కళాశాల డీన్ డాక్టర్ కె. మనోహర్ విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించగా, ఏఐఎంఎస్ఆర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణ రెడ్డి సభకు స్వాగతం పలికారు. విద్యా, సేవా రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక పురస్కారాలను అందజేశారు. ఉత్తమ అవుట్‌గోయింగ్ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థిగా యుజి 2020 బ్యాచ్‌కు చెందిన మాయాదేవి కొచర్లకోటకు డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. యూజీ 2020 బ్యాచ్‌కు చెందిన వెల్లూరు సర్వన్ శ్రీరామ్యకు డాక్టర్ కె.వి.ఆర్. ప్రసాద్ స్మారక గోల్డ్ మెడల్ అందజేశారు. జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ సముద్రాల కావ్య ఉత్తమ అవుట్‌గోయింగ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థిగా డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు. 2012లో స్థాపించబడిన అపోలో మెడికల్ కాలేజీ నుంచి ఇప్పటివరకు 700 మందికిపైగా విద్యార్థులు పట్టభద్రులయ్యారని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ కళాశాల పూర్వ విద్యార్థుల్లో 90 శాతం మందికిపైగా దేశంలోని వివిధ వైద్య కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు, విదేశాల్లో రెసిడెన్సీ అవకాశాలు పొందినట్లు వెల్లడించింది.



## మున్సిపల్ భవన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించండి

**ప్రజాపక్షం/నిజాంపేట్:** బాచుపల్లి మండలం సర్వే నెంబర్ 233/1లో శంకుస్థాపన గావించి కోర్టు చిక్కులతో నిలిచిపోయిన సిఎంసి నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ నూతన కార్యాలయ భవన నిర్మాణ స్థలాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిఎంసి నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయ నిర్మాణానికి గతంలో నాలుగు ఎకరాలను కేటాయించి శంకుస్థాపన చేయడం జరిగిందని, కానీ కొన్ని కోర్టు సమస్యలతో పనులను ప్రారంభం కాలేదనీ రెవెన్యూ పరంగా న్యాయపరమైన చిక్కులను తొలగించి మున్సిపల్ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ మల్లేశ్వర్ రావు, సాయి, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల పట్టివేత

**ప్రజాపక్షం/పరిగి:** మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డులో విపరీతంగా పెరిగిపోయిన వీధి కుక్కలను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ సూచనల మేరకు 8వ వార్డు కౌన్సిలర్ అభిబ్ ఉన్నిసా అయూబ్ వీధికుక్కలను పట్టించే కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల వీధి కుక్కల దాడిలో చిన్నారులు, ప్రజలు భయందోళనకు గురవుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## హకింపేట డిపోలో టిఎంయు విజయకేతనం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట డివిజన్ హకింపేట ఆర్‌టిసి డిపోలో యూనియన్ ఎన్నికల్లో తెలంగాణ మజ్దూర్ యూనియన్ విజయకేతనం ఎగురవేసిందని జెఎసి రీజియన్ సెక్రటరి గోపు శ్రీనివాస్ అన్నారు. శనివారం హకింపేట డిపోలో యూనియన్ ఎన్నికల్లో గెలిచిన సందర్భంగా డిపోలోని ఉద్యోగులకు స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మొత్తం ఓట్లు 553 ఉండగా 541 ఓట్లు పోల్ అయ్యాయని తెలిపారు. టిఎంయు యూనియన్ నిచ్చెన గుర్తుకు 315 ఓట్లు రాగ టిడబ్ల్యుయు యూనియన్ బాణం గుర్తుకు 206 ఓట్లు వచ్చాయని, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన టిడబ్ల్యుయు యూనియన్‌పై టిఎంయు యూనియన్ 109 ఓట్ల మెజారిటీతో గెలుపొందిందని చెప్పారు. ఈ విజయం ఆర్టీసి అమరవీరులకు అంకితం ఇస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని పన్నాగాలు పన్నినా చివరికి కార్మికులు టిఎంయును గెలిపించారని పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఉద్యోగుల విలీనం, ఉద్యోగ భద్రత, టికెట్ తీసుకునే బాధ్యత ప్రయాణికులదే, పెండింగ్ బకాయిలు లాంటి అంశాలపై పోరాడుతామని వివరించారు.

ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి గోపు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మౌలాన, బిసి సంఘం గౌరవ అధ్యక్షుడు నూనెముంతల రవీందర్‌గౌడ్, సెక్రటరిలు సుగుణాచారి, నీల వెంకటేష్, షర్ఫుద్దీన్, అసిస్టెంట్ సెక్రటరిలు రాజేందర్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాళీమాత ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

### టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాతబస్తీలోని ప్రసిద్ధ ఫలక్ నుమా కాళీ మాతా ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ రక్షణ సేన(టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని కోరారు. నిత్యం వేలాదిగా భక్తులు తరలివచ్చే ఈ పుణ్య క్షేత్రంలో మౌలిక వసతులు లేకపోవడం విచారకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఫలక్‌నుమా ఖాళీ మాతా మందిరాన్ని శనివారం ఆమే సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజలకు ఖాళీ మాతా ఎంతో నమ్మకమైన దైవమని, భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఈ ఆలయానికి వచ్చే యాత్రికులకు సరైన రోడ్డు మార్గం కూడా లేదని చెప్పారు.

ఆలయ చుట్టూ రైల్వే భూము లు, పక్కనే శ్మశానం ఉండటంతో రోడ్డు వేయడానికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయన్నా రు. ఈ సమస్య పరిష్కారం కోసం ఎండోమెంట్ శాఖ అధికారులతో పాటు రైల్వే అధికారులతో కూడా మాట్లాడి, ఇక్కడ రోడ్లు నిర్మాణం చేయించి, అన్ని రకాల వసతులు కల్పించేందుకు తన వంతుగా పూర్తి ప్రయ త్నం చేస్తానని కవిత స్థానికులకు హామీనిచ్చా రు.

**తెలంగాణ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు**

బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ కల్వకుంట్ల కవిత ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను రాష్ట్రంలోని ఆడబిడ్డలందరూ ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ మన తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు.



## అక్రమ అరెస్టులకు నిరసనగా మోదీ దిష్టి బొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలన్న డిమాండ్‌తో ఢిల్లీ ధర్నాకు తరలివెళుతున్న సిపిఐ, ఎఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతల అక్రమ అరెస్టులకు నిరసనగా సిపిఐ శ్రేణులు శనివారం ఉప్పల్ బస్‌డిపో ఎదుట ప్రధాని మోది దిష్టి బొమ్మను దగ్ధం చేసారు. ప్రజాస్వామ్య రీతిలో ఎవరికైనా నిరసనలు వ్యక్తం చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని, శాంతి భద్రతలకు ఎలాంటి ముప్పు కలిగించకుండా వెళ్లే వారిని అడ్డుకొని ఎక్కడికక్కడ అరెస్టులు చేయటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయటమే అని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేడిపల్లి మండల సిపిఐ కార్యదర్శి రచ్చ కిషన్ అన్నారు. అక్రమంగా అరెస్టులు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు సిహెచ్ మాధవి, నాగరాజు, ఇస్తారి, సోమరాజు, బికెఎంయు మండల అధ్యక్షులు భూతం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన

### తిరుమలగిరి ఎసిపి శంకర్‌రాజు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఎసిపి శంకర్‌రాజు అన్నారు. శనివారం శామీర్‌పేటలోని నల్సార్ చౌరస్తాలో ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నల్సార్ జంక్షన్‌లో రహదారి వినియోగదారులకు ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం సురక్షిత ప్రయాణాన్ని ప్రోత్సహించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. లేన్ క్రమశిక్షణను అనుసరించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగించకపోవడం, నిర్ణీత వేగ పరిమితులను పాటించడం, పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై అవగాహన కల్పించామని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అత్యవసర సేవల వాహనాలకు దారి ఇవ్వడం, జంక్షన్‌ల వద్ద అప్రమత్తంగా ఉండడం, వాహనాలను నిర్లక్ష్యంగా నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి అంశాలను వివరించారు. 'మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది' 'సురక్షితంగా ప్రయాణించండి క్షేమంగా గమ్యస్థానానికి చేరుకోండి' అనే సందేశంతో రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు ఇన్‌స్పెక్టర్ జానకిరాములు, ఎస్ఐ నవీన్‌రెడ్డి, కిషోర్, హెచ్‌కెఆర్ రోడ్‌వేస్ ప్రతినిధి బాలరాజు, రోడ్డు సేఫ్టీ ఎస్ఐ జోజి. ఇతర బృందం పాల్గొన్నారు.




## గీతాంజలి హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** స్థానిక జవహర్ నగర్‌లోని గీతాంజలి హైస్కూల్‌లో బతుకమ్మ పండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా, కోలాహలంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని కొనియాడారు. ప్రకృతిని ఆరాధించడం, పూలను పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. తెలంగాణ వ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ ఉత్సవాలు, తొమ్మిదవ రోజున జరుపుకునే సద్దుల బతుకమ్మతో ఘనంగా ముగుస్తాయి. ప్రకృతి రక్షణతో పాటు మన సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది అని ఆమె పేర్కొన్నారు. రకరకాల రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ విద్యార్థినులు, ఉపాధ్యాయులు చప్పట్లు కొడుతూ, బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ నాగరాణి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాఠశాల విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మృతి

**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లా కేంద్రంలోని మున్సిపల్, రైల్వే స్టేషన్‌దగ్గర ఉన్న ఎటిఎం, దగ్గర ఒక వ్యక్తి మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న ఫుట్‌పాత్‌పై మరొక వ్యక్తి మృతి చెందరు. ఈ సందర్భంగా సిఐ రాఘుకుమార్ మాట్లాడుతూ సదరు వ్యక్తులు సుమారు 55నుండి 59 మధ్య వయస్సు ఉండవచ్చని, పేరు, చిరునామ,కుటుంబసభ్యులకు సంబంధించిన వివరాలు తెలియలేదని అన్నారు. కావున వారిని ఎవరైన గుర్తించినట్లు అయితే 8712670340నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## బావిలో దూకి యువతి ఆత్మహత్య



**ప్రజాపక్షం/పరిగి:** వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని రావులపల్లి గ్రామ శివారులోని ఓ బావిలో దూకి శిరీష (18) అనే యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పరిగి పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన చరణ్‌కుమార్ అలియాస్ చింటు (21) అనే యువకుని విచారించగా తనకు శిరీషకు మధ్య ప్రేమ సంబంధం ఉందని, ఇద్దరి మధ్య జరిగిన వివాదం అనంతరం శిరీష వెళ్లిపోయిందని తెలిపారు. ఓ వ్యవసాయ బావి వద్ద ఆమె చున్నీ కనిపించింది. కుటుంబీకులు, పోలీసులు, అగ్ని మాపకశాఖ సిబ్బంది, కలిసి బావిలో గాలించగా శిరీష మృతదేహం లభ్యమయింది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతిరాలి తండ్రి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విగ్రహాల ధ్వంసాన్ని అరికట్టాలి

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** అంబేద్కర్ విగ్రహాలను ధ్వంసం చేసే అరాచక శక్తుల పట్ల, రాజ్యాంగానికి వ్యతిరేకంగా అసభ్య పదజాలంతో లూజ్ టాక్స్ మాట్లాడే వారి పట్ల తెలంగాణ ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరించాలని నేషనల్ అంబేద్కర్ సేన తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గోకుల కళ్యాణ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సమీప కాలంలో తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్ అక్కడి సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు, సమానత్వానికి కట్టుబడి కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారని.. అదే తరహాలోనే తెలంగాణ వ్యాప్తంగా సరికొత్త కఠిన నిబంధనలను చట్టరూపంలోకి తీసుకురావాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ప్రజలు సంతోషంగా జీవించాలి



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డా.పివి రవిశేఖర్‌రెడ్డి ఆకాంక్షించారు. భాద్రపదమాసం బహుళ మహాలయ అమావాస్య పర్వదినం శనివారం రావడం సందర్భాన్ని పురస్కరించుకుని జీటీఎస్ టెంపుల్‌లో ఆంజనేయ స్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో గుమ్మడిదల సుధాకర్, అర్చకులు కలిసి రవిశేఖర్‌రెడ్డికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గుమ్మడిదల సుధాకర్, బిసి చైతన్య వేదిక గ్రేటర్ అధ్యక్షులు టి.వినోద్‌కుమార్, జూబ్లీహిల్స్ కన్వీనర్ కాలేరు రవీందర్, మాల మహానాడు గ్రేటర్ ఉపాధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబురాలు



**ప్రజాపక్షం/సీతాఫల్‌మండి:** బతుకమ్మ సంబురాలు చిలకలగూడ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సంబురాలలో విద్యార్థులు, వారి తల్లులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, నీలిమ, దివ్య, ఆయేషా అంజుమ్, మల్లీశ్వరి, హసీనా బేగం, సలేహ, షాహీన్ సుల్తానా, ఆయాలు శారద, హేమలత, రేణుక పాల్గొన్నారు.

## నేటి నుంచి కట్టమైసమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన లోయర్ ట్యాంక్‌బండ్ శ్రీ కనకాల కట్టమైసమ్మ ఆలయంలో ఈ నెల 11 నుంచి 20 వరకు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ జి.గౌతమ్ కుమార్ పటేల్, కార్యనిర్వహణాధికారి పి.మహేందర్ గౌడ్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి, అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. వివరాలకు 9490551711, 9848357259 సంప్రదించాలని సూచించారు.

## ఉద్యమకారుడు ఈదురు జనార్ధన్ కుటుంబానికి కెటిఆర్ ఆపన్నహస్తం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో మానుకోట సంఘటన నుంచి చురుగ్గా పాల్గొన్న దళిత ఉద్యమకారుడు ఈదురు జనార్ధన్ అకాల మరణంతో నిరుపేదగా ఉన్న ఆయన కుటుంబం రోడ్డున పడింది. రోజువారీ కూలీగా పనిచేస్తూ ముగ్గురు ఆడబిడ్డలను పోషిస్తున్న జనార్ధన్ మరణంతో ఆ కుటుంబం ఎదుర్కొంటున్న దీనస్థితిపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ ముగ్గురు ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసాగా ఒక్కొక్కరి పేరిట రూ.3 లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించడంతో పాటు, కుటుంబ తక్షణ అవసరాల కోసం రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. కెటిఆర్ ఆదేశాల మేరకు బిఆర్‌ఎస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రెడ్యా నాయక్, మాజీ ఎంపి మలోత్ కవిత సహా మహబూబాబాద్ జిల్లాకు చెందిన బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు జనార్ధన్ నివాసానికి వెళ్లారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, కెటిఆర్ అందించిన సహాయాన్ని వారికి అందజేశారు. ఉద్యమానికి సేవ చేసిన కష్టజీవి కుటుంబానికి అండగా నిలిచి, వారి బిడ్డల భవిష్యత్తుకు ధీమా కల్పించిన కెటిఆర్ చొరవకు స్థానికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మోదీ, అమిత్ షాలది నైతిక ఓటమి

### అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలి: సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటు చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఉద్యమాన్ని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించడం మోదీ, అమిత్ షాల నైతిక ఓటమికి నిదర్శనమని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ విమర్శించింది. ప్రజాస్వామ్య నిరసనలను అణచివేయడం రాజ్యాంగ హక్కులు, పౌర స్వేచ్ఛలపై దాడి అని శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. నిరసనలను అడ్డుకునేందుకు వేలాదిగా భద్రతా బలగాలను మోహరించడం, రైళ్లు రద్దు చేయడం, మెట్రో స్టేషన్లు మూసివేయడం వంటి చర్యలు అత్యవసర పరిస్థితులను తలపిస్తున్నాయని ఆరోపించింది. ఓటరు జాబితాల నుంచి 13 కోట్ల మంది పేర్లు తొలగించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని కోరింది. శాంతియుత నిరసనలకు అనుమతించి ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలని, అణచివేత చర్యలకు వ్యతిరేకంగా ప్రజలు నిరసన తెలపాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ పిలుపునిచ్చింది.

# ధనిక, పేద తేడా లేకుండా.. సమాన న్యాయం అందించేందుకు కృషి

- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** న్యాయవాద వృత్తిలో న్యాయానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని.. ధనికులు, పేదలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం అందించేందుకు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి పేర్కొన్నారు. నూతన న్యాయ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని.. లైబ్రరీలో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. న్యాయ విద్య ప్రాముఖ్యత, న్యాయవాద వృత్తిలో పాటించాల్సిన నైతిక విలువలు, భవిష్యత్తులో మంచి న్యాయవాదులుగా ఎదిగేందుకు అనుసరించాల్సిన మార్గాలపై ఆయన విలువైన సూచనలు చేశారు. శనివారం కేశవ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ లా ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి ఎల్ఎల్బీ కోర్సులో నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఇండక్షన్ డే–2026 కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నేటి యువత సోషల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారని.. అయితే విద్యార్థులు వీటిని అవసరమైన మేరకు మాత్రమే వినియోగించుకోవాలని, పూర్తిగా వాటిపైనే ఆధారపడకుండా స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వృత్తిలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా వ్యక్తిలోని మంచితనం, మానవత్వం, నైతిక విలువలు మారకూడదని హితవు పలికారు. న్యాయవాద వృత్తి కేవలం సంపాదనకు మాత్రమే పరిమితం కాకుండా, సమాజానికి న్యాయం అందించే బాధ్యతతో కూడుకున్నదని విద్యార్థులు గుర్తించాలన్నారు. న్యాయ విద్యలో పటిష్టమైన పునాది ఏర్పరచుకోవడం, నిరంతరం అధ్యయనం చేయడం, క్రమశిక్షణతో ముందుకు సాగడం ద్వారా వృత్తిలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జస్టిస్ విజయసేన్‌రెడ్డి తన బాల్యం, విద్యాభ్యాసం, జీవిత ప్రయాణానికి సంబంధించిన అనుభవాలను నూతన లా విద్యార్థులతో పంచుకున్నారు. తన అనుభవాల ద్వారా విద్యార్థులకు స్ఫూర్తినిస్తూ, లక్ష్యసాధనకు కృషి, పట్టుదల, నిరంతర అధ్యయనం ఎంతో అవసరమని వివరించారు. కార్యక్రమానికి కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షుడు సీఏ జె.నరసింహారావు, కార్యదర్శి డాక్టర్ ఎవి సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి బి.శ్రీధర్‌రెడ్డి, కేశవ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ లా కరస్పాండెంట్ ఎల్.ప్రభాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అక్కపెద్ది పాల్గొన్నారు.

## 14, 15న 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్–2026'

- హాజరుకానున్న సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అంతర్జాతీయ స్థాయిలో కొత్త అవకాశాలను కల్పించే లక్ష్యంతో ఈ నెల 14, 15 తేదీల్లో 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్ – 2026' నిర్వహిస్తున్నట్టు సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు టివిఎన్ రావు, పివి రావు, ఏవీ రత్నం, తోట చంద్రశేఖర్, రజనీకాంత్ తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగే ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాశ్వాన్, పద్మవిభూషణ్ ప్రముఖ సినీ నటుడు కొణిదెల చిరంజీవి హాజరవుతారని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో వారు మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి 14న ఉదయం సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. వ్యాపార భాగస్వామ్యాల ఏర్పాటు, పెట్టుబడులను ఆకర్షించడం, కొత్త మార్కెట్లను అన్వేషించడం, పారిశ్రామిక రంగంలో పరస్పర సహకారాన్ని పెంపొందించడం ఈ గ్లోబల్ బిజినెస్ మీట్ ప్రధాన లక్ష్యమని వారు వివరించారు.

# కాంగ్రెస్ ఎంపిపై చర్యలు తీసుకోవాలి

- గాంధీభవన్ ముట్టడించిన బిజెపి మహిళా మోర్చా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా సాధికారత అంటూ కల్లబొల్లి నీతులు వల్లించే రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అసలు స్వరూపం మరోసారి బట్టబయలైందని బిజెపి మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పా రెడ్డి అన్నారు. మణిపూర్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపి డాక్టర్ అంగోమ్‌చా బిమోల్ అకోయిజంపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలకు నిరసనగా బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. గాంధీ భవన్ ముట్టడికి వెళ్లిన మహిళా మోర్చ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి, స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శిల్పా రెడ్డి మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఆరోపణలు రుజువైన నేపథ్యంలో సంబంధిత ఎంపిపై కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జెఎన్‌యుఏ అంతర్గత కమిటీ విచారణ అనంతరం చర్యలు తీసుకున్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎంపిపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోకపోవడం విస్మయం కలిగిస్తుందన్నారు. ఎంపిని కేవలం పదవి నుంచి తప్పించడం కాకుండా, పార్టీ నుంచి కూడా బహిష్కరించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## కత్తితో బెదిరించి దొంగతనం : పాత నేరస్తుడు అరెస్ట్



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** కత్తితో బెదిరించి నగదు, మొబైల్ ఫోన్ దొంగతనానికి పాల్పడిన కేసులు ఫ్యూచర్ సిటీ పోలీసులు ఛేదించారు. అందుకు సంబంధించిన నగదు, సెల్‌ఫోన్‌తో పాటు దోపిడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శంకర్‌పల్లి పోలీసులు, ఫతేపూర్ బ్రిడ్జి సమీపంలోని స్క్రాప్ దుకాణంలో జరిగిన దోపిడీ కేసులో ఒక పాత నేరస్తుడిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈనెల 8వ తేదీ తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు పాత ఇనుప సామాన్లు అమ్మేందుకు వచ్చినట్లు నటిస్తూ స్క్రాప్ దుకాణంలోకి ప్రవేశించారు. అక్కడ ఉన్న వారిని బెదిరించి రూ.25 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు దోచుకుని పరారయ్యారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు హైదరాబాద్‌లోని టోలిచౌకి, హకీంపేట్‌కు చెందిన మహ్మద్ రబ్బానీ (30)ని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు మహ్మద్ సోహైల్ ఖురేషి, అస్లాం పరారీలో ఉన్నారు. పోలీసులు దర్యాప్తులో భాగంగా ఒక కత్తి, రూ.3,500 నగదు, ఒక రెడ్‌మీ 5జీ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన మహ్మద్ రబ్బానీతో పాటు పరారీలో ఉన్న మహ్మద్ సోహైల్ ఖురేషిపై గతంలో కూడా పలు క్రిమినల్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 479/2026, బిఎన్ఎస్ సెక్షన్ 309(6), రెడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును శంకర్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ జి.రుద్వీర్ కుమార్, చేవెళ్ల డివిజన్ డీఐ ఎల్.సమరం రెడ్డి, మొకిలా క్రైమ్ టీమ్ కలిసి ఛేదించారు. చేవెళ్ల ఏసిపి బి.కిషన్ మార్గదర్శకత్వంలో, చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్, పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ నిర్వహించారు.ఈ క్రైమ్ టీమ్‌లో ఏఎస్ఐ నాగిరెడ్డి, పిసిలు నాగభూషణ్,యాదగిరి, హెచ్‌సీ పాండరి, పిసి నవీన్ కుమార్, హెచ్‌జి రమేష్ పాల్గొన్నారు.

## ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు



### మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** శ్రీ కన్యక పరమేశ్వరి మాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా అన్నారు. జవహర్‌నగర్ పరిధిలోని శ్రీరామనగర్ కాలనీలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జవహర్‌నగర్ మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను ప్రారంభించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శారద మనోధర్ రెడ్డి, నాయకులు రవీందర్ గుప్తా, బల్లి శ్రీనివాస్, గజ్వేల్ శంకర్ రాజు, మాట్ల వినయ్, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలు వడ్డించి, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ ఆర్యవైశ్య సంఘం సంయుక్తంగా చేపట్టిన ఈ అన్నప్రసాద కార్యక్రమం పట్ల స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానికులు, మహిళలు, భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.



## సిఎంఆర్ఎఫ్ వినియోగించుకోవాలి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని బిఆర్‌ఎస్ నాయకులు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 131 డివిజన్ అంబేద్కర్ నగర్‌కు చెందిన కె.రాంరెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.1,50,000 ఆర్థిక సహాయానిన మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం చింతల్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్‌ఎస్ కార్యాలయంలో స్థానిక నాయకులు లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు ఎల్వోసి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స పొందలేని పేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ వంటి పథకాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన వైద్యం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, ఎండీ నసీరుద్దీన్, రమణారెడ్డి, ఆంజనేయులు, కొత్త నరసింహారెడ్డి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



## శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

**ప్రజాపక్షం/అమీర్‌పేట్ :** ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలంటూ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వానాలు అందజేశారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయం అధికారులు, పండితులు ఆహ్వానాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బిఆర్‌ఎస్ నేత కొలన్ బాల్‌రెడ్డి, ఆలయ ఇఒ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్, అర్చక పండితులు పరాశరం రవీంద్రాచార్యులు, నాయకులు కరుణాకర్‌రెడ్డి, రవికుమార్, మహేష్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా పద్మారావునగర్ లోని పోల్‌బాల్ హనుమాన్ దేవాలయం అధికారులు, పండితులు దేవీ నవరాత్రులకు రావాలంటూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వానాన్ని అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆలయ ఇఓ నర్సదాస్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రాజేష్ గౌడ్, ఆలయ పండితులు వినోద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మనసుకు ఔషధం వినడమే



**ప్రజాపక్షం/పంజాగుట్ట:** మనసుకు ఔషధం మనసారా వినడమే అని స్కిల్స్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ డా.విజే విద్యాసాగర్ అన్నారు. ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రెయిన్ బో హోంలో స్టడీ స్ట్రెస్ సూసైడ్ అనే అంశంపై జరిగిన వ్యాస రచన పోటీల నేపథ్యంలో విద్యాసాగర్, క్లినికల్ సైకాలజిస్ట్ నిఖిల్, జి.కృష్ణవేణి, డా.హిప్నో పద్మా కమలాకర్, రాధికా, ఓషల్, ఐటీ విద్యార్థి సహజ, రెయిన్ బో హెడ్ సదాలక్ష్మి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

## నవ్వించిన 'నైవేద్యం'



**ప్రజాపక్షం/రవీంద్రభారతి :** సినీ రచయిత, ఎం.వి.ఎస్. హరనాథ రావు వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తూ.. జయ ఆర్ట్స్ హైదరాబాద్, లలిత కళా పరిషత్తు అనంతపురం సంయుక్త నిర్వహణలో 'నైవేద్యం' నాటికను ప్రదర్శించారు. ఆకలితో ఉన్న పేదవాడికి పిడికెడు మెతుకులు కూడా పెట్టించలేని మానవత్వం, దానిని ఆపలేని దైవత్వం మధ్య నడిచే కథాంశంతో ప్రేక్షకులను అలరించింది. అందరినీ కడుపుబ్బా నవ్వించి, ఆలోచింపజేసింది. ఇప్పటివరకు 45 నాటికలకు దర్శకత్వం వహించిన శ్రీజ 46వ నాటికగా తనకు ఇష్టమైన 'నైవేద్యం'కు దర్శకత్వం వహించడం సంతోషంగా ఉన్నదని, ఇది హరనాథరావుకు నివాళి అర్పించడమేనన్నారు. లలిత కళా పరిషత్తు సెక్రటరీ గాజుల పద్మజ ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, నాటిక ప్రదర్శనను విజయవంతం చేశారు. సినీనటులు రంగస్థల దర్శకులు వెంకట్ గోవాడ అతిథిగా హాజరయ్యారు. అనంతరం దర్శకురాలు శ్రీజ సాదినేని ఘనంగా సత్కరించారు.

## సిఎంను అప్రతిష్ట పాలు చేయడమే బిఆర్‌ఎస్ భజన బృందం పని

- ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అప్రతిష్ట పాలు చేసేందుకు బిఆర్‌ఎస్ నాయకత్వం తన భజన బృందానికి ప్రత్యేక టాస్క్ ఇచ్చిందని ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ విమర్శించారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో కెసిఆర్, కెటిఆర్‌లను పొగుడుతూ, రేవంత్‌రెడ్డిని తిట్టడమే బిఆర్‌ఎస్ నేతల పనిగా మారిందని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డిపై ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ఆయన వెనక్కి తగ్గరని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వస్తామని కల్వకుంట్ల కుటుంబం కంటున్నవని పగటి కలలేనని విమర్శించారు. హరీశ్‌రావు, కేటీఆర్‌ల రాజకీయాలకు రేవంత్‌రెడ్డి అడ్డుకట్ట వేస్తారని మెట్టు సాయి కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

## డెలివరీ బైకులకు పసుపు నంబర్ ప్లేట్లు వద్దు

- సిఎం రేవంత్‌రెడ్డికి సిఎఫ్ఎల్ అధ్యక్షుడు నలమోత చక్రవర్తి విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డెలివరీ బైకులు, బైక్ ట్యాక్సీలకు పసుపు రంగు వాణిజ్య నంబర్ ప్లేట్లు తప్పనిసరి చేయాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సెంటర్ ఫర్ లిబర్టీ (సిఎఫ్ఎల్) అధ్యక్షుడు నలమోత చక్రవర్తి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ నిబంధన అమలైతే వ్యక్తిగత ద్విచక్ర వాహనాలతో ఉపాధి పొందుతున్న నిరుద్యోగ యువతపై అదనపు ఆర్థిక భారం పడుతుందని పేర్కొంటూ సిఎంకు లేఖ రాశారు. ఓలా, ఉబర్, డెలివరీ యాప్‌ల ద్వారా వ్యక్తిగత వాహనాలను వినియోగించుకుని అదనపు ఆదాయం సంపాదించే అవకాశాలను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో వ్యక్తిగత వాహనాల వినియోగానికి అనుమతించే విధానాలు ఉన్నాయని లేఖలో ప్రస్తావించారు. కార్లకు వాణిజ్య నంబర్ ప్లేట్లు, ఇతర నిబంధనల వల్ల ఖర్చులు పెరిగి గిగ్ ఉపాధి కష్టతరమైందని పేర్కొన్నారు. అధిక నియంత్రణలు చిన్నస్థాయి స్వయం ఉపాధికి అడ్డంకిగా మారకూడదని, పాతకాలపు 'లైసెన్స్ రాజ్' ధోరణికి స్వస్తి పలకాలని కోరారు. యువత ఉపాధి, రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## హోప్ ఫౌండేషన్ 205వ అన్నదానం



**ప్రజాపక్షం/మియాపూర్:** హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం శనివారం 205వ వారానికి చేరుకుని అత్యంత ఘనంగా జరిగింది. గంగారం, చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కోదండరామ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్, హోప్ ఫౌండేషన్ చైర్మన్, గోల్డ్ మ్యాన్ కొండ విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, చందానగర్ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రదర్శనలో సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్





పోలీసుల అదుపులో మాజీ ముఖ్యమంత్రులు మమత బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ , పినరాయ్ విజయన్



ప్రముఖ ఆర్థికవేత్త, యుపిఎ సలహామండలి సభ్యుడిగా వ్యవహరించిన జీన్ డ్రీజ్‌ను అదుపులో తీసుకుంటున్న పోలీసులు



ముంబయ్‌లో జరిగిన నిరసనలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్‌ఖాన్

## ఢిల్లీ నిరసనలు



అరెస్టయిన నిరసనకారులను తరలిస్తున్న బస్సును అడ్డుకుంటున్న యువతులు








పోలీస్ వ్యానులో ఎఐఎస్ఎఫ్ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్



మహిళా న్యాయవాదిపై పోలీసు దురుసు ప్రవర్తన




సిపిఐ ప్రధాన కార్యాలయం అజయ్‌భవన్ నుంచి ప్రదర్శనగా బయలుదేరుతున్న సిపిఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ కార్యకర్తలు




తమ సహచరులను తీసుకెళ్తున్న పోలీసుల వ్యాన్‌కు అడ్డుగా రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని సుప్రీం కోర్టు న్యాయవాదుల నిరసన



యువతిపై హిందూ రక్షక్ దళ్ కార్యకర్తల దాడి

## బాలల కేసుల వార్తలను నెట్‌కు దూరంగా ఉంచాలి

• సిజెఐ సూర్యకాంత్



**న్యూఢిల్లీ :** చట్టంతో సంఘర్షణలో ఉన్న పిల్లల పేర్లను వార్తలు, ఇంటర్నెట్‌కు దూరంగా ఉంచాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ అన్నారు. ఈ పదబంధం ఒక వ్యక్తిగత గుర్తింపును కాకుండా, ఒక నిర్దిష్ట పరిస్థితిని మాత్రమే సూచిస్తుందని సిజెఐ పేర్కొన్నారు. ఆయన శనివారం ఇక్కడ యునిసెఫ్ సహకారంతో సుప్రీంకోర్టు బాలల న్యాయ కమిటీ నిర్వహించిన 'బాలల న్యాయ (సంరక్షణ, రక్షణ) చట్టం–2015 పదేళ్లు, పురోగతి, సవాళ్లు, రాబోయే దశాబ్దానికి ప్రాధాన్యతలు' అనే అంశంపై జాతీయ భాగస్వాముల సంప్రదింపుల సమావేశాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. చట్టప్రకారం 10సంవత్సరాలు తక్కువ కాలమే అయినా, అది బాల్యంలో సగానికంటే ఎక్కువ అని సిజెఐ సూర్యకాంత్ అన్నారు. నేరస్తుడిగా ముద్రపడిన పిల్లవాడి కంటే, రెండో అవకాశం పొందిన పిల్లవాడు సమజంలో ఉత్పాదక సభ్యుడిగా మారే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుందనే నమ్మకాన్ని 2015 చట్టం కలిగిస్తోందని సిజెఐ చెప్పారు. 'గతం భవిష్యత్తుపై నీడలా పడనప్పుడే ఈ ప్రయాణం నిజంగా ముగుస్తుంది. అందుకోసం మనం పాత రికార్డులను సకాలంలో నాశనం చేయాలి. అలాగే, చట్టంతో సంఘర్షణ ఉన్న పిల్లల పేర్లను వార్తల్లో, ఇంటర్నెట్‌లో లేకుండా చూడాలి. ఎందుకుంటే, ఆ పేర్లు అక్కడ సంత్సరాల తరబడి నిలిచిపోతాయి' అని ఆయన అన్నారు. 'ఒక సంస్థ గేట్ వద్ద ముగిసిపోయే పునరావాసం, అసలు పునరావాసమే కాదు. ఎందుకంటే, ఎలాంటి కళంకం లేకుండా, ఒక యువ వ్యక్తికి కుటుంబం, పాఠశాల, సమాజంలో తిరిగి స్థానం కల్పించడమే పునరేకీకరణ' అని సిజెఐ అన్నారు.ఈ చట్టం అమలులోకి వచ్చిన జనవరి 2016లో జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరచబడిన 15ఏళ్ల బాలుడికి ఈరోజు సుమారు 25ఏళ్ల వయసు ఉంటుందని, ఆ 15ఏళ్ల మైనర్‌కు ఈ చట్టం చేసిన మొదటి వాగ్దానం అది ఉపయోగించిన పదాల లోనే ఉందని ఆయనఅన్నారు. 'ఇది కేవలం మర్యాదు కాదు. ఎందుకంటే, 'చట్టంతో సంఘర్షణలో ఉన్న పిల్లవాడు' అనే పదం ఒక పరిస్థితిని వివరిస్తుంది. గుర్తింపును కాదు అని సిజెఐ వివరించారు. పరిస్థితులు సాధారణంగా కష్టంగా ఉంటాయని, ఎందుకంటే, ఈ యువకుల కథలు తరచుగా మధ్యలోకి ఆగిపోయిన చదువులు , ఒత్తిడితో ఉన్న కుటుంబాలు, పేదరికం గురించి చెబుతాయని సిజెఐ సూర్యకాంత్ వివరించారు. వారిలో చాలామంది మొదటిసారిగా చట్టం ముందుకు వస్తున్నారని సిజెఐ చెప్పారు. పిల్లల కోసం శిక్షణ పొందిన రక్షణ న్యాయవాదులతో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాలని సూర్యాకాంత్ న్యాయ సేవా సంస్థలను కోరారు. తద్వారా, ప్రతీ ఒక్కరికీ మొదటి గంట నుంచే ఒక ప్రత్యేక న్యాయవాది ఉంటారని, పోలీస్ స్టేషన్ నుండి తుది ఉత్తర్వులు వచ్చే వరకూ, పునరావాసంలోకి ప్రవేశించే వరకూ అదే న్యాయవాది సహాయం అందిస్తూనే ఉంటారని సిజెఐ సూచించారు.

## పొరుగు, ప్రపంచ భద్రతా పరిణామాలను..
# భారత్ నిశితంగా పర్యవేక్షిస్తోంది

• రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**జోధ్‌పూర్ :** ఆధునిక యుద్ధ తంత్రం, ప్రపంచ భద్రతా వ్యవస్థలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో, ఈ ప్రాంతంలోనూ, అంతకుమించి జరుగుతున్న పరిణామాలను, అలాగే, వాటి వ్యూహాత్మక పర్యవసానాలను భారత్ నిశితంగా గమనిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. శనివారం జోధ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో జరిగిన 'తరంగ్ శక్తి–2026' విన్యాసాల సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, 'ఆత్మనిర్భర్ భారత్' దార్శనికతతో భారత సాయుధ దళాలు 'నిర్మాణాత్మకంగా', 'భౌతికంగా', వ్యూహాత్మకంగా ప్రాథమిక పరివర్తనకు లోనవుతున్నాయని అన్నారు. భారతదేశం మన ప్రాంతంలో, వెలుపల జరుగుతోన్న పరిణామాలను వాటి విస్తృత్త వ్యూహాత్మక ప్రభావాలతోపాటు నిరంతరం పర్యవేక్షిస్తోందని వైమానిక ప్రదర్శనను వీక్షించిన అనంతరం రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ప్రస్తుత ప్రపంచ వ్యవస్థ వేగంగా మారుతోందని, అయితే, భవిష్యత్ వ్యవస్థ స్వరూపం ఇంకా మారలేదని సింగ్ అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ అనే భారతదేశ దార్శనిత అంటే ప్రపంచం నుండి ఏకాకిగా ఉండటం కాదు. కీలకమైన రక్షణ, సాంకేతిక పరిజ్ఞానాల రూపకల్పన, అభివృద్ధి, తయారీ, నిర్వహణ, ఉన్నతీకరణ చేసేందుకు దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవడమే దీని అర్థమని ఆయన అన్నారు. వేగవంతమైన సాంకేతిక మార్పులు, కొత్త సంఘర్షణ ప్రాంతాల ఆవిర్భావంతో ఆధునిక యుద్ధం మరింత సంక్లిష్టంగా మారుతోందని రక్షణమంత్రి తెలిపారు. ప్రభుత్వేతర శక్తుల పాత్ర పెరగడం, కీలక వాణిజ్య మర్గాలు, సముద్ర మార్గాలకు ముప్పు, నూతన సాంకేతిక పరిజ్ఞానాల వంటి వాడకం ప్రపంచ భద్రతా వాతావరణంలో అనిశ్చితిని పెంచుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కొత్త సాంకేతిక మార్పులు, ఆయుధ రంగాల విస్తరణ, కొత్త అంశాల చేరికతో ఆధునిక యుద్ధం మరింత సంక్లిష్టంగా మారుతోంది. ఇది ఇకపై భూమి,సముద్రం, గాలికి మాత్రమే పరిమితం కాలేదు. ఇది ఇప్పుడు అంతరిక్షం, సైబర్, విద్యుదయస్కాంత వర్ణపటం, సమాచార రంగానికి కూడా విస్తరించింది. ఆకస్మిక దాడి, తీవ్రమైన అనిశ్చితి, ఒక కొత్త సాధారణ విషయంగా మారాయి. వీటికి తోడు, యుద్ధ భూమి నుంచి ప్రభుత్వేతర శక్తు ల ప్రభావం కూడా పెరుగుతోంది. కీలకమైన వాణిజ్యమార్గాలు, ముఖ్యమైన సముద్రమార్గాలు, బలహీనమైన ప్రదేశాలు ఆయుధాలతో చురుకుగా, లక్ష్యంగా చేసుకోబడుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) నిర్ణయ మద్దతు, ఎలక్ట్రానిక్ యుద్ధ అవసరాలు, సంపూర్ణ స్పెక్ట్రమ్ నియంత్రణను పునర్ నిర్మిస్తోందని సింగ్ చెప్పారు. 'పాతకాలపు ప్రపంచ వ్యవస్థ వేగంగా కనుమరుగు అవుతుండగా, భవిష్యత్ వ్యవస్థ స్వరూపం ఇంకా ఆవిష్కృతం కాని పరిస్థితిని మనం ఎదుర్కొంటున్నాం' అని మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.అస్థిరమైన భద్రతా పరిస్థితి కారణంగా, దేశాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. సైనిక కార్యకలాపాలలో మార్పులను ప్రస్తావిస్తూ, డ్రోన్లు, మానవరహిత వ్యవస్థలు యుద్ధ వేగాన్ని, స్వభావాన్ని, స్థాయిని మార్చి వేశాయని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. సొంతంగా ఆయుధాలు, కీలక సాంకేతికమైన పరిజ్ఞానాన్ని ఉత్పత్తి చేసుకునే సామర్థ్యం లేకుండా ఏ దేశం సుదీర్ఘమైన యుద్ధాన్ని ప్రదర్శించలేదని గ్రహించి, భారతదేశం ఏడాది క్రితమే రక్షణ రంగంలో స్వావలంభన అవసరాన్ని గుర్తించిందని సింగ్ విపులీకరించిందని అన్నారు. భారతదేశం పెరుగుతున్న స్వదేశీ రక్షణ సామర్థ్యాలకు ఉదాహరణలుగా తేజస్ యుద్ధ విమానం, ధ్రువ్, రుద్ర, ప్రచండ హెలికాప్టర్లు, లైట్ యుటిలిటీ హెలికాప్టర్, ఆకాశ్ వాయు రక్షణ వ్యవస్థను రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. స్థిరమైన, శాంతియుతమైన అంతర్జాతీయ వాతావరణం పట్ల తమ నిబద్ధతను పంచుకునే దేశాలతో, ముఖ్యంగా పరిశోధన, ఉమ్మడి అభివృద్ధి, ఉత్పత్తి నిర్వహణ, శిక్షణ, ఆవిష్కరణ రంగాలలో కలిసి పనిచేయడానికి భారతదేశం సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. అంతకుముందు రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఇతర సీనియర్ అధికారులతో కలిసి, భారత వైమానిక దళం (ఐఎఎఫ్)సారంగ్ హెలికాప్టర్ ప్రదర్శన బృందం సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం ప్రదర్శించిన వివిధ విమాన విన్యాసాలతో కూడిన వైమానిక ప్రదర్శనను వీక్షించారు.భాగస్వామ్యంలో శక్తి' అనే ఇతివృత్తంతో సెప్టెంబరు 26నుంచి అక్టోబరు 12వరకు జరుగనున్న 'తరంగ్ శక్తి–2026' విన్యాసాలలో ఆస్ట్రేలియా, యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్, జర్మనీ, శ్రీలంక, బంగ్లాదేశ్ అనే ఏడు దేశాల వైమానిక దళాలు పాల్గొంటున్నాయి.

## అభిజీత్ దీప్కే నానమ్మ మృతి

**న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఇంట్లో విషాదం చోటుచేసుకున్నది. అభిజీత్‌ను అరెస్టు చేసిన కొన్ని గంటల్లోనే .. ఆయన నానమ్మ మృతిచెందారు. 85 ఏళ్లు సావిత్రిభాయ్ దీప్కే శనివారం మరణించినట్లు కొన్ని మీడియా సంస్థల ద్వారా తెలిసింది. గత కొన్ని రోజుల నుంచి సావిత్రిభాయ్ ఆరోగ్యం సరిగా లేదు. శనివారం ఉదయం ఆమె హింగోలి జిల్లాలోని తన స్వగ్రామం సంతుక్ పింప్రిలో ప్రాణాలు విడిచారు. కాగా, అభిజీత్ దీప్కేను శనివారం ఢిల్లీ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. విమానంలో ఉన్న సమయంలోనే అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ వచ్చారు.

## మణిపూర్‌లో హింస: ఐదుగురు మృతి

**ఇంఫాల్ :** గత మూడు సంతవ్సరాలుగా ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్ రాష్ట్రంలో మళ్లీ హింసాత్మక ఘటనలు చెలరేగాయి. మణిపూర్‌లోని కామ్‌జోంగ్, ఉఖ్రుల్ జిల్లాల్లో సాయుధ వర్గాల మధ్య జరిగిన తాజా ఘర్షణల్లో ఐదుగురు వ్యక్తులు మరణించినట్లు అధికారులు శనివారం తెలిపారు. నాగాల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న కామ్‌జోంగ్ జిల్లాలోని కుకీ ఆధిపత్యం గల చస్సాద్ గ్రామంలో 22 ఏళ్ల యువకుడు, 42 ఏళ్ల మహిళ మరణించారని వారు పేర్కొన్నారు. ఐదుగురు పిల్లల తల్లైన ఆ మహిళ శుక్రవారం రాత్రి మెడ భాగంలో కాల్పులకు గురై, కొద్ది నిమిషాల్లోనే మరణించిందని అధికారులు తెలిపారు. ఆమె హత్యతో కుకీ, నాగా సాయుధ వర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. ఇవి శనివారం ఉదయం వరకు కొనసాగాయి. ఈ ఘర్షణల్లోనే ఆ యువకుడు మరణించాడని, అలాగే 10 ఇళ్లకు నిప్పు పెట్టారని వారు తెలిపారు. మరిన్ని హింసాత్మక ఘటనలను నివారించేందుకు, జిల్లా అధికారులు చస్సాద్ పోలీస్ గేట్ జంక్షన్ చుట్టూ 400 మీటర్ల పరిధిలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 162 కింద నిషేధాజ్ఞలు విధించారు. ఈ ఆంక్షల ప్రకారం ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడటం నిషేధించబడింది. ఉఖ్రుల్ జిల్లాలో జరిగిన మరో ఘటనలో, అనుమానిత మిలిటెంట్లు వాహనంపై కాల్పులు జరపడంతో చెపు యావోలెన్ సమీపంలో సందీప్ రాయ్ (40) అనే వ్యక్తి మరణించాడు.

## ఢిల్లీలో 'అప్రకటిత ఎమర్జెన్సీ'ని తలపిస్తోంది

• హక్కుల కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్

• అరెస్ట్ చేసినవారిని వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలో జరుగనున్న నిరసన ప్రదర్శనలకు ముందు, విస్తృత ఆంక్షల నడుమ అధికారులు పలువురు ప్రతిపక్ష నాయకులు, విద్యార్థి కార్యకర్తలు, న్యాయవాదులు, పాత్రికేయులను నిర్బంధించిన నేపథ్యంలో పర్యావరణ, హక్కుల కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ శనివారం దేశంలోని పరిస్థితిని 'అప్రకటిత అత్యవసర పరిస్థితి' గా అభివర్ణించారు. ప్రదర్శనకు ముందు శాంతి, ఐక్యత కోసం పిలుపునిచ్చిన వాంగ్‌చుక్ అరెస్టులను ఖండించారు. ఒకవేళ , అరెస్ట్‌చేసిన వారిని 24గంటల్లో విడుదల చేయని పక్షంలో, లేహ్ లేదా ఢిల్లీలో నిరాహారదీక్ష లేదా పాదయాత్ర సహా శాంతియుత నిరసన చేపట్టే విషయాన్ని పరిశీలిస్తానని సోనం వాంగ్‌చుక్ ప్రకటించారు. 'కొద్ది సేపటి క్రితం, ఢిల్లీలో ఈ రోజు విద్యార్థి నాయకులు, యువ నాయకులు, న్యాయవాదులు, పాత్రికేయులు, చివరికి ఎంపీలను కూడా అరెస్ట్ చేశారనే విషయాన్ని నేను తెలుసుకున్నాను' అని ఆయన ఎక్స్' లో పోస్ట్ చేసిన ఒక వీడియో సందేశంలో ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. నిన్న, నేటి నిరసన ప్రదర్శనలలో శాంతి, ఐక్యతను పాటించమని నేను మీకు సందేశం ఇచ్చినప్పుడు, ప్రపంచంలోనే ఒక అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో శాంతియుత ప్రదర్శనకు అనుమతి లభిస్తుందని నేను నమ్మాను. కానీ, ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా 'అప్రకటిత, అత్యవసర పరిస్థితి' నెల కొన్నట్లుగా కనిపిస్తోంది' అని సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ('సర్') సమయంలో, ఓటరు జాబితా అవకతవకలకు సూత్రధారి అని, అలాగే,ఓటరు నమోదుకు ఉపయోగించే ఫారం–6కు సంబంధించిన ఇతర అవకతవకలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ప్రదర్శనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భారీ భద్రతా ఏర్పాట్లు, ఆంక్షలు విధించారు. నిరసనలో పాల్గొనేందుకు ప్రయత్నించిన మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయ్ విజయ్, మాణిక్‌చంద్ సర్కార్ సహా పలువురు ప్రతిపక్ష నాయకులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిర్బంధాలను ముగించి, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని వాంగ్‌చుక్ ప్రభుత్వాన్ని కోరారు. తాను ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. అరెస్టులను ఆపాలని తాను ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నానని, ఈ సాయంత్రంలోగా సమస్యలను పరిష్కరించాలి' అని ఆయన ప్రభుత్వానికి సోనమ్ వాంగ్‌చుక్ విజ్ఞప్తి చేశారు.

## ప్రజాస్వామ్యతల్లి నోరు మూస్తున్నారు

• మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆగ్రహం



న్యూఢిల్లీ : ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలకు సిజెపి పిలుపునివ్వడంతో పోలీసులు ప్రతిపక్ష నేతలు, యువజన, విద్యార్థి సంఘాల నేతలను ఎక్కడికక్కడే అడ్డుకును అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లినకార్జున ఖర్గే తీవ్రంగా విరుచుకుపడ్డారు. ప్రభుత్వం ప్రజాస్వామ్య తల్లిని నోరులేని ప్రజాస్వామ్యంగా మార్చిందని మండిపడ్డారు. బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌ల పిరికితనం నేడు బట్టబయలవుతోందని కాంగ్రెస్ అధినేత ఆరోపించారు. 'మన యువత, విద్యార్థులు, న్యాయవాదులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, రైతు సంఘాల నాయకులు, యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లు, ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరినీ నిర్బంధిస్తున్నారు' అని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లు, లాఠీలు, పెల్లెట్లు భారత ప్రజలను నిరుత్సాహపరచలేవని కాంగ్రెస్ అధినేత స్పష్టం చేశారు. మన స్వాతంత్ర్య పోరాట రోజుల నుంచి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువతే ముందు వరుసలో ఉన్నాందన్నారు. కాంగ్రెస్ పార్టీ, ఐక్య ప్రతిపక్షంతో కలిసి ఈ నిరంకుశ పాలనపై సర్వశక్తులు ఒడ్డి పోరాడుతుంది అని ఖర్గే అన్నారు. 'భారతదేశ స్వాతంత్ర్యం కోసం మేము మా రక్తాన్ని చిందించాము. మన ప్రజాస్వామ్యాన్ని, మన రాజ్యాంగాన్ని, ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కులను కాపాడటానికి మా శక్తియుక్తులన్నీ ఉపయోగించి పోరాటం కొనసాగిస్తాము అని ఖర్గే అన్నారు. నిరసనకారులు జంతర్ మంతర్ చేరుకోవడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
సిఇసికి వ్యతిరేకంగా సిజెపి ప్రతిపాదించిన ఆందోళనలో భాగంగా జంతర్ మంతర్ చేరుకోవడానికి ప్రయత్నిస్తున్న వెయ్యి మందికి పైగా నిరసనకారులను శనివారం ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసన ప్రదేశానికి చేరుకోవడానికి ప్రయత్నిస్తున్న ప్రజల కదలికలను పర్యవేక్షించడానికి పోలీసులు డ్రోన్‌లను ఉపయోగిస్తూ న్యూఢిల్లీ ప్రాంతమంతటా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారని వర్గాలు తెలిపాయి.

**పాస్‌పోర్ట్ పోయినది**

నేను, **నంద్యాల లక్ష్మీ నాగ ప్రసన్న తండ్రి నంద్యాల సత్య నారాయణ మూర్తి,** ఫ్లాట్ నెం. 750, డోర్ నెం. 503, శ్రీ సూర్య చక్ర రెసిడెన్సీ, గోకుల్ ప్లాట్స్, హఫీజ్‌పేట్ గ్రామం, శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ - 500085. నా ఒరిజినల్ **పాస్‌పోర్ట్** నెం. **AG936287**. నేను మా ఆఫీస్ నుండి గోకుల్ ప్లాట్స్‌లో మా ఇంటికి బైక్‌పై వెళ్తుండగా మార్గం మధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికిచో పై చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
**నంద్యాల లక్ష్మీ నాగ ప్రసన్న తండ్రి నంద్యాల సత్య నారాయణ మూర్తి,**
హఫీజ్‌పేట్ గ్రామం, శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లా.
**సెల్ నెం. 8464042064**

केनरा बैंक కెనరా బ్యాంక్ Syndicate
రికవరీ సెక్షన్ - హనమకొండ
రీజినల్ ఆఫీస్ - హనమకొండ

**బహిరంగ ప్రకటన**

దిగువ తెలిపిన వ్యక్తుల యొక్క చట్టబద్ధ వారసులకు ఇందుమూలంగా తెలియజేయడమేమనగా పలు నోటీసులు ఇచ్చినప్పటికీ రుణ ఖాతాలో రుణ బాధ్యతను చెల్లించుటలో విఫలమైనారు. అందువల్ల **తేది: 24.11.2026**న లేదా ఆలోగా రుణ బాధ్యత మరియు ఇతర ఛార్జీలను చెల్లించి తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విడిపించుకోవలసిందిగా వారిని కోరడమైనది. * లేనిచో, సదరు సెక్యూరిటీలు బ్యాంకు సంపూర్ణ విచక్షణ మేరకు తదుపరి నోటీసు లేకుండా బ్యాంకు వారి విధానాల ప్రకారం రుణగ్రహీత ఖర్చులతో బహిరంగ వేలములో బ్యాంకు విక్రయిస్తుంది.

| క్ర.సం. | రుణగ్రహీత పేరు & ఖాతా నెం. | రుణం తేది | రుణ బకాయి (రూ.) | బ్రాంచ్ పేరు / నెంబర్ |
|---|---|---|---|---|
| 1 | దుబ్బాక అశోక్ కుమార్ ఖాతా : 164073235058 | 28/05/2025 | Rs. 1,09,922/- | సూర్యాపేట శాఖ (00692) సెల్ : 9848092279 |
| 2 | ఓర్సు అనిత ఖాతా : 180439528701 | 15/10/2025 | Rs. 2,88,590.81/- | నల్గొండ శాఖ (00776) సెల్ : 98966 71203 |
| 3 | ఒర్సు శంకర్ ఖాతా : 180439527663 | 15/10/2025 | Rs. 1,85,451.73/- | నల్గొండ శాఖ (00776) సెల్ : 98966 71203 |
| 4 | పగిడిపల్లి సుసేన ఖాతా : 164132245586 | 13/03/2026 | Rs. 30,000/- | జనగామ శాఖ (01328) సెల్ : 9177981807 |
| 5 | చెక్క జయ శంకర్ ఖాతా : 164161341604 | 29/07/2026 | Rs.17,0000/- | పోచంపల్లి శాఖ (01865) సెల్ : 9849813265 |
| 6 | మచ్చ శ్యామల ఖాతా : 180195163471 | 30/06/2023 | Rs. 25,113/- | జిబ్లక్‌పల్లి శాఖ (03880) సెల్ : 9491199940 |
| 7 | మండవ వెంకన్న ఖాతా : 164071207436 | 19/05/2025 | Rs. 24,297.76/- | రెపాల శాఖ (04503) సెల్ : 8779077041 |
| 8 | దామళ్ల లక్ష్మి ఖాతా : 164075543002 | 05/06/2025 | Rs. 54,920/- | రెపాల శాఖ (04503) సెల్ : 8779077041 |
| 9 | మర్రి పద్మావతి ఖాతా : 164074655760 | 02/06/2025 | Rs. 73,820/- | రామన్నపేట శాఖ (06154) సెల్ : 9776133642 |
| 10 | పి.దుర్గాప్రసాద్ రెడ్డి ఖాతా : 164072762060 | 26/05/2025 | Rs. 57,194/- | మూటకొండూరు శాఖ (06770) సెల్ : 9177981807 |
| 11 | మాచర్ల వెంకన్న ఖాతా : 164069309798 | 08/05/2025 | Rs. 43,808.86/- | నాగారం బ్రాంచ్ (13442) సెల్ : 8353984141 |
| 12 | అనపర్తి అవిలయ్య ఖాతా : 164078577878 | 17/06/2025 | Rs. 38,823/- | నాగారం బ్రాంచ్ (13442) సెల్ : 8353984141 |
| 13 | అనపర్తి అవిలయ్య ఖాతా : 180399524380 | 27/03/2025 | Rs. 52,292.05/- | నాగారం బ్రాంచ్ (13442) సెల్ : 8353984141 |

తేది: 09.10.2026, ప్రదేశం: హనమకొండ సం/- అధీకృత అధికారి

## నోబెల్ శాంతి బహుమతి శాశ్వతంగా అప్రదిష్టపాలు

- ఆ వ్యక్తి పేరు కూడా ఎప్పుడూ వినలేదు
- నార్వే కమిటీపై డోనాల్డ్ ట్రంప్ అక్కసు నాకు ఎనిమిదిసార్లు నోబెల్ రావాలి
- ఇరాన్‌ను అడ్డుకున్నా, భారత్–పాక్ యుద్ధం ఆపి ఐదుకోట్ల మంది ప్రాణాలు కాపాడా

**వాషింగ్టన్:** నోబెల్‌శాంతి బహుమతి–2026 తనకు దక్కలేదని నార్వే ప్రభుత్వంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అక్కసు వెళ్ళగక్కారు. శనివారం సిరక్యూస్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ట్రంప్ మాట్లాడుతూ,''నార్వే..మీరు మాకు ఈ బహుమతి ఇవ్వలేదు, ఈ విషయం మేం మరచిపోం'' అన్నారు. భారత మూలాలు (తమిళనాడు)ఉన్న దక్షిణాఫ్రికా న్యాయవాది నవీ పిళ్ళైకు శుక్రవారం నార్వేలోని నోబెల్ శాంతి కమిటీ ఈ బహుమతి ప్రకటించింది.



ఆమెను ప్రస్తావిస్తూ, ''ఆమె పేరు కూడా ఎవ్వరికీ తెలియదు, ఆమె గురించి ఎప్పుడూ వినలేదు, ఐక్యరాజ్యసమితిలో పనిచేసే ఎవ్వరికీ తెలియని ఒక ఉదారవాదికి ఈ బహుమతి ఇచ్చారు, ఐనాగానీ ఆ వ్యక్తికి అభినందనలు''అన్నారు. యథాప్రకారంగానే తాను అనేక యుద్ధాలు పరిష్కరించానంటూ ఆ జాబితా వివరించారు. ఇప్పుడు ఇరాన్, రష్యా చేస్తున్న యుద్ధాలను కూడా పరిష్కరించేదిశగా తాను అడుగులు వేస్తున్నానన్నారు.''ఇరాన్ దగ్గర అణ్వాయుధం లేకుండా అడ్డుకున్నాను,పశ్చిమాసియాతో పాటు దాన్ని దాటుకుని యూరప్‌వరకూ వినాశనం సృష్టించకుండా ఇరాన్‌ను అడ్డుకున్నాను, బహుశా చరిత్రలో నేనే ఎక్కువమందిప్రాణాలు కాపాడాను, వినాశనాన్ని అడ్డుకున్నాను''అన్నారు. ప్రజాస్వామ్య వ్యతిరేకులు,నాగరికత శత్రువులైన కొద్దిమంది తీవ్రవాద భావజాలంగలవారికి ఇవ్వడం వల్ల నోబెల్‌శాంతి బహుమతి శాశ్వతంగా అప్రదిష్ట పాలైందని దూషించారు. నిజానికి తనకు ఎనిమిది సార్లు నోబెల్ శాంతి బహుమతిదక్కాల్సి ఉందన్నారు.భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధం నివారించడం ద్వారా ఐదు కోట్లమంది ప్రజల ప్రాణాలను తాను కాపాడానని,వారంతా అణ్వాయుధాలబారిన పడకుండా రక్షించానని, తాను ఆపిన ఒక్కొక్క యుద్ధానికి ఒక్కొక్కసారి నోబెల్ శాంతి బహుమతి రావాల్సి ఉందన్నారు.''అధ్యక్షుడుగా,మీ ప్రతినిధిగా నిజానికి అమెరికా దేశానికి ఈ ప్రతిష్ఠాత్మకమైన బహుమతి రావాల్సి ఉంది, కానీ రాలేదు, ఇంతటి అవమానకరమైన, సిగ్గు చేటైన నిర్ణయం తీసుకున్న నార్వే దేశానికి,ఆ దేశ ప్రజలకు ఇది మాయని మచ్చ'' అని ట్రంప్ ప్రజాసమక్షంలో విమర్శలు గుప్పించారు. ఈ బహుమతి ప్రకటనకు ఒకరోజు ముందు కూడా,''నాకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వకపోతే వారికే అవమానం'' అన్నారు. నోబెల్ కమిటీ తనకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకపోవచ్చునని కూడా పత్రికాగోష్ఠిలో ఆయన అంగీకరించారు. బరాక్ ఒబామాకు 2009లో శాంతి బహుమతి ఇచ్చారని, ఆ బహుమతి ఎందుకు ఇచ్చారో ఒబామాకే ఇంతవరకూ అర్థంకాలేదని అన్నారు. గత ఏడాది నోబెల్ శాంతి బహుతి పొందిన వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మారియా కోరినా మచాడో తనకంటే డోనాల్డ్ ట్రంప్ పూర్తి అర్హుడని ఆనాడు వ్యాఖ్యానించారు. ఆయనకు నోబెల్ శాంతి బహుమతిఇవ్వాలని పాకిస్థాన్ ప్రభుత్వం కూడా సిఫార్సు చేసింది. ఆ తర్వాత తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంది. బెంజిమన్ నెతన్యాహూ కూడా నోబెల్ కమిటీకి ట్రంప్ పేరు సిఫార్సు చేశారు.

# అమెరికాకు రష్యా డీజిల్ సరఫరా ఒప్పందం

- వచ్చే ఏప్రిల్ వరకూ రష్యాపై ఆంక్షలు రద్దు
- 'మధ్యంతర ఓటమి' భయంతో ట్రంప్ నిర్ణయం
- ఇది పుతిన్‌కు గొప్ప వరం: జెలెన్స్కీ ఖండన



**వాషింగ్టన్:** అమెరికాలో మధ్యంతర ఎన్నికల వేళ రష్యా నుండి డీజిలు దిగుమతి చేసుకునే ఒప్పందా న్ని డోనాల్డ్ ట్రంప్ ఖరారు చేశారు. ఈ ఒప్పందం ఉక్రేన్‌కు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. ఆ దేశ అధ్యక్షుడు జెలెన్స్కీ ఈ ఒప్పందాన్ని తీవ్రంగా ఖండించారు. తమ దేశంపై తీవ్ర యుద్ధ దాడులు చేస్తున్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఈ ఒప్పందం పెద్ద వరంగా మారుతుందని విమర్శించారు.రష్యా డీజిలు సరఫరా చేస్తుంది, అదే సమయంలో ఆ సరఫరా ఫలితాల ద్వారా భయోత్పాతం సృష్టిస్తుంది(ఉక్రేన్‌పై దాడులు) అని ఆందోళన వ్యక్తం చేశారు.ఉక్రేన్ ప్రజల ప్రాణ రక్షణకోసం అమెరికా మద్దతుపై తాము ఆధారపడుతున్నామని, అందు కు అనుగుణంగా రష్యాతో బలమైన సంభాషణలు జరపాలని అమెరికాను కోరారు. అదేసమయంలో బ్రిటన్ ఒక ప్రకటన చేస్తూ,ఉక్రేన్‌పై రష్యా యుద్ధం విషయంలో తమ వైఖరి చాలా స్పష్టంగా ఉందని, శాంతి సాధనకు అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి ఉక్రేన్‌కు తమ మద్దతు కొనసాగిస్తామని, న్యాయమైన, శాశ్వమైన శాంతి సాధనకు అత్యంత కఠినమైన ఆంక్షల ద్వారా రష్యాపై ఆర్థిక ఒత్తిడి చర్యలు కొనసాగుతాయని పేర్కొంది.

రష్యా ఎగుమతులపై తాత్కాలికంగా ఆంక్షలను ట్రంప్ ఎత్తివేశారు. రష్యాతో ట్రంప్ చేసుకున్న ఒప్పందం ప్రకారం 3,00,000 లక్షల డీజిలును అమెరికాకు,ప్రపంచ మార్కెట్‌కు విడుదల చేసేందుకు ఒప్పందం కుదిరింది. నవంబరు నెలలో 5,00,000 లక్షల టన్నులు డీజిలు, ఆ తర్వాత మరో 10,00,000 టన్నుల డీజిలు సరఫరా చేసే ందుకు పుతిన్‌తో అంగీకారం కుదిరిందని ట్రంప్ శుక్రవారం ప్రకటించారు.

అమెరికాలో మధ్యంతర ఎన్నికల సమయంలో జీవన వ్యయాలు,ఆకాశాన్ని అంటిన చమురు ధర లు ట్రంప్ రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థుల విజయావకాశాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ప్రజల్లో ఉన్న తీవ్రమైన అసంతృప్తి ఓటింగ్ రూపంలో తరుముకొస్తున్న తరుణంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉక్రేన్‌లో యుద్ధం నివారించాలంటే రష్యా కు ఆర్థిక వనరుల ఆదాయ మార్గాలను మూసివేయాలని భావించిన ట్రంప్ గతనెలలో కాంగ్రెస్‌లో ఒక చట్టాన్ని ఆమోదింపజేసుకోవడం ద్వారా చై నా, భారత్ సహా రష్యా నుండి చమురు కొనుగోలు చేసే దేశాలపై కూడా భారీగా సుంకాలు విధించేందుకు విశేషాధికారాలు సంపాదించారు.యూరప్ దేశాలు కూడా క్రమంగా రష్యా ఉత్పత్తులను వచ్చే ఏడాది చివరి నాటికి తగ్గించుకునే నిర్ణయం తీసుకున్నాయి. ఈ దశలో ట్రంప్ మాత్రం రష్యా డీజిలు దిగుమతి చేసుకోవాలని ఆకస్మికంగా నిర్ణయించుకున్నారు.ఈ ఒప్పందంలో భాగంగా రష్యా డీజిలు ఎగుమతులపై 2027 ఏప్రిల్ 7వ తేదీ వరకూ ఆంక్షల అమలును రద్దుచేస్తున్నట్లు అమెరికా ఆర్థికమంత్రిత్వశాఖ శనివారం ప్రకటించింది. ఐతే అమెరికన్ బ్యాంకులలో రష్యా ఆస్తులు, ఇతర ఆస్తుల స్తంభన ప్రక్రియ కొనసాగుతుంది.ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, రష్యాలో చమురు శుద్ధి కేంద్రాలపై ఉక్రేన్ దాడులు చేసిందని,అందువల్ల పరిస్థితికి అనుగుణంగా మరో 30 లక్షల టన్నుల డీజిలు సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు.ఐతే క్విల్టర్ చెలియట్‌లోని పెట్టుబడి వ్యూహకర్త టిమ్ ఆర్మిటేజ్ ఒక విశ్లేషణ చేస్తూ, ఈ దిగుమతులు అమెరికా ప్రజల అవసరాలు పూర్తిగా తీర్చలేవని పెదవి విరిచారు.ఒక్క రోజులోనే అమెరికాలో 3.8 మిలియన్ బ్యారెళ్ళ డీజిలు వినియోగం జరుగుతుందని ఆయన చెప్పారు.అందువల్ల ఈ దిగుమతి అంకెలు చాలా చిన్నవిగా ఉన్నాయన్నారు.ట్రంప్ ప్రయత్నం నిస్సహాయంగా ఉందని,ఎన్నికలలోపు అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గుదలకు ఈ సరఫరాలు సరిపోవని అన్నారు.

### రష్యా దాడిలో 11 మంది మృతి

ఉక్రేన్‌పై శనివారం తెల్లారకముందే రష్యా చేసిన దాడిలో 11 మంది మరణించారు.మరో 16 మంది గాయపడ్డారు. జపోరిఝ్యా,మైఖైలో సెమికిన్ ప్రాంతాలలో ఈ దాడులు జరిగాయి. మరణించినవారిలో ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు.రష్యా నుండి అమెరికా డీజిలు దిగుమతి ఒప్పందం చేసుకున్న వెంటనే ఈ దాడి జరిగింది.అంతకు ముందురోజు కూడా రష్యా పలు ప్రాంతాల్లో చేసిన దాడుల్లో 32 మంది మరణించారు.నాలుగున్నర సంవత్సరాలుగా రష్యా–ఉక్రేన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో కీలకమైన సరిహద్దు ప్రాంతాలలో ప్రతిష్ఠంభన నెలకుని ఉన్న సమయంలో డ్రోన్లు,క్షిపణులతో తీవ్ర యుద్ధం కొనసాగుతోంది.గడచిన నాలుగు రోజులుగా జరుగుతున్న యుద్ధంలో మొత్తం 60 మంది ఉక్రేనియన్లు రష్యా బాంబుదాడుల్లో మరణించారు.

(మొదటి పేజీ తరువాయి)

వెళ్ళిన తరువాత రామకృష్ణ పాండతో పాటు, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు ప్రధాన కార్యదర్శి నిశా సిద్ధు, ఎఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి సుఖ్‌జీందర్ మహేసరి, వారందరినీ పోలీసులు అరెస్టు చేశారు. మరికొందరిని మింటో బ్రిడ్జ్ దాటక ముందే పోలీసులు అరెస్టు చేశారు. కొందరని ఛత్రసాల్ స్టేడియంకు తరలించారు.

**వామపక్ష విద్యార్థి సంఘాల నేతల అరెస్ట్**

జంతర్‌మంతర్‌కు వెళ్ళేందుకు ప్రయత్నించిన ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, ప్రధాన కార్యదర్శి దినేశ్ సిరంగరాజన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బిజెపి జాతీయ కార్యాలయం వద్ద దినేశ్ సిరంగరాజ్, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు విక్రమ్ సింగ్‌లతో పాటు పలు ప్రజాసంఘాల కార్యకర్తలను పోలీసులు అదుపులో తీసుకొని , వారిని తరలిస్తున్న బస్సును బిజెపి కార్యాలయం వద్ద సామాన్య ప్రజలు అడ్డుకున్నారు. బస్సుకు అడ్డం పడుకొని వారిని విడిపించడడం విశేషం. సెంట్రల్ ఢిల్లీలో ఎస్‌ఎఫ్ఐ నాయకురాలు ఐషే ఘోష్‌ను నిర్బంధించారు. ఐఎఫ్‌టియు అధ్యక్షురాలు అపర్ణను కూడా ఆ సంస్థ సభ్యులతో పాటు నిర్బంధించారు.జంతర్‌మంతర్‌కు వెళ్ళకుండా పోలీసులు ఆటంకాలు సృష్టిస్తుండడంతో ఒకదశలో ఢిల్లీ హాట్‌లో కొనసాగుతుందని ఐసా నాయకురాలు నేహా బోరా ప్రకటించారు. అయితే, ఢిల్లీ పోలీసులు వెంటనే ఢిల్లీ హాట్‌కు దారితీసే రహదారిని మూసివేసి, ఆమెతో పాటు ఇతర కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఒక నిరసనకారుడి తలకు గాయాలై, తీవ్రంగా రక్తస్రావం అవుతుండగా, వైద్య సహాయం కోసం నిరసనకారులు పోలీసులను అభ్యర్థించడం కనిపించింది.

# బెదరని యువత..

**నలుగురు మాజీ సిఎంలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సిపిఐ(ఎం) రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్‌లను కూడా అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జంతర్‌మంతర్‌కు వెళ్తుండగా, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు టిఎంసి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని జంతర్‌మంతర్ వద్దకు వెళ్లనివ్వకపోవడంతో వారు సౌత్ అవెన్యూ బస్ స్టాండ్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ జంతర్‌మంతర్ వైపు వెళ్తుండగా లోధి ఎస్టేట్‌లోని ఆయన ఇంట్లో అదుపులోకి తీసుకున్నారు. సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, సీనియర్ సీపీఐ(ఎం) నాయకురాలు బృందా కారాత్‌లను కూడా అదుపులోకి తీసుకున్నారు.ఆప్ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ ఓట్ల దొంగతనం ద్వారా మాత్రమే ఎన్నికల్లో గెలిచారని ఆయనకు స్పష్టంగా తెలుసు, ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అణచివేసి తన మోసాన్ని కాపాడుకోవడానికి కంకణం కట్టుకున్నారు అని అన్నారు. ఆ తర్వాత, కేజ్రీవాల్ జంతర్మంతర్ వైపు వెళ్తుండగా లోధి ఎస్టేట్లోని తన ఇంట్లో కూడా ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

**సుప్రీం కోర్టు న్యాయవాదులను నిర్బంధం**

సుప్రీంకోర్టు న్యాయవాదులు కూడా సిఇసి వ్యతిరేక నిరసనల్లో పాల్గొన్నారు. పోలీసులు వారిని కూడా నిర్బంధించారు. న్యాయవాదుల నిర్బంధాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఖండించింది. ఈ విషయంలో ప్రధాన న్యాయమూర్తి జోక్యం చేసుకోవాలని కోరింది. సుప్రీంకోర్టు ప్రాంగణంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సీనియర్,యువ న్యాయవాదులు, ముఖ్యంగా మహిళా న్యాయవాదులపై మితిమీరిన బలప్రయోగం చేయడం, వారిని నిర్బంధించడంపై అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

**ఇతర నగరాల్లో సైతం....**

ఢిల్లీలో నిరసనకారుల నిర్బంధాన్ని నిరసిస్తూ దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు జరిగాయి. మహాత్మాగాంధీ మునిమనమడు తుషార్ గాంధీ, ఫిరోజ్ మోతీబేరేవాలాలను ముంబైలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసనకారులు ఆగస్ట్ క్రాంతి మైదాన్‌లో ప్రదర్శనలు నిర్వహించారు. చండీగఢ్‌లో సిఇఒ భవనం ఎదుట ఆప్ నాయకులు నిరసన తెలిపారు. అక్కడ మనీష్ సిసోడియా అదుపులోకి తీసుకున్నారు. శ్రీనగర్లోని పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు గుమిగూడగా, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు నిరసనలు వ్యాపించాయి. ఆప్ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ ఓట్ల దొంగతనం ద్వారా మాత్రమే ఎన్నికల్లో గెలిచారని ఆయనకు స్పష్టంగా తెలుసు, ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అణచివేసి తన మోసాన్ని కాపాడుకోవడానికి కంకణం కట్టుకున్నారు అని అన్నారు. ఆ తర్వాత, బెదరని యువత

ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ శనివారం నాడు సిజెపి, వామపక్ష విద్యార్థి సంఘాలు ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ, ఎఐఎస్ఎ, ఎఎస్‌ఎపిలు పిలుపును ఎట్టి పరిస్థితుల్లో భగ్నం చేయాలని కేంద్ర ప్రభుత్వం పంతానికి పోయింది. చీమ కూడా దూరకుండా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఢిల్లీని పోలీసులు, కేంద్ర రక్షక బలగాలు, సరిహద్దుల్లో పహారా కాసే బిఎస్‌ఎఫ్ జవాన్‌లతో నింపేసింది. రాజధాని సరిహద్దులన్నీ కట్టడి చేసింది. సెంట్రల్ ఢిల్లీలో నిరసనకారులు ప్రవేశించకుండా బ్యారికేడ్‌లతో నింపేశారు. అధికారికంగా 35 వేల మంది పోలీసులను మోహరించామని చెబుతున్నప్పటికీ, అంతకంటే రెండింతలు ఎక్కువే ఉంటారని అంచనా. జంతర్‌మంతర్‌కు సమీపంలో కాదు కదా, రెండు మూడు కిలోమీటర్ల ఆవల ఉన్న కన్నాట్ ప్లేస్ వద్దే బ్యారికేడ్‌లను పెట్టి అందరినీ ఆపేశారు. ఇవేవి యువత సాహసం, మనోబలం ముందు నిలవలేదు. పోలీసులు, కేంద్ర రక్షణ బలగాలు, సరిహద్దు బలగాలు, బారికేడ్‌ల వలయాలను చేధించుకొని గుంపులు గుంపులుగా వందలాది మంది విద్యార్థులు విడతల వారీగా జంతర్‌మంతర్‌కు చేరుకున్నారు. వచ్చిన వారిని వచ్చినట్లే పోలీసులు అదుపులోకి తీసుకొని వాహనాలలో తరలించారు. ఢిల్లీకి రాకుండా నిరసనకారులు నిరోధించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఈ ఉద్యమం జాతీయ రాజధాని ప్రాంతమైన ఢిల్లీలోని ఇతర ప్రాంతాలకు, ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకు కూడా వ్యాపించింది. ఢిల్లీకి వెళ్లే రైళ్లను రద్దు చేశారు. ప్రజా రవాణాను కూడా నామమాత్రపు సేవలతోనే నడిపారు.ఫలితంగా, జంతర్‌మంతర్ నుండి ప్రారంభమైన కేంద్రీకృత ఉద్యమానికి సంబంధం లేకుండా, ఎక్కడికక్కడ వికేంద్రీకృత నిరసనలు జరిగాయి.

జర్నలిస్టలను అదుపులోకి తీసుకొని బస్సులోకి తరలిస్తున్న దృశ్యం



**జర్నలిస్టులనూ విడిచిపెట్టలేదు..**

ఇదిలా ఉండగా, పలువురు జర్నలిస్టులు తమను కూడా అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. మీడియా గుర్తింపు కార్డులు చూపించినప్పటికీ తమను నిర్బంధించారని, ఇతర నిరసనకారులతో పాటు తమను నిర్బంధ బస్సుల్లోకి తీసుకువెళ్లే ముందు పోలీసు సిబ్బంది తమ అధికారిక ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని విలేకరులు మండిపడ్డారు. బస్సుల లోపల నుంచే జర్నలిస్టులు తమ ప్రెస్ గుర్తింపు కార్డులు చూపిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

## సంక్షోభం(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

**రానున్న 8 నెలలు కీలకం**

రానున్న 8 నెలలు ఎల్నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ఎనిమిది నెలలు ప్రతీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. ఎల్నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకుపకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని, కానీ .. మార్కెట్ లో విద్యుత్ అందుబాటులో లేదన్నారు.అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్నినో ప్రభావంపై సినిమా, మీడియా, కళాజాతలతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని చెప్పారు. రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనావేసి పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్ లో నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

**త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశం**

రాష్ట్రంలో ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్న నేపథ్యంలో కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని, 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరిందని గుర్తు చేశారు. వి బి జి రాంజీ పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సీఎం సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే అఖిలపక్షం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దసరా తరువాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా , రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎప్పటికపుడు పరిస్థితులను సమీక్షించేందుకు వార్ రూమ్ ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాను ఎప్పటికప్పుడు సిఎంఓ ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో న ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎంపి వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ. ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పూలు పేర్చి...(మొదటి పేజీ తరువాయి)

అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. సంబురాల్లో భాగంగా తొలిరోజు హైదరాబాలోని రవీంద్రభారతిలో శనివారం అట్టహాసంగా, వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు వందలాది మంది మహిళలు తరలివచ్చారు. బతుకమ్మ పాటలతో రవీంద్రభారతి ప్రాంగణం మార్మోగింది. ప్రారంభ వేడుకలకు రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు ఆడబిడ్డలందరికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నెల గద్దర్‌తో పాటు పలువురు కార్పొరేషన్ చైర్ పర్సన్లు, తదితరులు పాల్గొన్నారు. రవీంద్రభారతి, శిల్పారామంతో పాటు వరంగల్, హనుమకొండ, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్ తదితర చోట్ల పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు ఒక్క చోట చేరి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ నిర్వహణ కోసం పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. పండగ జరిగే ప్రాంతాలు, ఘాట్లు, మైదానాలకు వెళ్లే రహదారుల మరమ్మతుతోపాటు విద్యుత్, తాగునీరు అందుబాటులో ఉంచారు. హనుమకొండ, వరంగల్‌లోని ఉర్సు రంగలీలా మైదానం, కాశీబుగ్గ, దుర్గేశ్వర స్వామి దేవాలయం, హన్మకొండ వేయిస్తంభాల దేవాలయం, పద్మాక్షి దేవాలయం, వడ్డేపల్లి చెరువు, వరంగల్ భద్రకాళి దేవాలయంతో పాటు వరంగల్ నగరంలో అన్ని ప్రాంతాల్లోని దేవాలయాల వద్ద మహిళలు ప్రతి సంవత్సరం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు.

## సమగ్ర విచారణ (మొదటి పేజీ తరువాయి)

నుంచి హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు జ్ఞానేశ్ కుమార్ శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మఠ్రి శ్రీమాన్, కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ఓటు ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు అని, దాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘమే ఓటర్ల పేర్ల అక్రమంగా తొలగించడం దారుణమన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్లను జాబితాల నుంచి తొలగించి, బిజెపికి రాజకీయ లబ్ధి చేకూర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని , తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఎన్నికల సంఘం విశ్వసనీయతను దెబ్బతీస్తున్నారని వారు విమర్శించారు. ఓట్ల తొలగింపుపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో విద్యార్థులు, యువత రాజధానికి చేరుకోకుండా పోలీసులు అడ్డంకులు సృష్టించడం, రైళ్లలో ప్రయాణిస్తున్న విద్యార్థులను అరెస్టు చేయడం, మెట్రో సేవలకు అంతరాయం కలిగించడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని విమర్శించారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ధర్మేంద్ర, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సభ్యులు గ్యార నరేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి వంశీ వర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు అనిల్, చైతన్య యాదవ్, హరీష్ , ఎండీ అన్వర్ నాయకులు జోసెఫ్ భాను, అరుణ్, నాయకులు అవినాష్, ఆంజనేయులు, ధ్రువ కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు మహమూద్, సల్మాన్ ,మధు, బాలకృష్ణ, కళ్యాణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పతనం

(మొదటి పేజీ తరువాయి)

జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా వామపక్షాల మద్దతుతో వామపక్ష విద్యార్థి సంఘాలు,కాక్రోచ్ జనతాపార్టీ(సిజెపి)పిలుపు మేరకు చేపట్టిన నిరసనను అణచివేయడానికి మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతులను సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తీవ్రంగా ఖండిస్తోంది.సెంట్రల్ ఢిల్లీలో 45,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని ప్రభుత్వం మోహరించింది.దేశరాజధానికి వచ్చే రైళ్ళను రద్దు చేసింది.ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది.57 మెట్రో రైల్వే స్టేషన్లను మూసివేసింది. ఢిల్లీని ఒక మిలిటరీ కంటోన్మెంట్‌గా మార్చివేసింది.ఢిల్లీ పోలీసుల మద్దతు,అండదండలతో ఆర్‌ఎస్ఎస్ అనుబంధ గూండాలు రెచ్చిపోయి ప్రదర్శకులపై దాడులు చేశారు.ఇది జాతీయ,అంతర్జాతీయస్థాయిలో సిగ్గుచేటైన,తీవ్ర అవమానకరమైన అప్రజాస్వామిక అణచివేత చర్య.ఇన్నాళ్ళూ ప్రజాస్వామ్య పరిపాలన పేరుతో నటిస్తున్న మోదీ ప్రభుత్వం ఆ నటన చాలించింది.తన నిజస్వరూపాన్ని బయట పెట్టింది.ఎన్నికల అవకతవకలకు,ఓటర్ల జాబితాలో అక్రమాలకు,జ్ఞానేశ్ కుమార్ దుశ్చర్యలకు వ్యతిరేకంగా పెల్లుబికిన ప్రజాగ్రహాన్ని తన నిరంకుశ కోరలు బయటకు తీసి అణచివేస్తోంది.

బిజెపి ప్రభుత్వం ప్రజాదరణ కోల్పోయింది,ప్రజా విశ్వాసం కోల్పోయింది,అక్రమ పద్ధతుల ద్వారా మాత్రమే ఎన్నికల్లో విజయాలు సాధిస్తోందని ఇప్పుడు చాలా బాగా అందరికీ అర్థమైపోయింది. శాంతియుతంగా నిరసన తెలియజేయాలనే ప్రజలకున్న ప్రజాస్వామ్య హక్కును ఉపయోగించుకోవాలనుకున్న ప్రజలకు వ్యతిరేకంగా హింస,బెదిరింపులు,రెచ్చగొట్టేచర్యలను సిపిఐ తీవ్రంగా ఖండిస్తోంది.మోదీ ప్రభుత్వం,బిజెపి పాలిత రాష్ట్రాలలో ప్రభుత్వాలు అనేక రోజులుగాముందస్తు నియంత్రణ, నిర్బంధ, అణచివేత చర్యలు తీసుకున్నప్పటికీ ఢిల్లీలో వేలాదిమంది విద్యార్థులు, యువకులు గుమిగూడి ప్రభుత్వ అక్రమ చర్యలను నిలదీస్తున్నారు.ప్రభుత్వ అణచివేత చర్యలకు వారు ఎంత మాత్రం భయపడటంలేదు. జంతర్ మంతర్‌కు దారితీసే రహదారులలో ఉన్న వేలాదిమంది నిరసన ప్రదర్శకులను అక్రమంగా తీసుకుపోయారు,అరెస్టులు చేశారు, వారిని కొట్టారు. ఢిల్లీ పోలీసులు అనేకమంది జర్నలిస్టులను కూడా నిర్బంధంలోకి తీసుకున్నారు. ప్రజా నిరసన కార్యక్రమాలను ప్రచారం చేయనివ్వకుండా వారి విధులను అడ్డుకున్నారు.ఇది పత్రికాస్వేచ్ఛపై ఘోరమైన దాడి. సమాచారాన్ని తెలుసుకోవాలనే ప్రజల హక్కులపై దాడి.సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ పాండా, కె.ప్రకాశ్‌బాబు, ఎఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి సుఖ్‌జిందర్ మహేసరి, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు ప్రధాన కార్యదర్శి నిషాసింధు, ఎఐఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగరాజ్, ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్షులు విరాజ్ దేవంగ్‌లతోపాటు వందలమంది సిపిఐ, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ కార్యకర్తలను పోలీసులు నిర్బంధించారు.ఈ సిగ్గుచేటైన చర్యలన్నీ ప్రజాస్వామ్యబద్ధమైన అసమ్మతి పట్ల ప్రభుత్వానికి ఉన్న భయాన్ని బయటపెట్టాయి. చేసిన తప్పులకు ప్రభుత్వం జవాబుదారీ వహించాలని డిమాండ్ చేసేవారందరి నోళ్ళూ మూయించాలనే వైఖరి బయటపెట్టాయి.

అప్రజాస్వామికంగా అణచివేతకు గురిచేసినప్పటికీ,ప్రజాస్వామ్యాన్నిరక్షించుకోవాలని పోరాటం చేసే నిరసన ప్రదర్శకుల నైతికస్థైర్యాన్ని,మనోబలాన్ని మోదీ ప్రభుత్వం దెబ్బతీయలేకపోయింది. ప్రజాస్వామ్యంకోసం గొంతెత్తి నినదిస్తున్న, ముఖ్యంగా విద్యార్థులు, యువకులు తీవ్ర అణచివేతను కూడా ఎదుర్కొన్ని ధైర్యంగా నిలబడినందుకు భారత కమ్యూనిస్టుపార్టీ అభినందనలు తెలియజేస్తోంది'' అని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం తన ప్రకటనలో పేర్కొంది.

## పోరాటం ఆగదు

(మొదటి పేజీ తరువాయి)

గమనార్హం. నిరసనల్లో పాల్గొంటున్న యువతకు మద్దతు ప్రకటించిన ఆయన, ఆందోళనలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంపై దాడి చేసిన వారిని ఓడించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ప్రధాని మోదీ, ఆరెస్సెస్‌తో తనకు సుదీర్ఘకాలంగా రాజకీయ పోరాటం కొనసాగుతోందని రాహుల్ గాంధీ చెప్పారు. ప్రత్యర్థుల ఆలోచనా విధానాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నానని పేర్కొన్నారు. మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌ల పేర్లను ప్రస్తావించారు. వీరికి రాజకీయంగా పరిస్థితులు కష్టంగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం నిరసనలను అడ్డుకునేందుకు పోలీసులను రంగంలోకి దించినా తమ పోరాటం ఆగదని రాహుల్ అన్నారు. ''మోదీ జీ మీకు నచ్చినట్లు చేసుకోండి. 10 వేల మంది, 20 వేల మంది, 50 వేల మంది పోలీసులను రంగంలోకి దించండి. నాయకులను అరెస్టు చేయండి. యువతను అరెస్టు చేయండి. మమ్మల్ని అందరినీ అరెస్టు చేయండి. అయినా మేం వెనక్కి తగ్గబోం' అని స్పష్టం చేశారు. తమ వద్ద ఇప్పటికే అవసరమైన సమాచారం ఉందని రాహుల్ పేర్కొన్నారు. దేశ రాజ్యాంగాన్ని కాపాడటంతోపాటు ప్రజల గొంతుకను రక్షించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. గత పదేళ్ల నుంచి 15 ఏళ్ల కాలంలో దేశానికి జరిగిన నష్టం మళ్లీ జరగకుండా చూస్తామని అన్నారు. రాజ్యాంగంపై దాడి చేసిన వారిని, ప్రస్తుత ప్రభుత్వాన్ని ఓడించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. నిరసనల్లో పాల్గొంటున్న యువతను రాహుల్ గాంధీ అభినందించారు. యువత పోరాటం కొనసాగించాలని కోరారు. 'దేశ యువతను చూసి గర్విస్తున్నాను. మీరు నిరసనలు కొనసాగించండి. మేం మీకు అండగా ఉంటాం. రాజ్యాంగంపై దాడి చేసిన వారిని ఓడించేలా కృషి చేస్తాం' అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం చెన్నైలో ఉన్న రాహుల్ గాంధీ, ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**జ్ఞానేశ్, మోదీ సర్కార్ దిగిపోతది**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి దిగిపోతారని, అలాగే మోదీ ప్రభుత్వం కూడా దిగిపోతుందని, అప్పుడే ప్రజాస్వామ్య పునరుద్ధరణ మొదలవుతుందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఇండియా కూటమి ఎంపిలను ఉద్దేశించి తాను చేసిన ప్రసంగం వీడియో క్లిప్‌ను కూడా ఎక్స్‌లో ట్యాగ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ కుమార్ కంటే చాలా లోతైన సమస్య ఉందని, దానిని పరిష్కరించడానికి ప్రస్తుత ప్రభుత్వాన్ని రద్దు చేయాల్సిన అవసరం ఉందని రాహుల్ శుక్రవారం అన్నారు. ప్రతిపక్షాలు ఇదే విధంగా ఒత్తిడి కొనసాగిస్తే ప్రభుత్వం కూలిపోతుందని ఆయన స్పష్టం చేశారు. 'ప్రతిపక్షాల నిరసనలు ఈ ప్రభుత్వ పునాదులను కదిలించాయి, ఇప్పుడు ఆ ప్రభుత్వం భయపడిపోయింది' అని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఇండియా కూటమి ఎంపిలతో అన్నారు. జ్ఞానేశ్ కుమార్ కంటే చాలా లోతైన సమస్య ఉందని, దానిని పరిష్కరించడానికి ఈ ప్రస్తుత ప్రభుత్వాన్ని రద్దు చేయాల్సిన అవసరం ఉందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. దీని కోసం పోరాడటం, ప్రాణాలు అర్పించడం కూడా సబబే అని ఆయన పేర్కొన్నారు. గత మూడు, నాలుగు రోజులు మాదిరిగానే మనం ఇదే విధంగా ఒత్తిడి కొనసాగిస్తే, ఈ ప్రభుత్వం కూలిపోతుందని హామీ ఇస్తున్నా న్నారు.

## ప్రమాదంలో బౌలర్ల కెరీర్ : గౌతం గంభీర్



**రాంచీ:** బౌలర్ల కెరీర్ ప్రమాదంలో పడినట్లు భారత కోచ్ గౌతం గంభీర్అన్నారు. రాంచీలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. విండీస్ 250 రన్స్ చేసిన నేపథ్యంలో ఆయన స్పందిస్తూ.. ఫ్లాట్ పిచ్‌లపై బౌలర్ల పరిస్థితి దారుణంగా మారుతున్నట్లు చెప్పారు. ఏమాత్రం సహకరించని పిచ్‌లపై బౌలర్ల కెరీర్ ప్రమాదంలో పడినట్లే అవుతుందన్నారు. రాంచీ మ్యాచ్‌లో ఇరు జట్లు కలిపి 501 రన్స్ చేశాయి. 38.3 ఓవర్లలో 33 సిక్సులు బాదారు. ఇటీవల గౌహతిలో జరిగిన రెండో వన్డేలోనూ ఇండియా 406 రన్స్ ఛేజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే బౌలర్లు ఎవరైనా వాళ్లు మనవాళ్లే అని, వారి కెరీర్‌లో ప్రమాదంలో పడ్డాయని, డ్రెస్సింగ్ రూమ్‌కు చేరుకునేందుకు వాళ్లు చాలా కష్టపడ్డారని, కానీ జీవం లేని పిచ్‌లో బౌలర్ల పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. ఓ దశలో 5 రన్స్‌కే 2 వికెట్లు కోల్పోయిన విండీస్.. హోప్ సెంచరీతో ఈజీగా 250 రన్స్ ఛేజ్ చేసింది. ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్‌పై ప్రశంసలు కురిపించాడు. మయాంక్ తన స్పీడ్‌తో బౌలింగ్ చేయడం సంతోషంగా ఉందన్నాడు. ఫాస్ట్ బౌలర్ ఎప్పుడూ ఫాస్ట్‌గానే బౌలింగ్ చేయాలని, 150 వేగంతో బౌలింగ్ వేస్తే ఫలితం మరోలా ఉంటుందని తెలిపారు. వెస్టిండీస్ ప్రమాదకరమైన జట్టు అని, 250ని డిఫెండ్ చేసుకోలేకపోవడం శోచనీయమని, విండీస్ బ్యాటర్లు అద్భుతంగా ఆడారని గంభీర్ తెలిపారు. విండీస్ బౌలర్ రోస్టన్ చేజ్ కీలక దశలో మంచి బౌలింగ్ చేసినట్లు మెచ్చుకున్నారు.

## వయసు పైబడినా చేవ తగ్గలే..

### 37 బంతుల్లోనే డివిలియర్స్ శతకమోత..!




ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో ఎబి డివిలియర్స్ ఓ సంచలనం. అప్పట్లో మేటి బౌలర్లను ఉతికేస్తూ విధ్వంసక ఆటతో అలరించిన అతడు మళ్లీ సుడిగాలి ఇన్నింగ్స్‌తో విరుచుకుపడ్డాడు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లో తన తుఫాన్ బ్యాటింగ్‌తో బౌలర్ల భరతం పట్టాడీ వెటరన్. ఆటకు వీడ్కోలు పలికి ఐదేళ్లు గడుస్తున్నా.. వయసు పైబడినా సరే తనలో చేవ ఏమాత్రం తగ్గలేదని నిరూపిస్తూ 37 బంతుల్లోనే మెరుపు శతకం బాదేశాడీ మాజీ మిస్టర్ 360. దాంతో.. ఈ దక్షిణాఫ్రికా లెజెండ్‌ను ఐపిఎల్ వేలంలో పేరు నమోదు చేసుకోవాలని అభిమానులు కోరుతున్నారు. దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు ఎబి డివిలియర్స్ మరోసారి విధ్వంసం సృష్టించాడు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లో రెచ్చిపోయిన అతడు ఆస్ట్రేలియా ఛాంపియన్స్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. మైదానం నలువైపులా షాట్లతో మిస్టర్ 360 అని నిరూపించుకున్న అతడు.. కేవలం 37 బంతుల్లోనే శతకం సాధించాడు.తన పిల్లలు కళ్లారా తన ఆట చూడాలని కోరడంతోనే ఈ టోర్నమెంట్ ఆడుతున్నానని తెలిపిన ఈ దిగ్గజం క్రీజులో ఉన్నంతసేపు మెరుపు బ్యాటింగ్ చేశాడు. ఆసీస్ నిర్దేశించిన 210 పరుగుల లక్ష్యాన్ని అతడు మంచు ముక్కలా కరిగించాడు. 40 బంతుల్లో ఆరు ఫోర్లు, పదకొండు సిక్సర్లతో అతడు 111 రన్స్ చేయడంతో 15.4 ఓవర్‌లోనే విజేతగా నిలిచింది సఫారీ జట్టు

## వెస్టిండీస్‌తో మూడో టీ20 ఆడే భారత తుది జట్టు ఇదే!

### వైభవ్‌తో పాటు ఆ ముగ్గురికి నిరాశే..




వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో ఒకటి గెలిచి.. మరొకటి ఓడిన టీమిండియా.. మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఇండోర్ వేదికగా ఆదివారం జరిగే మూడో టీ20లో పర్యాటక వెస్టిండీస్‌తో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టీ20లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన టీమిండియా.. రెండో టీ20లో వెస్టిండీస్ అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో ఖంగుతిన్నది. ఎలాగైనా మూడో టీ20 గెలిచి సిరీస్‌లో ఆధిక్యం సాధించాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. మరోవైపు అద్భుత ప్రదర్శనతో రెండో టీ20లో విజయం సాధించిన వెస్టిండీస్.. అదే జోరు కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. దాంతో ఈ మూడో టీ20పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మూడో టీ20లో టీమిండియా కాంబినేషన్‌లో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం కనిపించడం లేదు. తొలి రెండు టీ20ల్లో కొనసాగించిన కాంబినేషన్‌తో టీమిండియా బరిలోకి దిగే అవకాశం ఉంది. వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో విఫలమైన సంజూ శాంసన్ విధ్వంసకర హాఫ్ సెంచరీతో ఫామ్‌లోకి వచ్చాడు. కాబట్టి వైభవ్ సూర్యవంశీకి మరోసారి నిరాశే ఎదురవ్వనుంది. సిరీస్ గెలిచే వరకు అతను బెంచ్‌కే పరిమితం కానున్నాడు. మిగతా కాంబినేషన్‌లో కూడా పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్‌నే పేసర్లుగా కొనసాగించనుడగా.. నమన్ ధీర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు. అయితే తొలి రెండు టీ20ల్లో నిరాశపర్చిన శివమ్ దూబె స్థానంలో నితీష్ కుమార్ రెడ్డిని తీసుకోవచ్చు. బ్యాట్‌తో పాటు బంతితో తేలిపోతున్న శివమ్ దూబేను పక్కన పెట్టాలనుకుంటే నితీష్ రెడ్డికి అవకాశం దక్కుతుంది. లేదంటే నితీష్‌తో పాటు రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్‌లకు మరోసారి నిరాశే ఎదురుకానుంది. తొలి టీ20లో మయాంక్ యాదవ్ నిరాశపర్చినా.. రెండో టీ20లో ఆకట్టుకున్నాడు. మూడు వికెట్లతో అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. కానీ మిగతా బౌలర్లు ఆశించిన రీతిలో రాణించలేకపోయారు. విపరీతమైన డ్యూ కారణంగా చేతులెత్తేసారు. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ ఓపెనింగ్ చేయనుండగా.. ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, శివమ్ దూబే, తిలక్ వర్మ, నమన్ ధీర్, అక్షర్ పటేల్ మిడిలార్డర్‌లో ఆడనున్నారు.

### వెస్టిండీస్‌తో రెండో టీ20కి భారత తుది జట్టు(అంచనా)

సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్

### వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు

వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నమన్ ధీర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్, నితీష్ కుమార్ రెడ్డి.




### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 71,909.70 పాయింట్లు. ముగింపు 72,472.33 పాయింట్లు. లాభం 562.63 పాయింట్లు.

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 22,421.95 పాయింట్లు. ముగింపు 22,520.45 పాయింట్లు. లాభం 98.50 పాయింట్లు.

(భారత స్టాక్ మారెట్లు ఎట్టకేలకు నష్టాల బాట నుంచి బయటపడ్డాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల వంటి అంశాలు ఈ వారం మధ్యలో తీవ్ర ప్రతికూలతను సృష్టించినప్పటికీ, ఆ తర్వాత మార్కెట్లు కోలుకోవడంతో మదుపరులు ఊపిరి పీల్చుకున్నారు).

## స్టాక్ మార్కెట్‌కు దూరంగా చమురు మార్కెటింగ్ సంస్థలు

డాలర్‌తో పోలిస్తే రూపాయిపై ఒత్తిడి కొనసాగుతున్న నేపథ్యంలో, దేశీయ కరెన్సీ విలువను బలోపేతం చేసేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) ప్రకటించిన చర్యల్లో చమురు మార్కెటింగ్ సంస్థలు (ఒఎంసి)కు చెందిన డాలర్ డిమాండ్‌ను స్టాక్ మార్కెట్ నుంచి తప్పించడం ఒకటి. విదేశీ మారకపు డెరివేటివ్స్ లావాదేవీలపై నిబంధనలను కఠినతరం చేస్తూ, రూపాయిపై ఊహాజనిత పందాలను నియంత్రించేందుకు ఆర్‌బిఐ చర్యలు చేపట్టింది. రెండు మిలియన్ డాలర్లకు మించిన డాలర్ కొనుగోళ్లకు 20 శాతం మొత్తాన్ని రిజర్వ్‌గా ఉంచాలని బ్యాంకులను ఆదేశించింది. రెండు రోజుల క్రితం డాలర్ మారకపు విలువ 17 పైసలు పతనం కావడంతో




ఆర్‌బిఐ ఈ చర్యలు తీసుకుంది. ఈనెల రెండో తేదీ నాటికి దేశ విదేశీ మారక నిల్వలు 734 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇటీవలి వారాల్లో ఇవి 50 బిలియన్ డాలర్లకు పైగా తగ్గాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్‌బిఐ తీసుకున్న నిర్ణయాన్ని అనుసరించి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ సంస్థలకు అక్టోబర్ 12 నుంచి ప్రత్యేక సదుపాయం అందుబాటులోకి వస్తుంది. ఈ సంస్థలకు ముడి చమురు దిగుమతుల కోసం భారీగా డాలర్లు అవసరమవుతాయి. ఈ సదుపాయం ద్వారా ఆర్‌బిఐ నియమించిన బ్యాంకుల ద్వారా వాటికి డాలర్లు విక్రయించనుంది. రద్దు చేసిన రూపాయి సంబంధిత విదేశీ మారకపు డెరివేటివ్ ఒప్పందాలను తిరిగి బుక్ చేసుకోవడానికి అనుమతించరాదని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. అంతర్లీన లావాదేవీని నిరూపించాల్సిన అవసరం లేకుండా తీసుకోగల పొజిషన్ల పరిమితిని 100 మిలియన్ డాలర్ల నుంచి 5 మిలియన్ డాలర్లకు తగ్గించింది. అలాగే, రెండు మిలియన్ డాలర్లకు మించిన నిర్దిష్ట డెరివేటివ్ ఒప్పందాలపై, రూపాయి విలువలో లెక్కించిన ఒప్పంద మొత్తంలో 20 శాతాన్ని విదేశీ మారకపు రిస్క్ రిజర్వ్‌గా నగదు రూపంలో ఆర్‌బిఐ వద్ద రోజువారీగా జమ చేయాలని ఆదేశించింది. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, అంతర్జాతీయ మార్కెట్లలో వడ్డీ రేట్ల పెరుగుదల, ఇతర కేంద్ర బ్యాంకుల కఠిన విధానాలు రూపాయిపై ఒత్తిడికి కారణమవుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## స్థానిక వ్యాపారులకు అండగా నిలుద్దాం!

పండుగల సీజన్ వచ్చిందంటే చాలు.. మార్కెట్లలో కొత్త కళ కనిపిస్తుంది. సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకు ప్రతి ఒక్కరూ తమ స్తోమతకు అనుగుణంగా కొత్త వస్తువులు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు. కొత్త బట్టలు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారం, అలంకరణ సామగ్రి.. ఇలా అనేక ఉత్పత్తుల కొనుగోళ్లతో వ్యాపార రంగం కళకళలాడుతుంది. అయితే, ఈ పండుగల కొనుగోళ్ల ద్వారా లాభపడుతున్నది ఎవరు? మన పక్కనే ఉన్న చిన్న వ్యాపారినా? లేక భారీ కార్పొరేట్ సంస్థలా? అన్నది మనం ఆలోచించాల్సిన విషయం. ప్రస్తుతం ఆన్‌లైన్ వాణిజ్య సంస్థలు భారీ డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన ఆఫర్లు, క్యాష్‌బ్యాక్‌లు, ప్రత్యేక విక్రయ కార్యక్రమాలతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. ఇంట్లో కూర్చునే వస్తువులను ఆర్డర్ చేసే సౌకర్యం, ధరలను పోల్చుకునే అవకాశం వాటికి అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీటిని కాదనలేం. అయితే, ఈ ఆఫర్ల వెనుక ఉన్న వ్యాపార వ్యూహాలను కూడా అర్థం చేసుకోవాలి. ప్రారంభంలో భారీ తగ్గింపులతో వినియోగదారు లను ఆకర్షించి, మార్కెట్లో తమ ఆధిపత్యాన్ని పెంచుకునే వ్యూహాలు కొన్ని సంస్థలు అనుసరించవచ్చు. అటువంటి పరిస్థితుల్లో చిన్న వ్యాపారులు పోటీలో నిలబడటం కష్టమవుతుంది. మన వీధిలోని బట్టల దుకాణం, కిరాణా షాపు, చెప్పుల దుకాణం, ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయ కేంద్రం.. ఇవన్నీ కేవలం వ్యాపార సంస్థలు మాత్రమే కావు. అనేక కుటుంబాలకు జీవనాధారాలు. స్థానికంగా ఉపాధిని కల్పిస్తూ, అవసరమైనప్పుడు అప్పుగా సరుకులు అందిస్తూ, వినియోగదారులతో వ్యక్తిగత సం



బంధాలను కొనసాగించే వ్యాపారులు మన సమాజంలో అంతర్భాగం. మనం చేసే ప్రతి కొనుగోలు వారి కుటుంబాల ఆదాయానికి, వారి పిల్లల చదువులకు, వారి జీవనోపాధికి తోడ్పడు తుంది. చిన్న వ్యాపారులు క్రమంగా కనుమరుగై, మార్కెట్ కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళితే ఏమవుతుంది? పోటీ తగ్గిన తర్వాత ధరలు, సరఫరా, వినియోగదారుల కు లభించే ఎంపికలపై ఆ సంస్థల ప్రభావం పెరిగే ప్రమాదం ఉంది. అయితే, ఇది తప్పనిసరిగా జరుగుతుందని కాదు. కానీ మార్కెట్లో ఆరోగ్యకరమైన పోటీ కొనసాగాల ంటే చిన్న వ్యాపారులకు కూడా అవకాశాలు ఉం డాలి. అందుకే ఈ పండుగల సీజన్‌లో చేసే మన కొనుగోళ్లలో కనీసం కొంత భాగాన్నయినా స్థానిక దుకాణాల నుంచే చేద్దాం. ధరలు, నాణ్యత, వారంటీ, సేవలను పోల్చి చూసి, సాధ్యమైనప్పుడు స్థానిక వ్యాపారులకు ప్రాధాన్యమిద్దాం. ఆన్‌లైన్‌కొనుగోళ్లను పూర్తిగా తిరస్కరించాల్సిన అవసరం లేదు. కానీ ప్రతి నిర్ణయాన్నీ కేవలం డిస్కౌంట్ ఆధారంగా తీసుకోకూడదు. మన డబ్బు మన సమాజంలోనే చలామణి కావాలి. మన కొనుగోలు ఒక చిన్న వ్యాపారికి అండగా నిలవాలి. ఈ పండుగకు మన ఇంట్లో వెలుగులు నింపడంతోపాటు, మన చుట్టూ ఉన్న చిన్న వ్యాపారుల జీవితాల్లోనూ వెలుగులు నింపుదాం!

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
24 క్యారెట్లు: రూ. 1,51,420
22 క్యారెట్లు: రూ. 1,38,800
18 క్యారెట్లు: రూ. 1,13,570
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).




## పని చేసే వారికే పట్టం

- ప్రలోభాలకు లొంగని ఆర్టిసి కార్మికులు
- విజయం బాధ్యతను మరింత పెంచింది
- ఎంప్లాయీస్ యూనియన్ అభినందన సభలో బాగం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్‌టిసి కార్మికులు పని చేసే వారికే పట్టం కట్టారని తమ పక్షాన కష్ట కాలంలో ఎవరు నిలబడ్డారో ఎవరు హక్కుల కోసం పోరాడారో వారికే గుర్తింపు ఎన్నికల్లో ఓటు వేశారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. అధికార పార్టీకి తొత్తు సంఘాలు ఎన్ని ప్రలోభాలకు గురి చేసిన కార్మికులు లొంగలేదని ఆయన తెలిపారు. శుక్రవారం జరిగిన ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన ఎంప్లాయీస్ యూనియన్ కూటమి అభినందన సభ శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ అనేక దశాబ్దాల ఆర్‌టిసి చరిత్రలో అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో మొదలు ఇప్పటి వరకు అధికార పార్టీ ఏనాడు ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికల్లో జోక్యం చేసుకోలేదన్నారు. ఏకంగా రాష్ట్ర క్యాబినెట్ ఏర్పాటు చేసి కార్మికులను వంచించిన ఒక నాయకున్ని అడ్డుపెట్టుకుని సొంత సంఘాన్ని సైతం పక్కకు నెట్టి కాంగ్రెస్ పార్టీ అడ్డదారిన ఓ తొత్తు సంఘానికి గుర్తింపునిచ్చేందుకు ప్రయత్నించిందన్నారు. మంత్రులు, ఎంఎల్‌ఎలు, పిసిసి అధ్యక్షుడు సైతం ప్రచారంలో పాల్గొన్న కార్మికులు మాత్రం పనిచేసే సంఘానికి గుర్తింపు నిచ్చారన్నారు. 50 శాతానికి పైగా ఓట్లు తెచ్చుకుని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కూటమి విజయ ఢంకా మోగించిందని ఈ విజయం యూనియన్ బాధ్యతను మరింత పెంచిందని హేమంతరావు తెలిపారు. కార్మికులకు అండగా సిపిఐ, ఏఐటియుసి పనిచేస్తాయని ఆయన తెలిపారు. సభ అనంతరం సిపిఐ, ఏఐటియుసి నాయకులు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు బిఎస్ రెడ్డి, పిల్లి రమేష్, సిపిఐ, ఏఐటియుసి, ఎంప్లాయీస్ యూనియన్ కూటమి నాయకులు మహ్మద్ సలాం, శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, అనిత, గాదె లక్ష్మి నారాయణ, ఎల్‌ఆర్‌కెరావు, బుచ్చిబాబు, సీతామహలక్ష్మి పాల్గొన్నారు.

## ఆర్‌టిసిలో ఎఐటియుసి విజయం
## ఎర్రజెండాపై నమ్మకానికి నిదర్శనం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు • సిపిఐ జిల్లా కార్యాలయంలో విజయోత్సవ సంబురాలు




**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఎఐటియుసి అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘంగా చారిత్రాత్మక విజయం సాధించడం పట్ల సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఎఐటియుసి, ఆర్‌టిసి నాయకుల సమక్షంలో ఘనంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్మికులు కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్‌టిసి ఎన్నికల్లో లభించిన ఈ అపార విజయం కేవలం ఒక యూనియన్ విజయం కాదని, ఇది యావత్ ఆర్‌టిసి కార్మికుల విజయం అని, ఎర్రజెండా, ఎఐటియుసి పోరాట పటిమపై కార్మికులకు ఉన్న అచంచలమైన విశ్వాసానికి ఈ తీర్పు ప్రత్యక్ష నిదర్శనం అని తెలిపారు. ఈ విజయం కోసం శ్రమించిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులకు, కార్యకర్తలకు, అలాగే కూటమిగా ఏర్పడి మద్దతు తెలిపిన ఎన్ఎంయు, టిఎంయు తదితర కార్మిక సంఘాల నాయకులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇటీవల ముగిసిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలతో పాటు, ఇప్పుడు రాష్ట్రంలో అతి పెద్ద రవాణా సంస్థ అయిన ఆర్‌టిసి ఎన్నికల్లోనూ ఎఐటియుసి అనుబంధ సంఘాలు విజయం సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఆర్‌టిసి కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్ల సాధనకు, ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తిస్థాయి అమలుకు, కార్మికుల సంక్షేమానికి సిపిఐ నిరంతరం అండగా ఉంటుందని, అసెంబ్లీ లోపల, వెలుపల కార్మికుల గొంతుకగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్,జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, జిల్లా నాయకులు బత్తిని సదానందం, కొట్టేపాక రవి, మాలోతు శంకర్ నాయక్, దర్శుల రామమూర్తి, గుంటి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




## కార్మిక హక్కుల సాధనకు ఐక్య పోరాటమే శరణ్యం : కలవేణ

- ఆర్‌టిసి ఎన్నికల్లో ఇయు-టిఎంయు కూటమి ప్రభంజనం
- ఆరు డిపోల్లోనూ జయకేతనం

**ప్రజాపక్షం / మంచిర్యాల:** ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు, ఉద్యోగ భద్రతకు ఐక్య పోరాటాలే శ్రీరామరక్ష అని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌టిసి యూనియన్ గౌరవ అధ్యక్షుడు కలవేణ శంకర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) – టిఎంయు కూటమి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఘన విజయం సాధించింది. మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ఉట్నూర్, నిర్మల్, భైంసా డిపోల్లో కూటమి జయకేతనం ఎగురవేయడంతో కార్మిక శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. కలవేన శంకర్ నిరంతర క్షేత్రస్థాయి సమన్వయం, చేసిన విశేష కృషి ఫలితంగానే ఆరు డిపోల్లోనూ కూటమికి ఏకపక్ష విజయం సాధ్యమైందని కార్మిక నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ – ఎఐటియుసి కూటమికి జిల్లాలోని ఉద్యోగులంతా ఏకతాటిపై నిలిచి చారిత్రాత్మక తీర్పునిచ్చారని కొనియాడారు. ఈ విజయం తమపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. కార్మికుల వేతన సవరణ, పెండింగ్ సమస్యల పరిష్కారం, విధుల్లో పని ఒత్తిడిని తగ్గించడం, పని ప్రదేశాల్లో మెరుగైన సౌకర్యాల కల్పనే ప్రధాన ఎజెండాగా పనిచేస్తామన్నారు. ఎఐటియుసికి ఉన్న ఉద్యమ నేపథ్యం, రాజీలేని పోరాట పటిమపై కార్మికులు సంపూర్ణ విశ్వాసాన్ని ఉంచారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్మిక సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తామని స్పష్టం చేశారు.

## ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని గెలిపించిన కార్మికులకు ధన్యవాదాలు : పల్లా దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ:** ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ టిఎంయు, ఎన్ఎంయు కూటమిని అత్యధిక ఓట్లతో గెలిపించిన కార్మికులకు ధన్యవాదాలని ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి తెలిపారు. శనివారం నల్లగొండ డిపో వద్ద ఎన్నికల్లో గెలిచిన సందర్భంగా కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నో నిర్బంధాలు, ప్రలోభాలను తట్టుకుని కార్మికులు నిజాయితీగా పనిచేసే సంఘాలకు పట్టం కట్టారన్నారు. అధికార పార్టీ యూనియన్ ఎన్ని విధాలుగా ఓడించాలని ప్రయత్నించినా కార్మికులు నమ్మలేదన్నారు. కార్మికులు ఇచ్చిన తీర్పుతో కూటమిపై బాధ్యత మరింత పెరిగిందని, ఇచ్చిన హామీల అమలుకు అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి అండగా నిలిచి రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో టిఎంయు రాష్ట్ర కార్యదర్శి బి.నరేందర్, ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కెవిఎస్ రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బసాని వెంకటయ్య, రీజనల్ కార్యదర్శి ఎన్‌ఆర్‌సి రాజు, టిజె రావు, ఎఎల్ స్వామి,వీఎస్ రెడ్డి,కె.దయాకర్,బి.శంకరమ్మ,వెంకటేశం, నరసింహ, టిఎస్ రెడ్డి,బి.లింగం, బిఎన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనమే లక్ష్యం




- కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు : కొరిమి రాజ్ కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఈ నెల 9న జరిగిన ఆర్‌టిసి ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) ఎఐటియుసి కూటమి ఘన విజయం సాధించడం అభినందనీయమని ఎఐటియు సి రాష్ట్ర కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడమే లక్ష్యంగా కూటమి ముందుకు సాగుతుందని తెలిపారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు జరిగినా కార్మికులు ఎంప్లాయీస్ యూనియన్ కూటమికి అధిక మెజారిటీతో విజయాన్ని అందించడం హర్షణీయమన్నారు. కార్మికులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 ఆర్‌టిసి డిపోలు ఉండగా, వాటిలో 60 డిపోల్లో ఎంప్లాయీస్ యూనియన్ కూటమి విజయం సాధించిందని రాజ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఎఐటియు సి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖ్యాత రాజు సతీష్, సిపిఐ పట్టణ కార్యదర్శి సొతుకు ప్రవీణ్ కుమార్, ఎంప్లాయీస్ యూనియన్ డిప్యూటీ సెక్రటరీ రాజయ్య, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎల్ల గౌడ్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ మంతెన అనిత, డిపో వైస్ ప్రెసిడెంట్ తోక రాజయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎంప్లాయిస్ యూనియన్ ఐక్య కూటమి గెలుపు కార్మికుల జీవితాలకు మలుపు : పంజాల

**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు సంఘం కోసం జరిగిన ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్, టిఎంయు, ఎన్ఎంయు కూటమి గెలుపు కార్మికుల జీవితాలకే ఒక మలుపు అని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్, టిఎంయు, ఎన్ఎంయు కూటమిల సమిష్టి కృషి, పట్టుదల మూలంగా ఆర్‌టిసి ఎన్నికల్లో అత్యధిక డిపోలలో విజయం సాధించడం, ఇంతటి భారీ మెజారిటీని అందించిన ప్రతి ఒక్క ఆర్‌టిసి కార్మిక సోదర, సోదరీ మణులకు సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి పక్షాన శ్రీనివాస్ కృతజ్ఞతలు, శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌టిసి ఎన్నికల్లో కరీంనగర్ రీజియన్ జోన్ అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఎంప్లాయిస్ యూనియన్, టిఎంయు, ఎన్ఎంయు కూటమిని గెలిచినందున శనివారం కరీంనగర్ టూ డిపో ముందు పంజాల శ్రీనివాస్ ఆర్‌టిసి కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, మచ్చ రమేష్, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి చీర్లవంచ శ్రీనివాస్, చైర్మన్ కె.తిరుపతి, అధ్యక్షులు రంగాచారి, టిఎంయు అధ్యక్షులు కనకయ్య,కార్యదర్శి ఎం . ఆర్.రెడ్డి, చైర్మన్ ఎం.వి.ఆర్. రెడ్డి,నాయకులు బాకం ఆంజనేయులు , తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## ఆర్‌టిసి ఎన్నికల్లో

# ఇయు కూటమి ఘన విజయం

### 4,500 ఓట్లకు పైగా మెజారిటీతో గెలుపు

### కాంగ్రెస్ మద్దతిచ్చిన ఎన్‌డబ్ల్యుయు–ఎస్‌డబ్ల్యుఎఫ్ కూటమికి ఎదురుదెబ్బ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అక్టోబర్ 9న జరిగిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) గుర్తింపు సంఘం ఎన్నికలు ఈనెల 9వ తేదీన జరగగా, ఎఐటియుసి అనుబంధ సంఘం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) కీలక శక్తిగా అవతరించింది. రాష్ట్రస్థాయి గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ నేతలు తెలిపిన వివరాల ప్రకారం అధికార కాంగ్రెస్‌పార్టీ మద్దతు ఇచ్చిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యుయు) కూటమిపై ఇయు 4,580 ఓట్ల ఆధిక్యాన్ని సాధించింది. రీజినల్ గుర్తింపు ఎన్నికల్లో సైతం ఇయు కూటమి స్పష్టమైన ఆధిక్యత సాధించింది. మొత్తం 12 రీజన్లలో 5 ఎంప్లాయీస్ యూనియన్, 1 ఎన్ఎంయు/టిఎంయు కలిపి కూటమికి 6, టిడబ్ల్యుయు కూటమికి 2 (టిడబ్ల్యుయు 1, ఎస్‌డబ్ల్యుయు 1), మరో నాలుగుచోట్ల ఎవరికీ స్పష్టమైన ఆధిక్యత లభించలేదు. అయితే రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించడంతో ఆ నాలుగు చోట్ల కూడా ఇయు కూటమికే దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టిడబ్ల్యుయు , స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్)తో పాటు ఇతర సంఘాలతో కూడిన కూటమికి మద్దతు ఇచ్చిన అధికార కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల ఫలితాలు ఇబ్బంది కలిగించినట్లు భావిస్తు న్నారు. లెక్కింపు జరిగిన ఓట్ల ప్రకారం ఎంప్లా యీస్ యూనియన్ 'క్లాస్ 3' (రాష్ట్ర గుర్తింపు సంఘం)లో 18,250 ఓట్లు సాధించగా, 'క్లాస్ 6'లో 13,677 ఓట్లు పొందింది. అదే సమయంలో, టిడబ్ల్యుయు 'క్లాస్ 3'లో 13,670 ఓట్లు, ఎస్‌డబ్ల్యుఎఫ్ 'క్లాస్ 6'లో 13,907 ఓట్లు సాధించాయి. సంబంధిత విభాగంలో ఇయు కూటమికి చెందిన టిఎంయుకు 2,016 ఓట్లు వచ్చినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఫలితాలు ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి, సికింద్రాబాద్, హైదరాబాద్ వంటి ప్రాంతాలతో పాటు నాన్‌ఆపరేషనల్ యూనిట్లను కూడా కవర్ చేశాయి. గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో కాంగ్రెస్ మద్దతుగల కూటమికి పరిస్థితి చాలా క్లిష్టంగా మారింది. అక్కడ ఉన్న 26 యూనిట్లలో ఆ కూటమి కేవలం మూడింటిని మాత్రమే గెలుచుకోగలిగింది.

# సృజనాత్మకతకు ప్రోత్సాహం.. సంస్కృతికి పట్టం!

### నైతిక విలువలు భావితరాలకు అందించాలి : మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను భావితరాలకు అందించడం అత్యంత ముఖ్యమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సమాజానికి ఉపయోగపడే సృజనాత్మక ఆలోచనలతో ముందుకొచ్చే ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్, ప్రముఖ నేపథ్య గాయకుడు నేమాని పార్థ ఆధ్వర్యంలో రూపొందించిన 'భాగవతామృతం' దృశ్యశ్రవణ పద్యకథా మాలిక తొలి సంచికను శనివారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భాగవతంలోని పద్యాలు, వాటి అంతరార్థాన్ని పిల్లలు, యువతకు సులభంగా అర్థమయ్యేలా సంగీతం, దృశ్యరూపంలో అందించడం అభినందనీయమన్నారు.ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి చేరవేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. విజ్ఞానంతోపాటు నైతిక విలువలను పెంపొందించే ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. భాగవతాన్ని ప్రతి ఇంటికి చేరువ చేసేందుకు కృషి చేసిన కీర్తన అకాడమీ నిర్వాహకులు, గాయకుడు నేమాని పార్థను అభినందించారు. కార్యక్రమంలో గనుల శాఖ ప్రత్యేక అధికారి బీఆర్వీ సుశీల్‌కుమార్, భోగరాజు మూర్తి, నేమాని పార్థ తదితరులు పాల్గొన్నారు.



# విదేశాలకూ తెలంగాణ సన్న బియ్యం!

### ఫిలిప్పీన్స్ నుంచి అంతర్జాతీయ మార్కెట్లకు విస్తరణ

### ప్రపంచ కొనుగోలుదారులకు స్టీఫెన్ రవీంద్ర ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సన్న బియ్యం విదేశీ మార్కెట్లలోనూ సత్తా చాటుతోంది. దేశీయ అవసరాలను తీర్చడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లకు నాణ్యమైన బియ్యాన్ని ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రం ఎదుగుతోందని పౌరసరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం. స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. మనీలాలో జరుగుతున్న అంతర్జాతీయ వరల్డ్ రైస్ కాన్ఫరెన్స్–2026లో తెలంగాణ బియ్యం ఉత్పత్తి సామర్థ్యాన్ని వివరించిన ఆయన ప్రపంచ కొనుగోలుదారులు రాష్ట్రంతో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు.గత సీజన్‌లో తెలంగాణ 1.85 కోట్ల టన్నుల బియ్యం ఉత్పత్తి చేసిందని, ఇది దేశ మొత్తం ఉత్పత్తిలో దాదాపు 12 శాతమని వెల్లడించారు. మిగులు బియ్యం నిర్వహణ నుంచి అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ బియ్యానికి అధిక విలువ సాధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. విదేశీ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన సన్న, సూపర్‌ఫైన్ రకాల బియ్యం ఎగుమతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.2025లో ఫిలిప్పీన్స్‌కు 30 వేల టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేసిన తెలంగాణ, ఇప్పుడు ఆసియా, ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాలతో దీర్ఘకాలిక వాణిజ్య ఒప్పందాలపై దృష్టి సారించిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలు, నాణ్యత, పారదర్శక సరఫరా వ్యవస్థతో తెలంగాణను విశ్వసనీయ బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఆహార భద్రతకు విఘాతం కలగకుండా ఎగుమతులను విస్తరించి, తెలంగాణ బియ్యానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు.





# ఎంఎస్ఎంఇలే దేశ పారిశ్రామిక రంగానికి బలమైన స్తంభాలు

### కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ ఆర్థిక వ్యవస్థకు, ఉపాధి కల్పనకు ఎంఎస్ఎంఈ రంగం బలమైన స్తంభం లాంటిదని, 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనలో ఇది కీలక ఇంజన్‌గా వ్యవహరిస్తుందని కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ తాజ్ డెక్కన్ లో శనివారం నిర్వహించిన 'లఘు ఉద్యోగ్ భారతీ సౌత్ ఇండియా కాంక్లేవ్'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెద్ద పరిశ్రమలతోనే కాకుండా, గ్రామాలు, పట్టణాల్లో విస్తరించిన ఎంఎస్ఎంఈల ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దేశ జిడిపిలో 32 శాతం, తయారీ రంగంలో 36 శాతం, ఎగుమతుల్లో 49 శాతం వాటా కలిగి ఉన్న ఈ రంగం, ఇప్పటికే 40 కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తోందన్నారు. ఉద్యమ్ ప్లాట్‌ఫామ్‌పై దాదాపు 9.80 కోట్ల ఎంఎస్ఎంఈలు నమోదు కాగా, అందులో 37 శాతం సంస్థలు మహిళల యాజమాన్యంలోనే నడుస్తుండటం విశేషమన్నారు. సాంకేతికత ఉన్నప్పటికీ ఫైనాన్స్ లభించడం పెద్ద సవాలుగా మారిందని, అందుకే ఎంఎస్ఎంఈలకు దీర్ఘకాలిక ఈక్విటీ మూలధనాన్ని అందించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో క్రెడిట్ గ్యారంటీ ఫండ్, పిఎం విశ్వకర్మ, ముద్ర, జిఈఎం వంటి పథకాల ద్వారా రుణ సదుపాయాలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయంగా అనేక పెట్టుబడులు వస్తుంటే, ప్రతిపక్ష నేతలు 'ఇండియన్ ఎకానమీ డెడ్' అంటూ దేశ పరువు తీస్తున్నారని, వారి వైఖరి వల్ల యువత ఉపాధి అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గత 12 ఏళ్లలో ప్రధాని మోదీపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని, దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రప్రభుత్వం ఎల్లప్పుడూ ఎంఎస్ఎంఈలకు అండగా ఉంటుందని పునరుద్ఘాటించారు.

# ఓటు హక్కు కోసం నిరసిస్తే నిర్బంధాలా?

### మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఢిల్లీలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు ముందుకొస్తున్న వారిపై కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నిర్బంధ చర్యలను తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. నిరసనకారులను అడ్డుకోవడం, అరెస్టులు చేయడం, రవాణా సౌకర్యాలకు అంతరాయం కలిగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఓటు హక్కుల పరిరక్షణ కోసం నిరసన తెలిపే అవకాశం కల్పించాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రతి పౌరుడికి ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కు ఉందని పొన్నం స్పష్టం చేశారు. ఢిల్లీలో మెట్రో, రైలు సేవలు, ఇతర రవాణా సౌకర్యాలను నిలిపివేయడం, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగించడం, భారీగా పోలీసులను మోహరించి నిరసనకారులను అడ్డుకోవడం వంటి చర్యలు ఆందోళనకరమన్నారు.

**ఓటర్ల హక్కులకు రక్షణ కల్పించాలి..**

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఆయుధమని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన పౌరులు తమ ఓటు హక్కును కోల్పోకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పొన్నం కోరారు. ఓటర్ల హక్కుల పరిరక్షణపై వస్తున్న ఆరోపణలకు కేంద్రం స్పష్టమైన సమాధానం చెప్పాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా పారదర్శక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఓటు చోరీ ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి, ప్రజల ఆందోళనలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసనలను అణచివేయడం కాకుండా, ప్రజల డిమాండ్లపై చర్చించి పరిష్కారం చూపాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు రక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలు కొనసాగుతాయని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఢిల్లీలో నిరసనకారులపై నిర్బంధ చర్యలను తక్షణమే నిలిపివేసి, నిరసన తెలిపేందుకు అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 'సరస్' మేళాకు జన ప్రవాహం

### నాలుగో రోజు రూ. 30 లక్షల విక్రయాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'సరస్' గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ మేళా సందర్శకులతో కిటకిటలాడుతోంది. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు పట్టణ మార్కెట్‌లో విశేష ఆదరణ లభిస్తోంది. మేళా నాలుగో రోజు నాటికి సందర్శకుల సంఖ్య 40 వేలు దాటగా, మొత్తం విక్రయాలు రూ.30 లక్షలకు మించి నమోదయ్యాయి. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. తెలంగాణ సంప్రదాయ చేనేత వస్త్రాలు, హస్తకళలు, గృహోపకరణాలు, పచ్చళ్లు, చిరుధాన్య ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇతర రాష్ట్రాల నాణ్యమైన ఉత్పత్తులు, సంప్రదాయ ఆహార పదార్థాలు కూడా ఒకే వేదికపై లభిస్తుండటంతో ప్రజలు కుటుంబ సమేతంగా తరలివస్తున్నారు. మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా మధ్యవర్తులు లేకుండా నేరుగా వినియోగదారులకే ఉత్పత్తులను విక్రయించేందుకు సరస్ మేళా ఎంతగానో తోడ్పడుతోంది. ఈ మేళా ప్రాంగణాన్ని మండల సమాఖ్య అధ్యక్షులు ప్రత్యేకంగా సందర్శించారు. స్టాళ్లలోని ఉత్పత్తుల నాణ్యత, ధరలు, ప్యాకేజింగ్, విక్రయ పద్ధతులను పరిశీలించి, మార్కెటింగ్ అవకాశాలు, వ్యాపార విస్తరణపై వారు అవగాహన పెంపొందించుకున్నారు. కాగా, సందర్శకులకు, స్టాల్ నిర్వాహకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రాంగణమంతా సెంట్రలైజ్డ్ ఏసి సౌకర్యంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. గ్రామీణ మహిళల సృజనాత్మకతకు, ఆర్థిక బలోపేతానికి సరస్ మేళా ఉత్తమ వేదికగా నిలుస్తోందని అధికారులు చెప్పారు.

# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్ఐఆర్‌పై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని, నిజంగా ఓట్లు తొలగించారంటే బాధిత ఓటర్లను కాంగ్రెస్ ప్రజల ముందుకు తీసుకురావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సవాల్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, వివిధ విభాగాల కన్వీనర్లు, అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ప్రజల్లోకి వెళ్లి తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టిందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలను పరిశీలించిన తర్వాతే జాబితా సిద్ధమవుతుందన్నారు. ఎవరి పేర్లు అయినా తొలగించాలంటే నిబంధనల ప్రకారం విచారణ, అభ్యంతరాల స్వీకరణ వంటి ప్రక్రియ ఉంటుందన్నారు. పొరపాటున పేరు తొలగితే తిరిగి చేర్చుకునే అవకాశం కూడా ఉందన్నారు. దేశవ్యాప్తంగా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరమన్నారు. కాంగ్రెస్ గతంలో కూడా ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు చేసిందని, గెలిచినప్పుడు ఎన్నికల సంఘాన్ని ప్రశంసిస్తూ, ఓడిపోయినప్పుడు విమర్శించడం ఆ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. మోదీ ప్రభుత్వం దేశ అభివృద్ధికి కృషి చేస్తుండటాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు టి. వీరేందర్ గౌడ్, డాక్టర్ గౌతం రావు పాల్గొన్నారు.





# మూఢనమ్మంతో కన్నతల్లికి నిప్పు పెట్టిన కొడుకు

### మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఎల్లుపేటలో దారుణం

**ప్రజాపక్షం /టేక్మాల్ :** కని పెంచిన కన్నతల్లిపైనే కర్కశత్వం చూపించాడు. తనకు జన్మనిచ్చిన తల్లినే అనుమానంతో అగ్నికి ఆహుతి చేశాడు. మూఢనమ్మకం మదిలో విషంగా మారడంతో విచక్షణ కోల్పోయిన ఓ కుమారుడు, కన్న తల్లిని దారుణంగా హత్య చేసిన ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఎల్లుపేట గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన కర్రే సాయమ్మ (40) తన కుమారుడు కర్రే దుర్గేష్ (22)తో కలిసి నివసిస్తోంది. ఆటో నడుపుతూ జీవనం సాగించే దుర్గేష్, గత వారం రోజులుగా తన తల్లి బాణామతి చేస్తోందనే అనుమానంతో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఇంటికి వచ్చిన దుర్గేష్ తల్లితో వాగ్వాదానికి దిగాడు. మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి గురైన అతడు, తల్లిపై డీజిల్ పోసి నిప్పంటించినట్లు తెలిసింది. మంటల్లో చిక్కుకున్న సాయమ్మ తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయింది. కన్నతల్లి బాణామతి చేస్తోందనే అనుమానంతో ఆమెను హత్య చేసినట్లు ఆరోపణలు రావడం గ్రామంలో తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నిజానిజాలు తెలుసుకోకుండా మూఢనమ్మకాలను నమ్మితే ఎలాంటి విషాదాలు చోటుచేసుకుంటాయో ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. కుటుంబంలో తలెత్తిన అనుమానం చివరకు ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. స్థానికుల సమాచారంతో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, టేకుకారెడ్డి ఎస్ఐ అరవింద్ కుమార్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిందితుడు దుర్గేష్‌ను అదుపులోకి తీసుకుని ఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారణ చేపట్టారు.

# రేడియల్ రోడ్ -2 టెండర్లలో రూ.3,296 కోట్ల కుంభకోణం

### సిఎం రేవంత్ రెడ్డికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రేడియల్ రోడ్2 టెండర్లలో కోట్ల కుంభకోణం జరిగిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారాకరామారావు(కెటిఆర్) ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుద్వేల్ నుంచి కొడంగల్ సమీపంలోని ఎన్‌హెచ్167ఎన్ వరకు 81.15 కిలోమీటర్ల మేర నిర్మించతలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే టెండర్‌లలో తీవ్ర అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ ఆయన ముఖ్యమంత్రికి శనివారం ఒక బహిరంగ లేఖ రాశారు. పనులను ప్యాకేజీలుగా విభజించి, ముందస్తుగా నిర్ణయించుకున్న సంస్థలకే అక్రమంగా కట్టబెట్టారని కెటిఆర్ ఆరోపించారు. తక్కువ ధరకు బిడ్లు దాఖలు చేసిన కంపెనీలను సాంకేతిక కారణాలు చూపి పక్కనపెట్టి, ఎక్కువ ధర కోట్ చేసిన సంస్థలకు పనులు కేటాయించడం వెనుక వందల కోట్ల అవినీతి దాగి ఉందన్నారు. సెప్టెంబర్ 30న బిడ్‌ల దాఖలు ముగిస్తే, సెలవులు మినహాయించి కేవలం ఐదు పని దినాల్లోనే అక్టోబర్ 8 నాటికి మూల్యాంకనం, కేటాయింపుల ప్రక్రియను ఎలా ముగించారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. ఒకే సంస్థకు ఒక ప్యాకేజీలో సాంకేతిక అర్హత కల్పించి, మరో ప్యాకేజీలో అనర్హత వేటు వేయడంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. సుషీ ఇన్‌ఫ్రా వంటి తక్కువ ధర కోట్ చేసిన సంస్థలను నిబంధనలకు విరుద్ధంగా తొలగించడం వల్ల ప్రభుత్వానికి రూ.600 కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లుతోందన్నారు. అలాగే రూ.591 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రేడియల్ రోడ్ 1 టెండర్‌లలోనూ అంచనా కంటే 15 శాతం అధిక ధరకు కేటాయింపులు జరిగాయని మండిపడ్డారు. వెంటనే రేడియల్ రోడ్ 2 టెండర్‌లను రద్దు చేసి, సమగ్ర విచారణ జరిపించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. బిడ్ ఓపెనింగ్ స్టేట్‌మెంట్‌లు, కంపారేటివ్ స్టేట్‌మెంట్‌లు, సాంకేతిక మూల్యాంకన నివేదికలు, మూల్యాంకన కమిటీ సమావేశాల వివరాలను బహిర్గతం చేస్తూ టెండర్‌లపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. హెచ్ఎండిఎ, హెచ్‌జిసిఎల్ చేపట్టిన రూ.100 కోట్లకు పైబడిన కాంట్రాక్టులపై కాగ్ చేత ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని, ప్రజాధనాన్ని కాపాడేందుకు టెండర్‌ల ప్రక్రియలో పారదర్శక నిబంధనలు తీసుకురావాలని ఆయన సిఎం రేవంత్ రెడ్డిని తన లేఖలో డిమాండ్ చేశారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మైనర్ల దుర్మరణం

**ఇటాహ్ (యుపి) :** గుర్తు తెలియని వాహనం ఢీకొని ముగ్గురు మైనర్లు దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇటాహ్ జిల్లాలోని ఆవాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫిరోజ్‌బాద్ జిల్లాకు చెందిన కరణ్ కతాప్ (15), సుమిత్ కతాప్ (17), ఇటాహ్ జిల్లాలోని నిదౌలి కలాన్ ప్రాంతానికి చెందిన ఆషు(17) అన్నదమ్ములు. వీరు ముగ్గురు కలిసి గురువారం శ్రాద్ధ కర్మలకు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా టిషార్ ఇంటర్‌సెక్షన్ వద్ద గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. ఇద్దరు సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. తీవ్ర గాయాలైన మరొకరిని వీరంగన అవంతిబాయి మెడికల్ కాలేజీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్విచక్రవాహనం రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా మృతుల వివరాలు తెలుసుకొని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# పట్టభద్రుల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి

### మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం– వరంగల్–నల్గొండ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో ప్రతి కార్యకర్త గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను పట్టభద్రులకు వివరించి ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవడంతో పాటు కాంగ్రెస్ అభ్యర్థికి పోలయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా శనివారం స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పట్టభద్రులను గుర్తించి ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి, శాసన సభ్యులు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్, కోరం కనకయ్య, ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, రాంరెడ్డి గోపాలరెడ్డి, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.





# 'బతుకమ్మ' కరపత్రం విడుదల

### ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి

**ప్రజాపక్షం/ధర్మసాగర్:** తెలంగాణ ప్రాంతం లో ప్రకృతి నుండి లభించే గునుగు, తంగేడు, గుమ్మడి, చేబంతి బంతి పువ్వులను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చి ఆడుతూ పాడుతూ చేసుకుని పండుగ ఆడబిడ్డలు ఆనందంగా ఉత్సాహంగా ఐకమత్యంగా ఘనంగా నిర్వహించుకునే బతుకమ్మ పండుగ సంబరాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి తెలిపారు. శనివారం ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామంలో తెలంగాణ ప్రజానాట్యమండలి భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ పండుగ సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా పెద్ద పెండ్యాల లో బతుకమ్మ సంబరాల కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది. ఈ నెల 12న హనుమకొండ బాలసముద్రంలో బతుకమ్మ పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి , తెలంగాణ ప్రజానాట్యమండలి హనుమకొండ జిల్లా కార్యదర్శి కొట్టపాక రవి, మహిళా సమాఖ్య హన్మకొండ జిల్లా కార్యదర్శి రాస మల్ల దీన పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, గ్రామ శాఖ కార్యదర్శి ధోనికల రాజయ్య, ధర్మసాగర్ మండల సిపిఐ కార్యదర్శి కొట్టె వెంకటేష్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.




## ఓటు చోరీకి పాల్పడిన సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్:** భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసి, ఓటు చోరీకి పాల్పడిన సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రెహమాన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పేరబోయిన మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరి జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సీపీఐ ఆఫీస్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టి, జ్ఞానేశ్ కుమార్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రెహమాన్, పెరబోయిన మహేందర్ మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘాన్ని, బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకొని, అధికారం సుస్థిరం చేసుకోవడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసన పోరాటానికి వెళ్ళిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి ఏషాల అశోక్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి నయీమ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కందుల మధు, ఉప్పల శాంతి కుమార్, ఎఐటియుసి జిల్లా కోశాధికారి సామల శోభన్ బాబు, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు మారుపాక వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సుద్దాల సాయి కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి బద్దుల శ్రీనివాస్, బెల్లి శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జానీ పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా కేసుల దర్యాప్తు

సూర్యాపేట జిల్లా ఎస్పి కె. నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కేసుల దర్యాప్తులో పోలీసులు ప్రణాళికాబద్ధంగా పనిచేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు బాధితులకు సత్వర న్యాయం అందించవచ్చని జిల్లా ఎస్పి కె. నరసింహ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల నమోదు నుంచి ధర్యాప్తు పూర్తి చేసి చార్జీషీటు దాఖలు చేయడం వరకు ప్రతి దశలోనూ అధికారులు, సిబ్బంది నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ధర్యాప్తు ప్రక్రియలో చట్టపరమైన నిబంధనలు, నిర్ధేశిత కాల పరిమితులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. చట్టపరమైన నిబంధనలను పాటించడం, కోర్టు విధులను సక్రమంగా నిర్వహించడం ద్వారా కేసుల పరిష్కారంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. నాణ్యమైన ధర్యాప్తు ద్వారా నేరస్తులకు శిక్షపడేలా కృషి చేయడంతోపాటు, బాధితులకు సకాలంలో న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్దుమ్ అలీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎస్ఐ సాయిరాం, డిసిఆర్‌బి ఎస్ఐ ఝాన్సీ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, కోర్టు డ్యూటీ సిబ్బంది, పోలీస్ స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

## నేడు నల్లగొండ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల పోరు

సర్వం సిద్ధం చేసిన అధికారులు -1,387 మంది ఓటర్లు

**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రేపు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది.మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ ఎన్నికల్లో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకోనున్నారు. అధికారికంగా 1,387 మంది ఓటర్లు నమోదయ్యారు. రెడ్ క్రాస్ భవనంలో మూడు పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేశారు. ఓటర్లు తమ ఓటరు సంఖ్యకు అనుగుణంగా సంబంధిత బూత్ లో ఓటు వేయాల్సి ఉంటుంది.ఎన్నికల బరిలో గోలి అమరేందర్ రెడ్డి నేతృత్వంలోని 15 మంది సభ్యుల ప్యానల్,డాక్టర్ హేమలత నేతృత్వంలోని నల్లగొండ సేవా సమితి 15 మంది సభ్యుల ప్యానల్ పోటీ పడుతున్నాయి.వీరితో పాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కూడా బరిలో ఉన్నారు.రెండు ప్యానళ్ల మధ్య పోటీ ఆసక్తికరంగా మారడంతో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.జిల్లా కోఆపరేటివ్ ఎన్నికల అధికారి డీసీఓ మమత ఆధ్వర్యంలో,జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. రక్తదాన శిబిరాల నిర్వహణ,పేద రోగులకు సహాయం, అత్యవసర సమయాల్లో బాధితులకు అండగా నిలవడం,నిధుల వినియోగంలో పారదర్శకత పాటించడం నూతన పాలకవర్గం ముందున్న ప్రధాన బాధ్యతలు.

## ఆర్‌టిసి ఎన్నికల్లో ఎఐటియుసి ప్రభంజనం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ఆర్టీసీలో ఎఐటియుసి విజయం ఎర్రజెండాపై కార్మికుల నమ్మకాన్ని నిదర్శనమని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. శనివారం నేరేడుచర్లలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ రోడ్డు రవాణా సంస్థ ఎన్నికలలో గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఎఐటియుసి అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘంగా చారిత్రాత్మక విజయం సాధించిందన్నారు. ఆర్టీసీ ఎన్నికల్లో లభించిన ఈ అపార విజయం కేవలం ఒక యూనియన్ విజయం కాదని, ఇది యావత్ ఆర్టీసీ కార్మికుల విజయమని, ఎర్రజెండా ఎఐటియుసి పోరాట పటిమపై కార్మికులకు ఉన్న అంచెలమైన విశ్వసానికి ఈ తీర్పు ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. ఈ విజయం కోసం శ్రమించిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులకు, కార్యకర్తలకు అలాగే కూటమిగా ఏర్పడి మద్దతు తెలిపిన ఎన్ఎంయు, టిఎంయు తదితర కార్మిక సంఘాల నాయకులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కత్తి శ్రీనివాసరెడ్డి, ముళ్ల జానయ్య, అమరారపు పున్నయ్య, రావుల సత్యం, చిలకరాజు శ్రీను, కొమ్రరాజు వెంకట్, ముత్యాల భాస్కర్, ఎస్‌కె సయ్యద్‌పాషా పాల్గొన్నారు.




# పైరు పైనే... పంట బేరం..!

వరిసాగు తగ్గడంతో... సరికొత్త వ్యాపారానికి తెర

సన్న ధాన్యం పంట సాగు చేసిన రైతుల వద్దకు క్యూ

క్వింటా ధర రూ.3500 నుండి 3800



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఎలినినో ప్రభావంతో ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో వరిసాగు 40 శాతానికి తగ్గిపోయింది. దీనితో మిల్లర్లు పంట చేనుపై ఉండగానే సరికొత్త వ్యాపారానికి తెర లేపారు. సన్న ధాన్యం పంట సాగు చేసిన రైతుల వద్దకు వారు క్యూ కడుతున్నారు. పంట చేతి కి అందేందుకు నెల నుండి రెండు నెలల సమయం పట్టే అవకాశాలు ఉన్నా నూర్పిడి కాగానే ధాన్యం తమకే అమ్మాలంటూ ముందస్తు బేరసారాలు కుదుర్చుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం ఇస్తున్న ధరకు మించి ఇస్తామంటూ చెబుతుండడంతో సన్న ధాన్యం క్వింటాకు రూ.3500 నుండి 3800 వరకు ధర పలుకుతుంది. ఇలా రైతుల నుండి ఒప్పందం చేసుకున్న మిల్లర్లు రూ.50వేలు మొదలు లక్షల్లో అడ్వాన్సులు ఇస్తున్న పరిస్థితి.

ఈ వానా కాలం సీజన్‌లో రైతులు జిల్లా వ్యాప్తంగా 4,94,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కానీ ఎలినినో ప్రభావంతో వర్షాలు కురవక నీటి ఎద్దడితో 40శాతం మేరకు సాగు తగ్గింది. నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్, మూసీ ఆయకట్టు పరిధిలోని రైతులు సాగునీరు వస్తుందనే ఆశతో పంట సాగు చేయగా వారాబంధి పద్ధతిలో నీటిని విడుదల చేయడం అవి సరిపోక పోవడంతో పంటను కాపాడుకునేందుకు చేతిలో చిల్లుగవ్వ లేకున్నా మరీ అప్పు చేసి రైతులు బావులు, బోర్లు తోడించారు. మిగతా మెట్ట ప్రాంతం రైతులు కూడా బావులు, బోర్లపై ఆధారపడి పంట సాగు చేస్తున్నారు. భూగర్భ జలాలు రోజురోజుకు పడిపోతుండడంతో ఒకపక్క నీరు లేక, మరోపక్క విద్యుత్ కోతలతో వరిపైర్లు 10 శాతానికి పైగా ఎండిపోయిన పరిస్థితి. దీనితో మొత్తం పంట సాగు 50 శాతానికి పడిపోయినట్లు అయింది. ప్రభుత్వం సన్నధాన్యం పండించిన రైతులకు కొనుగోలు కేంద్రాల ద్వారా మద్ధతు ధరతోపాటు క్వింటాకు అదనంగా రూ.500 వరకు బోనస్ చెల్లిస్తుండడంతో రైతులు 70శాతానికి మించి సన్న ధాన్యం పంటనే సాగు చేశారు.

వరిసాగు సగానికి సగం తగ్గడంతో మిల్లర్లు సరికొత్త వ్యాపారానికి తెర లేపారు. ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చి ధాన్యానికే సన్నరకంలో చింట్లు క్వింటాకు రూ.3500 నుండి 3800 వరకు ధర పలుకుతుండగా సాంబమసూరి క్వింటా ధర రూ.3500 నుండి 3600 వరకు ఉంది. దీనిని మిల్లర్లు రైతుల నుండి పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు మద్ధతు ధర రూ.2461 చెల్లించడంతోపాటు అదనంగా మరో రూ.500 ఇస్తుంది. ఇలా చూసుకుంటే క్వింటాకు రూ.2961లకు మించి రైతులకు రావడంలేదు. వర్షాభావ పరిస్థితుల్లో పంటసాగు తగ్గడంతో మిల్లర్లు సరికొత్త వ్యాపారానికి తెరలేపారు. పంట చేతికి అందకముందే రైతుల వద్దకు క్యూ కడుతున్నారు. మిర్యాలగూడ, కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన మిల్లర్లు ఊరూరు తిరుగుతూ సన్నరకం పంటను సాగు చేస్తున్న రైతుల వివరాలు సేకరిస్తున్నారు. రైతులు ఎన్ని ఎకరాలు సాగు చేశారు... ఎంత పంట దిగుబడి వస్తుంది అంచనా వేస్తున్నారు. అనంతరం రైతులతో బేరసారాలకు దిగి క్వింటాకు రూ.600 నుండి 1000 వరకు అదనంగా చెల్లిస్తామంటూ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. పనిలో పనిగా ఎకరాకు రూ.10వేల వరకు అడ్వాన్సుగా రైతులకు ముట్టజెప్పుతున్నారు. ప్రభుత్వం కూడా రైతులు తడి పంటలు సాగుచేసి నష్టపోవద్దని కేవలం ఆరు తడి పంటలనే సాగు చేయాలని చెబుతూ వస్తుంది. దీనిని మిల్లర్లు ముందుగానే పసిగట్టి అధిక ధరలకు ధాన్యాన్ని సేకరించే పనిలో పడ్డారు. కొనుగోలు చేసిన ధాన్యంతో లాభాలు అధికంగా గడించవచ్చనే ఆశతో ఇదంతా చేస్తున్నారు.



## ఓట్ల తొలింపు ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదం

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** వ్యవసాయానికి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చిలుకూరు మండలంలో బేతవోలులో నిర్వహించిన సిపిఐ గ్రామశాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఓట్ల తొలగింపుపై ఆందోళన లక్షలాది ఓట్లను తొలగిస్తూ ప్రజాస్వామ్య మనుగడకు విఘాతం కలిగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈసి జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

కామ్రేడ్ తాళ్లూరి భద్రయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహంచాలి

చిలుకూరు మండల సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, అమరజీవి కామ్రేడ్ తాళ్లూరి భద్రయ్య, 19వ వర్ధంతిని ఈనెల 14న ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. భద్రయ్య ప్రజా ఉద్యమాలకు చేసిన సేవలను స్మరించుకుంటూ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామశాఖ అధ్యక్షుడు మహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శాఖ కార్యదర్శులు తాళ్లూరి వెంకటయ్య, బెజవాడ వినోద్, సహాయ కార్యదర్శి అల్వాల రాజేష్, సీనియర్ నాయకులు తాళ్లూరి పెద్ద మల్లయ్య, తాళ్లూరి రామారావు, నేలపట్ల జనార్ధన్, బెజవాడ నాగయయ, చందా రామారావు, బెజవాడ శ్రీనివాస్, కామళ్ల కృష్ణ, ఎర్రమళ్ల గోపయ్య పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రానున్న ఏడు రోజులు పొడి వాతావరణం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ష్ట్రంలో రాగల ఏడు రోజుల పాటు వాతావరణం పూర్తిగా పొడిగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. నేటి నుంచి వచ్చే శనివారం వరకు రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనూ వర్షాలు కురిసే సూచన లేదని స్పష్టం చేశారు. అన్ని జిల్లాల్లో సాధారణంగా పొడి వాతావరణ పరిస్థితులే నెలకొనే అవకాశముందన్నారు. భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు లేదా ఇతర ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం లేదన్నారు.

## కోపం, అహంకారం, ఆధిపత్య ధోరణులకు స్వస్తి పలకాలి

- ‘స్టాండ్ విత్ హర్’ చర్చావేదికలో డిజి చారు సిన్హా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కుటుంబంలోనైనా, సమాజంలోనైనా ఆరోగ్యకరమైన సంబంధాలు కొనసాగాలంటే పరస్పర గౌరవం, భావోద్వేగాలపై నియంత్రణ, ఇతరుల అభిప్రాయాలను అర్థం చేసుకునే మనస్తత్వం అవసరమని సిఐడి,ఎసిబి, మహిళా భద్రత విభాగాల డిజి చారు సిన్హా పేర్కొన్నారు. కోపం, అహంకారం, ఆధిపత్య ధోరణులతో కూడిన పురుషాధిక్య భావజాలాన్ని విడనాడాలని, అలవాటుగా మారిన ప్రవర్తనలను మార్చుకోవడం సాధ్యమేనని స్పష్టం చేశారు. స్త్రీ, పురుషులు పరస్పర పూరకాలని, ఎవరు ఎక్కువ కాదని, ఎవరు తక్కువ కాదని ఆమె ఉద్ఘాటించారు. ‘స్టాండ్ విత్ హర్’ ప్రచారంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని విహబ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన ఎనిమిదో చర్చావేదికలో చారు సిన్హా మాట్లాడారు. లింగ సమానత్వం, పరస్పర గౌరవం, ఆరోగ్యకరమైన వ్యక్తిగత సంబంధాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి చర్చలు దోహదపడతాయని పేర్కొన్నారు. విభేదాలు తలెత్తినప్పుడు తక్షణమే స్పందించకుండా, భావోద్వేగాలను అదుపులోకి తెచ్చుకునేందుకు కొంత సమయం తీసుకోవడం మంచిదని చర్చలో అనూష సూచించారు. అయితే, తనకు కొంత సమయం అవసరమనే విషయాన్ని ఎదుటివారికి స్పష్టంగా తెలియజేయాలని, లేకపోతే అపార్థాలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. కుటుంబం, సమాజంలో పాతుకుపోయిన లింగ వివక్షాపూరిత భావజాలాన్ని పురుషులతోపాటు మహిళలు కూడా కొన్నిసార్లు కొనసాగిస్తున్నారని నటి, యాంకర్ ఝాన్సీ పేర్కొన్నారు. ఇలాంటి ధోరణులను గుర్తించి, ప్రతి ఒక్కరూ తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని సూచించారు. కోపాన్ని సానుకూల దిశలో మళ్లించేందుకు క్రీడలు, శారీరక వ్యాయామాలు ఉపయోగపడతాయని నటుడు వంశీ చాగంటి అన్నారు. విభేదాలు వచ్చినప్పుడు వాదనలో గెలవడమే లక్ష్యంగా కాకుండా, సంబంధాలను కాపాడుకోవడానికి ప్రాధాన్యమివ్వాలని కార్మిక శాఖ ప్రత్యేక కమిషనర్ పమేలా సత్పతి సూచించారు. మహిళల అభిప్రాయాలు, అనుభవాలను తక్కువగా చూడటం, వారికి తెలిసిన విషయాలను సైతం అనవసరంగా వివరించే ధోరణులను గుర్తించి మార్చుకోవాలని వీహబ్ సీఈఓ సీత పల్లచొల్ల పేర్కొన్నారు. కోపం, అహంకారం, వివక్షాపూరిత ఆలోచనలను అధిగమించేందుకు పరస్పర సంభాషణ, స్వీయ నియంత్రణ, ఇతరుల అభిప్రాయాల పట్ల గౌరవం కీలకమని వక్తలు అభిప్రాయపడ్డారు. ‘స్టాండ్ విత్ హర్’ కార్యక్రమం ద్వారా ప్రతి నెలా ఒక అంశంపై చర్చావేదిక నిర్వహిస్తూ లింగ సమానత్వం, పరస్పర గౌరవం, సామాజిక మార్పుపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా భద్రత విభాగానికి చెందిన అనూష, నటి ఝాన్సీ, నటుడు వంశీ చాగంటి, విహబ్ సిఇఒ సీత పల్లచొల్ల, ఐఎఎస్ అధికారి పమేలా సత్పతి, జర్నలిస్టు దీప్తి వాజ్‌పేయి, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## దక్షిణ మధ్య రైల్వేలో స్వచ్ఛతాకు విశేష ఆదరణ

- 3,730 రైల్వే యూనిట్లలో పరిశుభ్రత పనులు.. 21,458 మంది భాగస్వామ్యం
- 813 మంది కాంట్రాక్టు కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే ప్రాంగణాల్లో పరిశుభ్రతను పెంపొందించడంతో పాటు ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా దక్షిణ మధ్య రైల్వే చేపట్టిన ‘స్వచ్ఛతా హి సేవా’ కార్యక్రమం విజయవంతమైంది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లతో పాటు వివిధ వర్క్‌షాపుల పరిధిలో మొత్తం 3,730 రైల్వే యూనిట్లలో పరిశుభ్రత పనులు చేపట్టారు. రైల్వే బోర్డు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించడం విశేషం. ఈ కార్యక్రమంలో 21,458 మంది పాల్గొని స్వచ్ఛ భారత్ లక్ష్య సాధనకు తమ వంతు సహకారం అందించారు.‘స్వచ్ఛతలో భాగస్వామ్యం.. స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్’ అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్లు, రైళ్లు, కార్యాలయాలు, రైల్వే కాలనీలు, ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, వర్క్‌షాపులు, నిర్వహణ డిపోలు, ఇతర రైల్వే ప్రాంగణాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు పరిశుభ్రతను నిరంతర ప్రక్రియగా కొనసాగించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.పారిశుద్ధ్య పనుల్లో కీలక పాత్ర పోషించే కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కూడా దక్షిణ మధ్య రైల్వే ప్రాధాన్యమిచ్చింది. జోన్ పరిధిలో 20 ‘సఫాయి మిత్ర సురక్షా శివిర్’ ఆరోగ్య శిబిరాలను నిర్వహించి 813 మంది కాంట్రాక్టు కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు, రక్తపోటు, రక్తహీనత, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. లాలాగూడలోని కేంద్ర రైల్వే ఆసుపత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా చేపట్టారు. విద్యాసంస్థల్లో స్వచ్ఛతపై అవగాహన, ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు, స్వచ్ఛత ద్వారా సమృద్ధి, పరిశుభ్రమైన స్టేషన్లు–రైళ్లు, పర్యాటక, వారసత్వ రైల్వే ప్రదేశాల శుభ్రత వంటి అంశాలకు ఈ కార్యక్రమంలో ప్రాధాన్యమిచ్చారు.

ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అక్టోబర్ 1 నుంచి 15 వరకు ‘స్వచ్ఛతా పక్షోత్సవం’ నిర్వహిస్తున్నారు. రైల్వే ప్రాంగణాల్లో స్పష్టమైన పరిశుభ్రత మార్పులు తీసుకురావడంతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ‘ఒక రోజు.. ఒక గంట.. అందరం కలిసి’ కార్యక్రమం, ‘ఏక్ పెడ్ మా కే నామ్’ పేరుతో మొక్కల నాటడం, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలనే ప్రచారం, ఫ్లాష్‌మాబ్‌లు, వీధి నాటకాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వర్క్‌షాపులు, కాలనీలు, డిపోలు, షెడ్లలో శుభ్రత పనులతో పాటు రైల్వే పట్టాలపై వ్యర్థాల తొలగింపునకు చర్యలు చేపడుతున్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, రైల్వే బోర్డు లక్ష్యాలను అధిగమించిన దక్షిణ మధ్య రైల్వే అధికారులను, సిబ్బందిని జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రస్తుత స్వచ్ఛతా పక్షోత్సవంతో పాటు రానున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమం 6.0ను కూడా విజయవంతం చేయాలని అధికారులకు, పర్యవేక్షకులకు, సిబ్బందికి సూచించారు.

## జగన్ అక్రమాస్తుల కేసుల్లో రోజువారీ విచారణకు ఆదేశించండి

- నిందితులందరూ వ్యక్తిగతంగా హాజరుకు సిబిఐ కోర్టుకు ఆదేశాలు ఇవ్వండి
- పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న తొమ్మిది చార్జిషీట్లు.. ఇడి పిటిషన్
- ఇడి పిటిషన్ పై 13న విచారించనున్న హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైఎస్సార్‌సిపి అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఇతరులపై నమోదైన అక్రమాస్తులు, మనీలాండరింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని, నిందితులందరూ వ్యక్తిగతంగా న్యాయస్థానానికి హాజరయ్యేలా చూడాలని కోరింది. ఈ మేరకు ఈడీ సెప్టెంబరు 23న తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. జగన్‌తో పాటు ఇతరులపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద నమోదు చేసిన కేసులకు సంబంధించి దాదాపు పదేళ్లుగా సరైన పురోగతి లేదని పిటిషన్‌లో పేర్కొంది. ఈడీ 2016 నుంచి 2021 మధ్య హైదరాబాద్ నాంపల్లిలోని సీబీఐ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో తొమ్మిది ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు (చార్జిషీట్లు) దాఖలు చేసింది. వీటన్నింటినీ ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరించినప్పటికీ, నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్లు పరిష్కారం కాకపోవడంతో ప్రధాన కేసుల విచారణ ముందుకు సాగడం లేదని ఇడి తెలిపింది. డిశ్చార్జి పిటిషన్లపై ప్రత్యేక కోర్టులో వాదనలు జరిగినప్పటికీ, న్యాయమూర్తుల బదిలీలు, ఇతర కారణాలతో తుది నిర్ణయాలు వెలువడలేదని పేర్కొంది.

జగన్, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన సంస్థల్లోకి వివిధ కంపెనీలు, వ్యక్తులు అధిక విలువకు షేర్లు కొనుగోలు చేయడం ద్వారా భారీగా పెట్టుబడులు పెట్టారన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సంస్థలు, వ్యక్తులకు అనుకూల నిర్ణయాలు తీసుకున్నందుకు ప్రతిఫలంగా జగన్‌కు సంబంధించిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టారన్నది దర్యాప్తు సంస్థల ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారంలో జగన్‌తో పాటు మరో 73 మందిపై సీబీఐ కేసు నమోదు చేయగా, దాని ఆధారంగా ఈడీ మనీ లాండరింగ్ కేసులను దర్యాప్తు చేస్తోంది. భారతీ సిమెంట్ కార్పొరేషన్, జగతి పబ్లికేషన్స్, జనని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి సంస్థల్లో పెట్టుబడులకు సంబంధించి ఈడీ ఆరోపణలు చేసింది. ఆర్థిక నేరాలు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని సుప్రీంకోర్టు గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా తన పిటిషన్‌లో ప్రస్తావించింది. రాజ్యాంగంలోని 21వ అధికరణం కల్పించిన సత్వర విచారణ హక్కును దృష్టిలో ఉంచుకుని, డిశ్చార్జి పిటిషన్లతో పాటు ప్రధాన కేసులపై రోజువారీ విచారణ చేపట్టేలా ఆదేశించాలని కోరింది. జగన్ కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ గతంలో హరిరామజోగయ్య తదితరులు దాఖలు చేసిన పిటిషన్లతో ఈడీ పిటిషన్‌ను జత చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్లన్నింటినీ కలిపి అక్టోబరు 13న విచారిస్తామని ప్రకటించింది.

# చట్టబద్ధంగా రిజర్వేషన్లు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు సామాజిక న్యాయం
- రాజకీయంగా మరిన్ని అవకాశాలు
- రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికకు ఎపి కేబినెట్ గ్రీన్ సిగ్నల్

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి అడ్డంకులన్నీ తొలగిపోయాయి. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు (బిసి) రాజ్యాంగబద్ధంగా, శాస్త్రీయ నిబంధనలకు అనుగుణంగా న్యాయమైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. శనివారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతత్వంలోని హైపవర్ కమిషన్ సుదీర్ఘ పరిశీలన అనంతరం సమర్పించిన సమగ్ర నివేదిక దాని ఆధారిత సిఫార్సులపై సుదీర్ఘంగా చర్చించి అధికారిక ఆమోదముద్ర వేసింది. అనంతరం, రాష్ట్ర మంత్రులు డోలా బాలశ్రీ వీరాంజనేయ స్వామి, సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి, ఎస్. సవిత, గుమ్మిడి సంధ్యారాణి, వంగలపూడి అనితలతో కలసి మంత్రి అచ్చెన్నాయుడు విలేకరులతో మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా సీనియర్ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతత్వంలో ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచారం సేకరించి జనాభా ప్రాతిపదికన కమిషన్ సమర్పించిన నివేదికను పరిశీలించిన అనంతరం మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని, తదుపరి చర్యల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపినట్లు వివరించారు.

కేటగిరీల వారీగా బిసి రిజర్వేషన్ల శాతం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు దక్కనున్న స్థానాలు, వాటి రిజర్వేషన్ శాతాలను ప్రభుత్వం పరిశీలిస్తే కార్పొరేషన్ మేయర్ల విభాగంలో మొత్తం 17 స్థానాలకు గాను 35.29 శాతం రిజర్వేషన్‌తో బీసీలకు 6 సీట్లు కేటాయించారు. మున్సిపల్ చైర్మన్ల పదవుల్లో మొత్తం 106 స్థానాలకు గాను 33.02 శాతం చొప్పున 35 సీట్లు, మున్సిపల్, అర్బన్ వార్డులలో మొత్తం 3,884 స్థానాలకు గాను 32.78 శాతంతో 1,273 వార్డులు బీసీ వర్గాలకు దక్కనున్నాయి. గ్రామీణ ప్రాంతాల విషయానికి వస్తే, మొత్తం 13,351 సర్పంచ్ స్థానాల్లో 27.95 శాతం రిజర్వేషన్‌తో 3,128 పదవులను, మొత్తం 1,33,910 పంచాయతీ వార్డు సభ్యుల స్థానాల్లో 26.73 శాతంతో 30,315 సీట్లను బీసీలకు కేటాయించారు. అలాగే ఎంపిటిసి, విభాగంలో మొత్తం 9,913 స్థానాలకు గాను 25.55 శాతంతో 2,400 సీట్లు దక్కాయి. మండల పరిషత్ అధ్యక్షుల పదవుల విభాగంలో మొత్తం 661 స్థానాలకు గాను 24.60 శాతం చొప్పున 152 పదవులు, అదే విధంగా జెడ్‌పిటిసి విభాగంలో ఉన్న మొత్తం 661 స్థానాల్లోనూ 24.60 శాతంతో 152 సీట్లు బీసీల పరమయ్యాయి. చివరగా, జిల్లా పరిషత్ చైర్మన్ల పదవులలో మొత్తం 28 స్థానాలకు గాను 23.08 శాతం రిజర్వేషన్‌తో బిసి వర్గాలకు 7 స్థానాలు లభించనున్నాయి

రాహుల్ విజయ్, అర్చన అయ్యర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'అ' సినిమాపై ఇప్పటికే మంచి బజ్ నెలకొంది. అడివి శేష్ విడుదల చేసిన సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన రావడంతో పాటు. ఇటీవల విడుదల చేసిన 'బ్లడీ హంగర్' పేరుతో విడుదల చేసిన గ్లింప్స్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది.

రీల్

# 'ది ట్రెయిటర్స్'కు హోస్ట్ చేయడం ఎంజాయ్ చేశాను

హీరో తేజ సజ్జ



భారతదేశంలో ప్రత్యేక ఒరిజినల్స్‌కు పేరుపొందిన ప్రముఖ స్ట్రీమింగ్ సర్వీస్ ప్రైమ్ వీడియో 'ది ట్రెయిటర్స్ తెలుగు' తో అలరించబోతోంది. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ రియాలిటీ ఫార్మాట్‌ను తెలుగు ప్రేక్షకుల కోసం ప్రత్యేకమైన స్థానిక హంగులతో తీసుకొస్తున్నారు. స్టార్ హీరో తేజ సజ్జ ఈ షోని హోస్ట్ చేస్తున్నారు. విభిన్న రంగాలకు చెందిన 20 మంది సెలబ్రిటీలు ఈ గేమ్‌లో పాల్గొంటున్నారు. మొత్తం 10 ఎపిసోడ్‌లోగా రూపొందిన ఈ సిరీస్‌లో పోటీదారులు నమ్మకమే ప్రమాదంగా మారే ఒక ప్రపంచంలోకి అడుగుపెడతారు. ఎవరిని నమ్మాలి? ఎవరిని అనుమానించాలి? ఎవరు ట్రెయిటర్స్? అనే ప్రశ్నల చుట్టూ గేమ్ సాగుతుంది. ఎస్ ఒ ఎల్ ప్రొడక్షన్ నిర్మించిన 'ది ట్రెయిటర్స్ తెలుగు' తెలుగులో, ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో ప్రైమ్ వీడియోలో ప్రత్యేకంగా స్ట్రీమింగ్ కానుంది. ఈ నెల 15 నుంచి ప్రతి గురువారం మధ్యాహ్నం 12గంటలకు కొత్త ఎపిసోడ్ విడుదల కానుంది. ఈ సందర్భంగా తేజ సజ్జా 'ప్రజాపక్షం'కు ఇచ్చిన స్పెషల్ ఇంటర్వ్యూ విశేషాలు.

**ప్రశ్న : వరుసగా సూపర్ హిట్ సినిమాలు చేస్తున్నారు కదా.. ది ట్రెయిటర్స్ కి హోస్ట్‌గా మారడం ఎలా అనిపించింది?**

**తేజ సజ్జ:** ట్రెయిటర్స్ గ్లోబల్‌గా చాలా పెద్ద హిట్ ఫ్రాంచైజ్. 20కి పైగా దేశాల్లో, 25కి పైగా భాషల్లో చేశారు. హిందీలో కరణ్ జోహార్ గారు చేసినప్పుడు నాకు దాని గురించి పెద్దగా ఆలోచన లేదు. ఒక ఎపిసోడ్ చూడడం మొదలుపెట్టి రెండు రోజుల్లో మొత్తం సీజన్ పూర్తి చేశాను. నాకు అప్పుడే కాన్సెప్ట్, షో నచ్చింది. మిరాయ్ సినిమా పూర్తి అయిన తర్వాత అమెజాన్ ప్రైమ్ వీడియో వాళ్లు నన్ను సంప్రదించారు. నా కెరీర్‌లో చాలా త్వరగా ఓకే చేసిన ప్రాజెక్ట్ ఇదే. ఈ షో ఫార్మాట్ అంత స్ట్రాంగ్‌గా ఉంది కాబట్టి అన్ని భాషల్లో విజయవంతమైంది. ఆ నమ్మకంతో ఇమ్మీడియట్గా ఓకే చేశాను. ప్రైమ్ వీడియో లాంటి ఇంటర్నేషనల్ ప్లాట్ఫామ్‌తో కొలాబరేట్ అవ్వడం చాలా ఆనందాన్నిచ్చింది. తెలుగులో ఇంత పెద్ద స్కేల్లో ఒక రియాలిటీ షో ఎప్పుడూ చూడలేదు.

**ప్రశ్న : ఎన్ని రోజులు షూట్ చేశారు? హోస్ట్ క్యారెక్టర్ ఎలాంటి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది?**

**తేజ సజ్జ :** 11 రోజులు షూట్ చేశాం. మొత్తం పది ఎపిసోడ్‌లో. నేను హిందీ వెర్షన్ చూస్తున్నప్పుడు అందులో నాకు పార్టిసిపెంట్స్‌తో ఎలాంటి ఎమోషనల్ కనెక్షన్ లేదు. వాళ్లు ఎవరో కూడా నాకు పరిచయం లేదు. కాకపోతే ఇక్కడ ప్రగతి గారు, హర్షవర్ధన్ గారు, చిన్మయి గారు.. వీళ్లందరూ కూడా మనకి తెలిసిన వ్యక్తులు. వీళ్ల ఎలా బిహేవ్ చేస్తారో అనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. హోస్ట్ క్యారెక్టర్ కూడా ఇందులో చాలా కీలకం. అది కూడా ఒక సినిమాలో పోషించిన ఒక క్యారెక్టర్ లాంటిది. నేను ఆ హోస్ట్ క్యారెక్టర్‌లోనే బిహేవ్ చేయాలి. అది చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. క్లాస్ లీడర్ లాంటి క్యారెక్టర్.

**ప్రశ్న : గేమ్ షో ఎలా ఉండబోతుంది?**

**తేజ సజ్జ :** ఇందులో మొదటి మూడు ఎపిసోడ్‌లో వస్తాయి. ఆ మూడు ఎపిసోడ్‌లో చూసిన తర్వాత ఈ గేమ్ షోపై ఒక క్లారిటీ వచ్చేస్తుంది. ఇదంతా ఒక మర్డర్ మిస్టరీ లాగా ఉంటుంది. .తెలుగులో ఇప్పటివరకు చూసిన ఏ రియాలిటీ షోతో దీనికి పోలిక ఉండదు. చాలా కొత్త ఫార్మాట్. నిజంగా ఒక రియల్ గేమ్లాగా ఉంటుంది. ఫుట్బాల్, చెస్.. ఎలా అయితే కొన్ని రూల్స్ ప్రకారం కంప్లీట్ గేమ్లాగా ఉంటాయో.. ఈ రియాలిటీ షో కూడా కంప్లీట్‌గా ఒక గేమ్‌లోగా ఉంటుంది.

**ప్రశ్న : ఇది కొత్త గేమ్ షో అంటున్నారు కదా? ప్రేక్షకులకు ఈజీగా అర్థమవుతుందా?**

**తేజసజ్జ :** మొదటి మూడు ఎపిసోడ్‌లో రిలీజ్ అవుతాయి. ఆ మూడు ఎపిసోడ్‌లో చూస్తే అసలు ఏం, ఎలా ఉండబోతుందో ఒక క్లారిటీ వచ్చేస్తుంది. ఎవరిని నమ్మాలి? ఎవరిని అనుమానించాలి? ఎవరు ట్రెయిటర్స్? ఎవరు అమాయకులు? అనే కోణంలో నడిచే ఈ గేమ్ ఒక థ్రిల్లర్‌లా వుంటుంది.

**ప్రశ్న : ఇందులో కంటెస్టెంట్స్‌ను ఎలా సెలెక్ట్ చేశారు?**

**తేజ సజ్జ :** దీనికిగేమ్ ఆడే వాళ్లు చాలా ముఖ్యం. మానిపులేట్ చేయగలగాలి, నమ్మించగలగాలి, గేమ్స్‌లోని రూల్స్ తెలిసి ముందుకెళ్లగలగాలి. దాదాపు అన్ని రంగాల్లో ఉన్న వాళ్లని ఒక్కొక్కరుగా సెలెక్ట్ చేయడం జరిగింది. సెలబ్రిటీగా ఉండటం అనేది దీని ప్రియారిటీ కాదు. గేమ్ ఆడటం అనేది ప్రియారిటీ.

**ప్రశ్న : కోటి రూపాయలు ప్రైజ్ మనీ అంటున్నారు కదా?నిజంగా ఇస్తారా?**

**తేజ సజ్జ :** అది మీరు గేమ్ షో చూసి తెలుసుకోవాలి. కాకపోతే ఖచ్చితంగా ఇస్తారు.

**ప్రశ్న : హోస్ట్ చేయడం ఎలా అనిపించింది?**

**తేజ సజ్జ :** నేను చాలా ఎంజాయ్ చేస్తూ చేశాను. ఎందుకంటే ఈ షో నాకు చాలా ఇష్టం. నేను ఎలాంటి బెరుకు లేకుండా మాట్లాడతాను. చాలా ఈజీగా చేయొచ్చని అనుకున్నాను. వీళ్లు మొదటి రోజు నాలుగైదు పేజీలు ఇచ్చారు. పార్టిసిపెంట్స్‌కు రూల్స్ అన్నీ చెప్పాలన్నారు. ఈజీగా చెప్పొచ్చు అనుకున్నాను. కాకపోతే ఆ నాలుగు పేజీలు కూడా సింగిల్ చెప్పాలి. ఎక్కడ కూడా తేడా రాకూడదు. నిజానికి స్టూడియోలో చేసే రియాలిటీ షోలో కట్ చేయొచ్చు. కానీ ఇందులో కంటెస్టెంట్స్‌నా ఎదురుగానే ఉంటారు. ఏదైనా సరే సింగిల్ చెప్పాలి.7, 8 ఏళ్ల చిన్నపిల్లల నుంచి ఈ షో అందరికీ నచ్చేలా ఉంటుంది. అందరూ ఎంజాయ్ చేస్తారు. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా పిల్లల్లో కూడా ఈ షోకి చాలా పాపులారిటీ ఉంది, ఫాలోయింగ్ ఉంది.

**ప్రశ్న : జాంబీ రెడ్డి 2 గురించి?**

**తేజ సజ్జ :** రీసెంట్ గా షూటింగ్ స్టార్ట్ చేశాం. చాలా క్రేజీ ఎంటర్‌టైనర్ చేయాలనే ప్రయత్నం.

# 'ఎగిలి వారంగాలేసి' సాంగ్ రిలీజ్



శర్వానంద్ 'భోగి' చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామాను శ్రీ సత్యసాయి ఆరట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా ప్రమోషన్స్ ఇటీవల విడుదలైన టీజర్‌తో ప్రారంభమయ్యాయి. టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది.'భోగి' మ్యూజికల్ ప్రమోషన్స్ తాజాగా 'ఎగిలి వారంగా' పాట విడుదలతో ప్రారంభమయ్యాయి. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించే ఈ జానపద గీతం సినిమా నేపథ్యాన్ని అద్భుతంగా పరిచయం చేస్తోంది. మట్టి వాసనతో కూడిన జానపద పాటలను రూపొందించడంలో తన ప్రత్యేకతను చాటుకున్న భీమ్స్ సిసిరోలియో ఈ పాటకు అందమైన బాణీని అందించారు. విభిన్నమైన సంగీత ప్రయోగాలతో సాగిన ఈ పాట అందరినీ ఆకట్టుకుంది.1960ల కాలంలో మహారాష్ట్రఆదిలాబాద్ సరిహద్దులోని బొగ్గుల గుట్ట గ్రామం నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. అప్పటి పల్లె జీవనాన్ని సహజంగా ఆవిష్కరిస్తో, ఆ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, కులవృత్తులు, గ్రామస్థుల జీవితాలపై పెత్తనం చెలాయించిన స్థానిక భూస్వాముల ప్రభావాన్ని ఈ పాటలో చూపించారు. ఆస్కార్ అవార్డ్ విజేత చంద్రబోస్ తెలంగాణ సహజమైన మాండలికంలో రాసిన సాహిత్యం ఈ వాస్తవాలను కళ్లకు కట్టినట్లు ఆవిష్కరిస్తుంది. గ్రామంలోని సామాజిక వ్యవస్థ, ప్రజల నిత్యజీవిత అనుభవాలను ఎలాంటి ఆర్భాటాలు లేకుండా, సహజంగా, వాస్తవికంగా తన సాహిత్యంలో ప్రతిబింబించారు. నల్గొండ గద్దర్ నర్సన్న తన వాయిస్‌తో పాటకు ప్రాణం పోశారు. తన ప్రత్యేకమైన పల్లె గొంతుతో పాటకు మరింత సహజత్వాన్ని తీసుకొచ్చారు. ఆయనతో పాటు నర్సిరెడ్డి, కందుకూరి శంకర్ బాబు, రిలారే గోపాల్ పాటకు మరింత పల్లె పరిమళాన్ని అద్దారు.పాటలోని సంగీతం, సాహిత్యంలోని గొప్పదనానికి విజువల్స్ కూడా చక్కగా తోడయ్యాయి. అప్పటి గ్రామీణ వాతావరణాన్ని, పల్లె జీవనశైలిని రీ క్రియేట్ చేశారు. ఈ సినిమాలో మర్ డింపుల్ హయతి నటిస్తున్నారు.

## ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌గా 'అ'



రాహుల్ విజయ్, అర్చన అయ్యర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'అ' సినిమాపై ఇప్పటికే మంచి బజ్ నెలకొంది. అడివి శేష్ విడుదల చేసిన సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన రావడంతో పాటు. ఇటీవల విడుదల చేసిన 'బ్లడీ హంగర్' పేరుతో విడుదల చేసిన గ్లింప్స్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోన్న. ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న థియేట్రికల్ విడుదల చేస్తున్నారు. డెబ్యూ ప్రొడక్షన్ హౌస్‌లో స్టార్ బాక్స్ స్టోరీస్, రిపుల్ స్లైడ్ స్టూడియోస్ బ్యానర్లపై రూపొందుతున్న ఈ మిస్టీరియస్ ఇన్వెస్టిగేషన్ డ్రామా థ్రిల్లర్‌లో రాహుల్ విజయ్, అర్చన అయ్యర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. కనకరావు తొనంగి, అభిషేక్ కె, ప్రముఖ ఎడిటర్ గ్యారీ నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. సాయి బాలి దర్శకత్వం వహిస్తున్నారు. కాగా ఈ చిత్రంలోని ఇదేనా ఇదేనా అనే లిరికల్ వీడియో సాంగ్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. శ్రీచరణ్ పాకాల స్వరాలు సమకూర్చిన ఈ పాటను షణ్ముఖ భరద్వాజ్ ఆలపించారు. సుమన్ చిక్కాల ఈ పాటకు సాహిత్యం అందించారు. ఈ పాటను జర్నలిస్ట్‌లో పర్వతనేని రాంబాబు, శివమల్లాల,హేమ మాలిని లు ఆవిష్కరించారు. గేయ రచయిత సుమన్ , సింగర్ షణ్ముఖ్‌కో ప్రొడ్యూసర్ అభినవ్ ,నిర్మాత గ్యారీ బీహెచ్ , సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల, దర్శకుడు సాయి బాలి , హీరోయిన్ అర్చన అయ్యర్ హీరో రాహుల్ విజయ్, నటుడు నరేష్, కో ప్రొడ్యూసర్ అభినవ్.వి.కునపరెడ్డి పాల్గొన్నారు.

## డిసెంబర్ 4న 'అలియాస్ రుక్మిణి'



నాని యునానిమస్ ప్రొడక్షన్స్ మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతోంది. 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నితిన్ హీరోగా నటిస్తుండగా, 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్న 'అలియాస్ రుక్మిణి' ఒక విలక్షణమైన కథనంతో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లో పుదిద్దుకుంటోంది. ఈ చిత్రాన్ని పూర్తి చేయడానికి కేవలం ఒక షెడ్యూల్ మాత్రమే మిగిలి ఉంది. శరవేగంగా షూటింగ్ జరుగుతుండటంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మేకర్స్ సినిమా ప్రపంచవ్యాప్త థియేట్రికల్ రిలీజ్‌కు డిసెంబర్ 4వ తేదీని ఖరారు చేశారు.రిలీజ్ డేట్ పోస్టర్‌లో నితిన్ ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తిగా కనిపిస్తున్నారు. చెక్స్ షర్ట్, ఫార్మల్ ట్రౌజర్స్, కళ్లద్దాలు ధరించి, భుజానికి బ్యాగ్ తగిలించుకుని కోర్టు ప్రాంగణంలో జనాల మధ్య నిలబడి ఉన్నారు. వెనుకవైపు న్యాయవాదులు, పోలీసులు కనిపిస్తున్నారు. అలాంటి సమయంలో అతడి జీవితంలోకి ప్రేమ ప్రవేశిస్తుంది. అనుకోకుండా బయటపడిన ఒ రహస్యం అతను నమ్మిన ప్రతిదాన్నీ తలకిందులు చేసే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రేమ, దాగి ఉన్న నిజాల చుట్టూ సాగే ఈ కథ.. సమాజం అంగీకరించే విషయాలకు, ప్రశ్నించాలనుకునే అంశాలకు మధ్య ఉన్న సన్నని గీతను ఆవిష్కరించనుంది. ఈ చిత్రానికి జోమోన్ టీ. జాన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాష్ కొల్లో ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తుండగా, సృజన అడుసుమిల్లి ఎడిటింగ్ అందిస్తున్నారు.



మఖ్దూం భవన్‌లో

# సంబురాలు

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షులు బి.వెంకటేశం, ప్రధాన కార్యదర్శి ఎం.నర సింహ, కార్యనిర్వాహక అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఎంప్లాయిస్ యూ నియన్ సలహాదారులు కె.పద్మాకర్, అధ్యక్షులు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డి.గోపాల్, జి.డి.ప్రసాద్ రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎస్.మూర్తి, మారగోని ప్రవీణ్ కుమార్, ఆటో యూనియన్ నా యకులు ఉమర్ ఖాన్, బిక్షపతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.నారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాజకీయ కోణంలో వ్యవహరిస్తూ కమూ ్యనిస్టులను ఓడించాలనే వైఖరి తీసుకోవడం సమంజసం కాదని విమ ర్శించారు.

కేవలం ఎన్నికల గెలుపుగా చూడబోమని, కార్మికుల సమస్యల పరిష్కారానికి తమకు లభించిన బాధ్యతగా భావిస్తున్నామని వెంకన్న పేర్కొన్నారు. ఎస్.బాబు మాట్లాడుతూ కార్మికులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఆర్‌టిసి ప్రభుత్వ విలీన లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగుతామని వెల్లడించారు. పెండింగ్ సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. టిఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.థామస్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు సంస్థ పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. ఎండి.మౌలానా మాట్లాడుతూ ఉద్యోగుల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమన్నారు. వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమోషన్లు, బదిలీలు, పని పరిస్థితులు వంటి ప్రతి అంశంలో కార్మికులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎఐటియుసి అను బంధ ఎంప్లాయిస్ యూనియన్ ఐక్యకూటమి సాధి ంచిన విజయాన్ని కార్మి కుల ఆత్మగౌరవ విజ య ంగా సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ అభివర్ణించారు. హిమాయత్ నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వ ర్యంలో ఎంప్లాయిస్ యూనియన్ విజయం పట్ల నాయకులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టి సంబ రాలు చేశారు. ఈ కార్య క్రమంలో కె.నా రాయణతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఎఐటి యుసి గౌరవ ధ్యక్షులు ఎండి. యూసుఫ్, రాష్ట్ర

**మఖ్దూం భవన్‌లో బాణాసంచా**

ఆర్‌టిసి కార్మికుల పోరాటానికి ఎర్రజెండా అండగా నిలుస్తుందని, కార్మికుల ఐక్యశక్తి ముందు పాలకుల నిర్లక్ష్య ధోరణులు నిలవ లేవని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నర్సింహ అన్నారు. శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ వద్ద పార్టీ నా యకులు బాణాసంచా కాల్చి సంబురాలు చేసు కున్నారు. కార్మిక పోరాటాలు, కార్మిక ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు.ఈ సంద ర్భంగా ఈ.టి. నర్సింహ మాట్లాడుతూ, ఎని ్నకల విజయ స్ఫూర్తితో ఆర్‌టిసిని ప్రభు త్వంలో విలీనం చేసే వరకు కార్మికులు ఐక్య ంగా పోరాటం కొనసాగించాలని పిలుపు నిచ్చారు.

## విలీనం సాధించే వరకు అదే స్ఫూర్తితో పోరాడాలి: పల్లా వెంకట్‌రెడ్డి



ఆర్‌టిసి కార్మికుల తీర్పు.. ప్రభుత్వానికి గట్టి చెంపపెట్టు అని ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే వరకు పోరాటం ఆగబోదని సిపిఐ జాతీ య కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమికి కార్మి కులు అద్భుత విజయాన్ని అందించడం ద్వారా ప్రభుత్వానికి బలమైన సంకేతం పంపారని ఆయన పేర్కొన్నారు. ఇదే ఐక్యత, పట్టుదలతో ఆర్‌టిసిని ప్రభుత్వం లో విలీనం చేసే వరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ నాయకత్వంలో టిఎంయూ, ఎన్ఎంయూ కలిసి కూటమిగా పోటీ చేసి విజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ విలీనం తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు కోరినా ప్రభుత్వం ఎన్నికలకే మొగ్గుచూపిందని విమర్శించారు. పోరాడే నాయకత్వానికే బాధ్యతలు అప్పగించాలన్న కార్మికుల ఆకాంక్ష ఈ విజయంతో స్పష్టమైందన్నారు. ఎంప్లాయిస్ యూనియన్‌ను ఓడించేందుకు కొందరు మం త్రులు, ఎమ్మెల్యేలు ఎన్ని ప్రయత్నాలు చేసినా కార్మికులు ఐక్యంగా నిలిచి అన్ని డిపోల పరిధిలో మెజారిటీ అందించడం అభినందనీయమన్నారు. ఈవిజయం దా ్వరా కార్మికులు కొత్త చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. విజయాన్ని సాధించిన ఎంప్లాయిస్ యూనియన్, టిఎంయూ,ఎన్ఎంయూ నాయకత్వాలకు వారికి అండగా నిలిచిన ఎఐటియుసి నాయకులకు సిపిఐ తరుపునపల్లా వెంకట్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్సీ నెల్లికంటి హర్షం



ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికల్లో కార్మికుల హక్కుల కోసం పోరాడే ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని గెలిపించి,అద్దె సంఘాలకు మద్దతిచ్చిన కాంగ్రెస్ ప్రయత్నాలకు కార్మికులు ఓటుతో గట్టి సమాధానం చెప్పారని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. కార్మికుల పక్షాన నిలిచే సంఘాలకే తమ మద్దతు ఉంటుందని ఈ విజయం ద్వారా ఆర్‌టిసికార్మికులు స్పష్టమైన సందేశం ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, వేతనాలు, మెరుగైన పని పరిస్థితుల కోసం ఎంప్లాయిస్ యూనియన్ కూటమి గతంలో అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తుచేశారు. ఈ ఎన్నికల విజయం కూటమిపై కార్మికులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. విజయంతో మరింత బాధ్యత పెరిగిందని, కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగించాలని సూచించారు. కూటమి విజయానికి కృషి చేసిన కార్మికులందరికీ అభినందనలు సత్యం తెలిపారు.

# ప్రజల పక్షాన, ప్రజాసేవకై నిరంతరం తపించే నేత 'కొలను వీరేందర్ రెడ్డి'

● ఇరవై ఏళ్లుగా ప్రజాక్షేత్రంలోనే.. బాచుపల్లి అభివృద్ధిలో తనదైన ముద్ర



కరోనా సమయంలో శానిటేషన్ వర్కర్‌లకు వంట సామాగ్రిని అందజేస్తున్న వీరేందర్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి

ప్రజాపక్షం/నిజాంపేట్ : వినయానికి, విధేయతకు మారు పేరుగా కొలను వీరేందర్ రెడ్డి మారుమ్రోగుతుంది. సుమారు ఇరవై ఏళ్లుగా ప్రజాక్షేత్రంలోనే ఉంటూ బాచుపల్లి అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. నిరంతరం ప్రజల పక్షాన, ప్రజాసేవలోనే కొనసాగుతూ ఇటు అభివృద్ధిలో, అటు సామాజిక సేవలో నిమగ్నమయ్యారు. పదవి ఉన్నా లేకున్నా, పార్టీలకతీతంగా పేద ప్రజలకు కొలను వీరేందర్ రెడ్డి సేవలందిస్తూనే ఉన్నారు. చిన్నా పెద్ద అనే తారతమ్యం లేకుండా ఆపదలో ఉన్న వారికి, సమస్యల కోసం వీరేందర్ రెడ్డిని కలిస్తే చాలు ఇట్టే స్పందించి తక్షణం పరిష్కరించి తనదైన శైలిలో పేరు ప్రఖ్యాతలను కొలను వీరేందర్ రెడ్డి సంపాదించుకున్నారు. కొలను వీరేందర్ రెడ్డి తండ్రి స్వర్గీయ కొలను పద్మారెడ్డి 1972 సంవత్సరం నుండి బాచుపల్లి గ్రామ సర్పంచ్‌గా పదకొండు సంవత్సరాల పాటు సేవలందించారు. తండ్రి చూపిన బాటలోనే పయనిస్తూ తండ్రికి తగ్గ తనయుడు అని పేరుని కొలను వీరేందర్ రెడ్డి సంపాదించుకున్నారు. 2008 నుండి 2014 సంవత్సరం వరకు బాచుపల్లి గ్రామ వార్డు సభ్యునిగా గెలుపొందిన కొలను వీరేందర్ రెడ్డి ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఉపసర్పంచ్‌గా ఉన్న సమయంలోనే గ్రామ పంచాయతీ నిధులైన మూడు కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశారు. ఆ తరువాత 2014 నుండి 2019 సంవత్సరంలో మళ్లీ గ్రామ వార్డు సభ్యునిగా ఎన్నికై బాచుపల్లి అభివృద్ధిలో కొలను వీరేందర్ రెడ్డి తనదైన ముద్రను వేసుకున్నారు. 2020 సంవత్సరంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌గా ఎన్నికైన కొలను వీరేందర్ రెడ్డి 2025 సంవత్సరం వరకు రూ.18 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేశారు. అనంతరం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి సహకారంతో రూ.5 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులను చేశారు. కార్పొరేటర్‌గా పదవి కాలం ముగిసినా అభివృద్ధి పనులను, సేవా కార్యక్రమాలను కొలను వీరేందర్ రెడ్డి కొనసాగిస్తూనే ఉన్నారు. సాయి అనురాగ్ కాలనీలో రూ.3 కోట్లు, కావ్యా ఏవెన్యూలో రూ.4 కోట్లు, రేణుక ఎల్లమ్మ కాలనీలో రూ.1 కోటి, నందనవనం కాలనీలో రూ.4 కోట్లు, ఎస్‌జెబి హిల్స్‌లో రూ.50 లక్షలు, శ్రీ హోమ్స్ కాలనీలో రూ.3 కోట్లు, కాకతీయ కాలనీలో రూ.60 లక్షలు,



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కొలను వీరేందర్ రెడ్డి

రూ.5 కోట్లు ఈ విధంగా కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, పైపులైన్‌లు, పార్కుల అభివృద్ధి కార్యక్రమాలను కొలను వీరేందర్ రెడ్డి చేశారు. ప్రభుత్వ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలే కాకుండా సామాజిక సేవలను సైతం చేస్తూ కొలను వీరేందర్ రెడ్డి అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కరోనా సమయంలో పేదలకు, శానిటేషన్ వర్కర్‌లకు బియ్యం, వంట సామాగ్రిని, ఎంఎల్‌ఏ, ఎంఎల్‌సి ద్వారా ఒక లక్ష రూపాయల చెక్కును ప్రభుత్వానికి అందజేశారు. బాచుపల్లిలోని సాయి అనురాగ్ కాలనీలో కాలనీ వాసుల సౌకర్యార్థం సొంత ఫండ్‌తో కమిటీ హాల్‌లో గదులను, దుర్గామాత షెడ్డుని నిర్మించారు. కావ్యా ఏవెన్యూ కాలనీలో దుర్గా మాత షెడ్డు, సాంస్కృతిక కార్యక్రమాల నిమిత్తం సౌండ్ సిస్టమ్‌ని కొలను వీరేందర్‌రెడ్డి వేయించారు. రేణుక ఎల్లమ్మ కాలనీలో సిసి కెమెరాలను, ఓపెన్ జిమ్‌ని ఏర్పాటు చేశా రు. నందన వనం కాలనీలో చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు సామాగ్రిని ఏర్పా టు చేయించారు. శ్రీ హోమ్స్‌కాలనీలో గణపతి షెడ్డు, పార్కులో చిన్నారులకు ఆట సామాగ్రిని, బాచుపల్లిలో వైకుంఠధామంలో షెడ్డుని, కాకతీయ కాలనీ పార్కులో సామాగ్రిని సొంత నిధులను కొలను వీరేందర్ రెడ్డి ఖర్చు చేసి అభివృద్ధి చేశారు. యువకులకు క్రికెట్ టోర్నమెంట్‌ని ఏర్పాటు చేసి యువతను వీరేందర్ రెడ్డి ప్రోత్సహించారు. పలు కాలనీలలో ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుంటూ మొక్కలను నాటు తూ పచ్చదనాన్ని పెంచుతున్నారు. ఏ కాలనీ నుండి ప్రజలు వీరేందర్ రెడ్డి వద్దకు వచ్చి సమస్యలను విన్నవిస్తే తక్షణమే సమస్యను పరిష్కరించే వరకు అధికారులతో మాట్లాడుతూ అండ గా ఉంటారు. ప్రజలతో మమేకమై సామాజిక సేవలను చేస్తూ తిరుగులేని నాయకుడని కొలను వీరేందర్ రెడ్డి తనదైన ముద్ర వేసుకుంటున్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజాక్షేత్రంలోనే ఉంటానని, నిరంతరం ప్రజలకు సేవలందిస్తూనే ఉంటానని కొలను వీరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. బాచుపల్లిలో కోట్లాది రూపాయల నిధులను తీసుకువచ్చి కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించానని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మరిన్ని నిధులను తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలను చేపడతానని పేర్కొన్నారు. నిరుపేద ప్రజలకు తన వంతు సహాయ, సహకారాలను ఎళ్లవేళలా అందిస్తానని వీరేందర్ రెడ్డి అన్నారు.



కాలనీలో మొక్కలు నాటుతున్న వీరేందర్ రెడ్డి



పేదలకు వంట సామాగ్రిని అందజేస్తున్న మాజీ సర్పంచ్ కొలను పద్మారెడ్డి, పక్కన వీరేందర్ రెడ్డి

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com